



యర్రగొండపాలెంలో 15 ముఖాల వినాయకుడు



ద్వారకా నగర్‌లో 21 అడుగుల గణనాథుడు



సుజాతనగర్‌లో 1008 టెంకాయలతో..



కొణిజేడు బస్టాండ్ వద్ద నరసింహావతారంలో

గం.. గం.. గణేశా!

గణనాథుడి నవరాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా మొదలయ్యాయి. జిల్లా వ్యాప్తంగా వీధివీధినా లంబోదరుడి బొమ్మలు కొలువుదీరాయి. డీజే శబ్దాలతో వీధులన్నీ మోతెక్కాయి. 'జై బోలో గణేశ్ మహరాజ్ కీ జై' అంటూ వాడవాడలా నినాదాలు మిన్నంటాయి. పలుచోట్ల వైవిధ్యభరితమైన ఆకృతులతో వెలిసిన వినాయకుడి విగ్రహాలు భక్తులను ఆకర్షించాయి. ఒంగోలులోని దక్షిణం బజారులో 6,116 శంఖువులతో రూపుదిద్దుకున్న 35 అడుగుల గణేశుడి విగ్రహం విశేషంగా ఆకట్టుకుంది. పలు ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పూజలు చేశారు. గోపాల్‌నగర్‌లో ఆదిశేషువు ఆకారంలోనూ, రంగుతోటలో ముత్యాలతోనూ ఏర్పాటు చేసిన విగ్రహాలు మైమరపించాయి. యర్రగొండపాలెంలో 15 ముఖాలతో కూడిన వినాయకుడిని చూసేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. పూజలు చేసి మొక్కుకున్నారు. వివరాలు లోపలి పేజీల్లో..

డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

తొలిరోజు 568 మందికి కేటాయింపు
మందకొడిగా సాగుతున్న ప్రక్రియ



నంబర్లు చెక్ చేసుకుంటున్న అభ్యర్థులు

ఒంగోలు విద్య, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ టీచర్ పోస్టుల్లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారం స్థానిక చెరువుకొమ్ముపాలెంలోని శ్రీసరస్వతి జూనియర్ కళాశాలలో ప్రారంభమైంది. సర్టిఫికెట్ల పరిశీలనకు మొదటి రోజు 568 మంది అభ్యర్థులను కేటాయించగా అందరూ హాజరయ్యారు. పరిశీలనకు 18 బృందాలను ఏర్పాటుచేయగా ప్రస్తుతం కేవలం 12 బృందాలను మాత్రమే వినియోగించుకుంటున్నారు. ఒక్కొక్క బృందానికి 50 మంది అభ్యర్థులను కేటాయించారు. మిగిలిన ఆరు బృందాలను రిజర్వులో ఉంచారు. అభ్యర్థులు ఏ పోస్టుకు ఎంపికైంది స్పష్టత ఇవ్వకుండా వారు ఏయే పోస్టులకు అర్హత సాధించారో వారందరికీ కాల్‌లెటర్లు, మెసేజ్‌లు పంపారు. జిల్లాలో ప్రభుత్వ, జడ్పీ, ఎంపీపీ, మునిసిపల్ యాజమాన్యంలో 629 పోస్టులు ప్రకటించగా మొదటిరోజు 567 మందిని మాత్రమే సర్టిఫికెట్ల పరిశీలనకు పిలిచారు. గిరిజన సంక్షేమ, చెంచు పాఠశాలలకు 43 పోస్టులు మిగతా 6లో...

పెద్దపులి పాదముద్రలు

● నిర్ధారించిన ఫారెస్ట్ అధికారులు



దర్గా గ్రామ పొలాల్లో పెద్దపులి పాదముద్రలు

కంభం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలం దర్గా గ్రామ వ్యవసాయ పొలంలో పెద్ద పులి పాదముద్రలను అటవీ శాఖ అధికారులు గుర్తించారు. గురువారం రైతు ఇచ్చిన సమాచారంతో ఫారెస్ట్ అధికారులు పాదముద్రలను పరిశీలించారు. తురిమెళ్ల రేంజ్ ఫారెస్ట్ ఆఫీసర్ మధు ప్రియాంక విలేకరులతో మాట్లాడుతూ దర్గా గ్రామానికి చెందిన మిగతా 6లో...



పొగాకు కిలో రూ.300

● ఈ సీజన్‌లో ఇదే అత్యధికం

ఒంగోలు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): దక్షిణాది పొగాకు మార్కెట్లో గత వారం పదిరోజులుగా గరిష్ఠ ధరలు పెరుగుతుండగా గురువారం కిలో రూ.300 పలికింది. పలు కేంద్రాల్లో మేలురకం బేళ్ల కోసం పోటీపడుతున్న వ్యాపారులు క్రమంగా గరిష్ఠ ధరలు పెంచుతున్నారు. దక్షిణాదిలో 11 వేలం కేంద్రాలు ఉండగా మూడుచోట్ల అధికారికంగా అనుమతించిన పంట కొనుగోళ్లు పూర్తి కావడంతో వాటిని తాత్కాలికంగా ఆపారు. మిగిలిన ఎనిమిది కేంద్రాల్లో ఐదుచోట్ల ధర గురువారం కిలో రూ.300 పలికింది. ప్రస్తుత సీజన్‌లో ఇదే అత్యధిక ధర. అయితే లోగ్రేడ్ బేళ్ల నోబిడ్‌లు మాత్రం ఇంకా గణనీయంగానే సాగుతున్నాయి. గురువారం మార్కెట్లో కూడా మిగతా 6లో...

అక్రమాలు నిగ్గుతేల్చడంలో జాప్యం

● తప్పించుకునేందుకు కొందరు ప్రయత్నాలు



కురిచేడులో ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న అధికారులు

దర్శి ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఎరువులు, విత్తనాల విక్రయాల్లో జరిగిన అక్రమాలను నిగ్గు తేల్చటంలో జాప్యం జరుగుతోంది. దీంతో అక్రమార్కులు తప్పించుకునేందుకు పలురకాల ప్రయత్నాలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎరువులు దుర్వినియోగం కాకుండా, నాణ్యమైన విత్తనాలను రైతులకు అందించాలనే లక్ష్యంతో అక్రమ వ్యాపారాలను కట్టడి చేసేందుకు విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులను రంగంలోకి దింపింది. దర్శి-పొదిలి ప్రాంతాలతో పాటు జిల్లావ్యాప్తంగా విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ముమ్మరంగా దాడులు నిర్వహించారు. దర్శి మండలంలోని మిగతా 6లో...

ఒంగోలు డెయిరీపై ప్రభుత్వం దృష్టి
మంత్రి స్వామి చొరవతో కదలిక
జేసీ నేతృత్వంలో అధికారుల కసరత్తు
ఆస్తులు, అప్పులపై వివరాల సేకరణ
తదుపరి నిర్వహణపై ఇటీవల కొందరు
పాల సంఘాల ప్రతినిధులతో జేసీ భేటీ
తొలుత ఆస్తుల పరిరక్షణ
గ్రామస్థాయి సంఘాల స్థితిగతులపై ఫోకస్
గత వైసీపీ పాలనలో పాలకేంద్రం మూత
అమూల్‌కు అప్పజెప్పే ప్రయత్నం



పునరుద్ధరణ దిశగా..

జిల్లాకు తలమానికంగానూ, పాడిరైతులకు ఊతంగానూ దశాబ్దాల పాటు నిలిచిన ఒంగోలు డెయిరీకి మళ్లీ మంచిరోజులు రాబోతున్నాయి. గత వైసీపీ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా మూతవేయగా ప్రస్తుత ప్రజాప్రతినిధులు దానిని పునరుద్ధరించే దిశగా అడుగులు వేస్తున్నారు. జిల్లాకు చెందిన మంత్రి స్వామి చొరవ చూపి ప్రభుత్వంలో ఉన్నత స్థాయిలో కదలించడంతో తదనుగుణంగా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. జేసీ నేతృత్వంలో అధికారులు గతంలో డెయిరీ డైరెక్టర్లుగా పనిచేసిన పాలకేంద్రాల అధ్యక్షులతో ప్రత్యేక భేటీ నిర్వహించారు. వారి నుంచి సమాచారం సేకరించారు. తొలుత డెయిరీకి ఉన్న ఆస్తులు, అప్పులపై వివరాలు సేకరించారు. వాటి రక్షణపైనా, పాల సరఫరాల స్థితిగతులపైనా దృష్టిసారించారు. తదనుగుణంగా జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బి.రవి, డెయిరీ మేనేజర్ రాజమోహన్ అందుకు అవసరమైన నివేదికలు సిద్ధం చేస్తున్నారు.

ఒంగోలు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు డెయిరీకి దశాబ్దాల చరిత్ర ఉంది. ఉమ్మడి జిల్లా ఆవిర్భావం 1970 ఫిబ్రవరిలో జరగ్గా అనంతరం ఐదేళ్లకు 1975లో ఒంగోలు కేంద్రంగా చిన్నపాటి పాలసేకరణకేంద్రంగా ఒంగోలు డెయిరీ ఆవిర్భవించింది. క్రమంగా వృద్ధి చెందుతూ తొలుత అప్పటి సీఎం ఎన్టీఆర్ సహకారం, అనంతరం చంద్రబాబు ప్రోత్సాహంతో పాలక వర్గాలు డెయిరీని అభివృద్ధి చేస్తూ వచ్చాయి. అలా వృద్ధిచెంది రోజుకు మూడు లక్షల లీటర్ల పాలను పొడి తయారు చేసి ఫ్యాక్టరీతో సహా ఒంగోలుతో పాటు దర్శి, కొండమంజులూరు, కంభం, వైపాలెం, కనిగిరి తదితర ప్రాంతాల్లో కలిపి మొత్తం 108 ఎకరాల భూమి, భవనాలు, మిషనరీ డెయిరీకి ఒనగూరాయి. ప్రస్తుతం ఆ ఆస్తుల విలువ రూ.1,500 కోట్లకుపైగానే ఉంటుంది. గతంలో పలుమార్లు సంక్షోభంలో పడినప్పుడు టీడీపీ పర్యవేక్షణలో పాలకవర్గాలు ఉండగా ఒకసారి నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్‌డీడీబీ) భాగస్వామ్యంతో నడిపి గట్టెక్కించారు. తర్వాత 2014-19 మధ్యకాలంలో నాటి సీఎం చంద్రబాబునాయుడు స్పందించి రూ.45 కోట్ల నిధులు ఇచ్చి నిలిపారు. అనేక ఆటుపోట్లు ఎదుర్కొని నడుస్తున్న ఒంగోలు డెయిరీ పరిధిలో ఉమ్మడి జిల్లాలో 675 గ్రామస్థాయి సంఘాలు, వాటి పరిధిలో 45 వేల మంది పాడిరైతులు ఉండగా ఒకప్పుడు రోజుకు లక్ష లీటర్ల పాల సేకరణ ఉండేది. ప్రైవేటు డెయిరీల పోటీతో కొంత ప్రతికూల పరిస్థితులు ఉన్నా రోజుకు 40 వేల నుంచి 50వేల లీటర్ల పాలసేకరణతో పాటు పాలపొడి ఫ్యాక్టరీ ద్వారా వచ్చే లాభంతో 2013లో అప్పటి పాలకవర్గం బోనస్‌లు కూడా పంచింది. అనంతరం 2016 నాటికి కొంత ప్రతికూల పరిస్థితి ఎదురుకాగా అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.45 కోట్లు ఆర్థిక సాయం అందించి పాలకమండలి స్థానంలో అధికారుల పర్యవేక్షణ పెంచింది.



డెయిరీ పునరుద్ధరణపై అధికారులు, పూర్వపు పాల సంఘాల అధ్యక్షులుతో జేసీ గోపాలకృష్ణ సమావేశం (ఫైల్)

పునరుద్ధరణపై అప్పుడే హామీ

గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు జిల్లాలో కీలక అంశాలపై చర్చలు, అంతకు ముందు ఒంగోలులో మహానాడు జరిగిన సందర్భంగా జిల్లా టీడీపీ నేతలు డెయిరీ అంశాన్ని అధిష్ఠానం దృష్టికి తెచ్చారు. ఈక్రమంలో 2023లో జిల్లాలో యువనేత మిగతా 6లో...

సమాధి కట్టిన వైసీపీ

వైసీపీ అధికారంలోకి వచ్చాక ఒంగోలు డెయిరీని అభివృద్ధి చేయకపోగా మూతేసింది. డెయిరీని ఆదుకొని లాభాల బాట పట్టిస్తామని, పాడిరైతుకు లీటర్‌కు రూ.4మేర బోనస్ ఇస్తామని తొలుత చెప్పిన వైసీపీ అధినేత జగన్ అనంతరం మాట మార్చి అమూల్ సేవలో తరిస్తూ డెయిరీకి సమాధికట్టారు. డెయిరీలో అమూల్ సేవలకు శ్రీకారం పలికారు. అలా 2020 డిసెంబరులో డెయిరీని మూసేసి సుమారు రూ.150 కోట్ల ప్రభుత్వ నిధులు వెచ్చించి గ్రామాల్లో పాలసేకరణ పరికరాలు, ఇతర సౌకర్యాలు కల్పించి జిల్లాలో అమూల్ కార్యక్రమాలకు అవకాశం కల్పించారు. పలుశాఖల అధికారులు అమూల్ సేవకు వినియోగించడంతోపాటు డెయిరీ అవరణలోనే కార్యక్రమాలు కొనసాగించారు. అందుకు వీలుగా 2013 కంపెనీ యాక్టులో ఉన్న ఒంగోలు డెయిరీని చట్టం మార్పు చేసి ఏపీ పాడి సమాఖ్య పరిధిలోకి చేర్చి మరీ అమూల్‌కు సేవలు అందించారు. అయితే ప్రభుత్వ చర్యల వల్ల డెయిరీ మూతపడింది తప్ప అమూల్ జిల్లాలో విస్తరించలేదు. డెయిరీ విషయంలో వైసీపీ ప్రభుత్వ తీరుపై పాడిరైతుల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది.



రామసముద్రంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి రాగి తీగను తస్కరించిన దొంగలు

పొలాల్లో దొంగలు

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ
కేబుల్ వైర్ల కత్తిరింపు
కొన్నిసార్లు పండించిన పంట కూడా మాయం

త్రిపురాంతకం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి పంటలు పండించడంలో ఎన్నో ఒడిదొడుకులు దాటుకుని అన్నింటినీ అధిగమిస్తున్న రైతన్నలకు పొలాల్లో దొంగల దోపిడీ పెద్ద తలనొప్పిగా మారింది. పంటలపై తెగుళ్ల దాడిని పురుగు మందులతో తిప్పికొట్టవచ్చు గానీ, దొంగలదాడిని ఎలా కనిపెట్టి ఎదుర్కోవాలా అని రైతులు తలలు పట్టుకుంటున్నారు. ఇటీవల కాలంలో పొలాల్లో కొన్ని వస్తువులను దొంగలు చోరీ చేయడం ప్రారంభించారు. గతనెల 23వ తేదీన త్రిపురాంతకం మండలం రామసముద్రంలో రైతుల పొలాల్లోని రెండు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రాగితీగలను చోరీ చేశారు. గతంలో విశ్వనాథపురం, గొల్లపల్లి గ్రామాల్లో కూడా ఇదే తరహా దొంగతనాలు జరిగాయి. పుల్లలచెరువు మండలం తెల్లగట్ల, కొమరోలు, ఐటివరం గ్రామాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులగొట్టి రాగి తీగలను ఎత్తుకెళ్లిన ఘటనలు ఉన్నాయి. గతంలో పలుచోట్ల సోలార్ ఫెన్సింగ్‌కు వినియోగించిన ప్లేట్లు, బ్యాటరీలను కూడా ఎత్తుకెళ్లారు. రెండు రోజుల కిందట మిగతా 6లో...



గుంటూరు రోడ్‌లోని బ్రిడ్జి వద్ద జరుగుతున్న పూడిక తీత పనులు

చురుగ్గా పోతురాజు కాలువ ఆధునికీకరణ పనులు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మురుగునీటి పారుదల వ్యవస్థకు ప్రధాన కాలువైన పోతురాజు కాలువ ఆధునికీకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ మేరకు స్థానిక గుంటూరు రోడ్‌లోని పోతురాజు కాలువ బ్రిడ్జి వద్ద భారీ ఎక్స్‌కవేటర్‌లను ఏర్పాటు చేసి పూడిక తీత పనులు చేపట్టారు. ఇటీవల వరుసగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగరంలో వర్షం నీరు నిలవకుండా, అలాగే మురుగునీరు పారుదల సక్రమంగా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనరు వెంకటేశ్వరరావు ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. దీంతో రెండు రోజులుగా పనులు ముమ్మరం అయ్యాయి. అతి త్వరలోనే పోతురాజు కాలువలో పూడిక తీత పనులు పూర్తి స్థాయిలో చేపట్టి నగరంలో మురుగునీటి పారుదల వ్యవస్థకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు.



హాస్టల్ వార్డెన్‌తో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

హాస్టల్‌ను శుభ్రంగా ఉంచాలి

● సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): హాస్టల్లో శుభ్రత లేకపోవడంపై సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక నాగులవరం రోడ్డులోని ఏపీ ట్రైబల్ హాస్టల్‌ను ఆయన పరిశీలించారు. హాస్టల్‌లో గిరిజన బాలికలకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి రూమ్‌లలో ఫ్యాన్లు లేవని, శుభ్రత పాటించటం లేదని గమనించి వార్డెన్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. స్నానాల గదులు, పరిసరాల ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. బాలికలతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులతో మమేకమై చదువులో ఎలా ఉన్నారో భవిష్యత్‌లో ఏం కావాలని కోరుకుంటున్నారో తెలుసుకున్నారు. కష్టపడి, క్రమశిక్షణతో చదువుకొని ఎదగాలని త్రివినాగ్ బాలికలకు సూచించారు.



బంకు వద్ద కేసు రాస్తామంటూ బెదిరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఎక్సైజ్ సిబ్బంది దందా

తర్లుపాడు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు బెల్టు షాపుల వద్ద, టీ బంకుల వద్ద తాగుతున్న మందు బాబుల నుంచి పొదిలి ఎక్సైజ్ శాఖ సిబ్బంది వసూళ్ల దందాకు పాల్పడుతున్నారు. తర్లుపాడులో ఒక బంకు వద్ద మందు తాగుతున్న ఇద్దరిపై కేసు రాస్తామంటూ అంటూ బెదిరించారు. విషయం తెలుసుకున్న విలేకరి అక్కడకు వెళ్లి ఫొటో తీస్తుండగా వారు మెల్లగా జారుకున్నారు. సీఐ కారు డ్రైవర్, కానిస్టేబుల్ ఈ వ్యవహారానికి పాల్పడినట్లు తెలిసింది. గంట తర్వాత మరలా బంకు వద్దకు ఎక్సైజ్ సీఐ, సిబ్బంది వచ్చి బంకు నిర్వాహకురాలికి మేము ఇక్కడికి రాలేదని చెప్పాలని హుకుం జారీ చేశారు. లేదంటే కేసు నమోదు చేస్తామని బెదిరించినట్లు సమాచారం. మండలంలో యథేచ్ఛగా బెల్టు షాపుల నిర్వాహకుల వద్ద నుంచి సీఐ కారు డ్రైవర్, కానిస్టేబుల్ నెలనెలా వచ్చి మామూళ్లు తీసుకుంటున్నట్లు తెలిసింది.

గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం

రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక



శ్రీరామ్



వెంకట్రావు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒంగోలులో జరిగిన సంఘం రాష్ట్ర మహాసభలో తొమ్మిది మందిని రాష్ట్ర ఆఫీస్‌బేరర్స్‌గా, 17 మందిని కమిటీని ఎన్నుకున్నారు రాష్ట్ర అధ్యక్షుడిగా గంటా శ్రీరామ్, కార్యదర్శిగా పూసపాటి వెంకట్రావు, ఉపాధ్యక్షుడిగా కిలారి పెద్దాబ్బాయి, సహాయకార్యదర్శులుగా ఏవీ కృష్ణారావు, తోట తిరుపతిరావు, పాపిన సాంబమూర్తి, దాసరి జనార్దన్, గోకాడ దేవుడు నాయుడు, కురవ రాముడు, కమిటీ సభ్యులుగా కే ఈశ్వరరావు, ఆర్. అచ్యుతరావు, పోతురాజు, పీవీ ఆంజనేయులు, జి.రామకృష్ణ, బి. ఆంజనేయులు, ఎం. శేషు, డి. శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. మహాసభలోచేసిన తీర్మానాలను గురువారం పత్రికలకు విడుదల చేశారు. గొర్రెల కాపరుల రక్షణ కోసం సామాజిక రక్షణ చట్టాన్ని తేవాలని, ప్రతి గ్రామంలో మేత భూములు, నీటి వసతి కల్పించి వలసలు నివారించాలని, ప్రైవేటు మార్కెట్లో దోపిడీని అరికట్టి ప్రభుత్వమే మార్కెట్ సౌకర్యం కల్పించాలని తదితర తీర్మానాలను చేశారు.

కూటమి పాలనలో పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి

● విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

● సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి రవికుమార్

అద్దంకి, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆధ్వర్యంలో ప్రజాకూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన నాటి నుంచి నియోజకవర్గంలో మొత్తంలో 1,100 మందికి పైగా సీఎంఆర్ఎఫ్ నిధులు అందజేసినట్లు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. పట్టణంతో పాటు మండలంలోని జార్లపాలెంలో పలు కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెద్దఎత్తున సీఎం ఆర్ఎఫ్ నిధులు అందజేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో మరో 500 మందికి త్వరలో చెక్కులను అందజేస్తామన్నారు. గురువారం 35 మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మంత్రి రవికుమార్ అందజేశారు. జార్లపాలెంలో రూ.కోటి వ్యయంతో చేపట్టనున్న జార్లపాలెం-చెరువుకొమ్ముపాలెం తారురోడ్డుకు శంకుస్థాపన చేశారు. రూ.20 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ లు, అద్దంకి-శేణింగవరం రోడ్డు నుంచి దాసుల కాలనీ వరకు రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఎన్‌టీఆర్ సుజల ఆర్వో ప్లాంట్ ను ప్రారంభించారు. గ్రామంలో మిగిలిపోయిన సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్లను విద్యుత్ సమస్యలను, మంచినీటి సమస్య తదితర సమస్యలను గ్రామస్థులు మంత్రి దృష్టికి తీసుకుపోయి పరిష్కరించనున్నట్లు తెలిపారు. ముందుగా అద్దంకి పట్టణంలోని శింగరకొండ రోడ్డులో హిట్‌జోన్ ఇండోర్ క్రీడాకేంద్రాన్ని, ఒంగోలు రోడ్డులో ఎస్‌వీ కన్వెన్షన్‌ను మంత్రి రవికుమార్ నర్సరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ క్రికెట్ బ్యాటింగ్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో శింగయ్య, విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, టీడీపీ జిల్లా వైద్యవిభాగం అధ్యక్షులు చదలవాడ ఫణీంద్రబాబు, నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, ఎంపీటీసీ సభ్యుడు మలాది కోటేశ్వరమ్మ నటరాజ్, సర్పంచ్ మల్లవరపు సుశీల, యేనుగంటి వెంకట్రామయ్య(బాబు), ధూళిపాళ్ల వీరాస్వామి, భార్గవ, సుబ్రహ్మణ్యం, చిరంజీవి, కౌన్సిలర్ సుభాషిణి లహరి, కుందారపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సీఎం సహాయ నిధి వరం

21 మందికి చెక్కులు అందజేసిన ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఆపద సమయంలో వైద్యశాలలో చికిత్స పొందిన వారికి వెంటనే స్పందించి ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎం సహాయ నిధి సాయాన్ని మంజూరు చేస్తున్నారని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. పార్టీ కార్యాలయంలో గురువారం 21 మంది ఆపన్నులకు రూ.17,94,513 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను ఎరిక్షన్‌బాబు బాధితులకు పంపిణీ చేశారు. వైద్యం చేయించుకున్న పేదకు సాయం అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు పాల్గొన్నారు.

మార్కాపురంలో..



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎరిక్షన్‌బాబు

మార్కాపురం : మార్కాపురం పట్టణానికి చెందిన 9 మందికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను గురువారం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి సతీమణి వసంతలక్ష్మి ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆలస్యం లేకుండా ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేస్తోందన్నారు. సుమారు రూ.9.10 లక్షల విలువ గల చెక్కులను రోగులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ గుంటక కృష్ణవేణి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, కనిగిరి బాలవెంకటరమణ, పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పఠాన్ ఇబ్రహీంఖాన్, మేడిద రంగస్వామి, చిట్యాల చంద్రశేఖర్‌రెడ్డి, దూపాటి యలమంద పాల్గొన్నారు.

డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

(5వపేజీ తరువాయి)

ప్రకటించగా ఆ అభ్యర్థులకు జోనల్ స్థాయిలో గుంటూరులో సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుంది.

మందకొడిగా పరిశీలన కార్యక్రమం

జిల్లాలో సర్టిఫికెట్ల పరిశీలన మందకొడిగా సాగుతోంది. అభ్యర్థులు మాత్రం అధికారులు ప్రకటించిన మేరకు ఉదయం 9 గంటలకు పరిశీలన కేంద్రానికి చేరుకున్నారు. మొత్తం ఆన్‌లైన్‌లో జరుగుతోంది. అభ్యర్థి ఎన్ని పోస్టులకు అర్హత సాధించినా ఒక్క కాల్‌లెటర్ మాత్రమే వచ్చింది. మెరిట్ జాబితాలో ఏయే సబ్జెక్టుల్లో పేరున్నా అన్ని పోస్టులకు అవసరమైన సర్టిఫికెట్లను అభ్యర్థులు ముందుగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసుకుని పరిశీలనకు ఒరిజనల్స్‌ను, మూడు సెట్ల జెరాక్స్ కాపీలతో హాజరయ్యారు. పరిశీలన బృందాల్లో ముగ్గురు సభ్యులను నియమించారు. ఎంఈవో, హెచ్‌ఎం, రెవెన్యూ అధికారి ఒక్కొక్కరు ఉంటారు. వీరిలో ఒకరి లాగిన్‌కు అభ్యర్థుల వివరాలు వస్తాయి. ఆ అధికారి తన సీఎఫ్ఎంఎస్ నెంబరు పాస్‌వర్డ్‌తో లాగిన్‌లోకి వెళితే ఆయా అభ్యర్థుల వివరాలు వస్తాయి. అభ్యర్థి హాల్‌టికెట్ నెంబరు ఎంటర్ చేయగానే వివరాలన్నీ డిస్‌ప్లే అవుతాయి. ఆ అభ్యర్థి ఎన్ని పోస్టులకు పరీక్ష రాశాడు, ఏ పోస్టుకు ఎంపికయ్యేందుకు అర్హత ఉంది కూడా డిస్‌ప్లే అవుతుంది. వెరిఫికేషన్ బృందం ఒక్క పోస్టుకు సంబంధించిన సర్టిఫికెట్లు పరిశీలించి అన్ని సక్రమంగా ఉంటే ఆమోదించాలి. ఏమైనా తేడా ఉన్నా, సర్టిఫికెట్లు అన్నీ చూపించకపోయినా ఆ పోస్టుకు అభ్యర్థిని తిరస్కరించాలి. ఆ వివరాలు సైట్‌లో అప్‌లోడ్ చేయగానే బృందానికి ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీని ఎంటర్ చేయగానే ఆ అభ్యర్థి పరిశీలన పూర్తయినట్లే.

మొదట ప్రాధాన్యతకే పోస్టు

అభ్యర్థులు డీఎస్సీ దరఖాస్తులో పోస్టులు, యాజమాన్యాలకు ప్రాధాన్యత ఇచ్చారు. ఎస్‌జీటీ, స్కూలు అసిస్టెంట్, పీడీ, పీజీటీ, టీజీటీ తదితర పోస్టులకు ప్రాధాన్యత ప్రకారం ఆప్షన్లు ఇవ్వాలి. ప్రభుత్వ, జడ్పీ, మునిసిపాలిటీలు, మోడల్ స్కూళ్లు, గిరిజన పాఠశాలలకు కూడా ప్రాధాన్యత క్రమంలో ఆప్షన్లు ఇవ్వాలి. ఆ ప్రాధాన్యతల ప్రకారమే అభ్యర్థులను పోస్టులకు ఎంపిక చేస్తారు.

జేసీ పరిశీలన

డీఎస్సీ సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రాన్ని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ పరిశీలించారు. పరిశీలన బృందాల రూములను సందర్శించారు. జేసీ స్వయంగా లాప్‌టాప్ ఓపెన్ చేసి స్వయంగా అన్నింటినీ పరిశీలించారు. సర్టిఫికెట్ల పరిశీలనకు నియమితులైన రాష్ట్ర పరిశీలకులు తహెరా సూల్తానా, డీఈవో కిరణ్‌కుమార్, ఉపవిద్యాధికారులు చంద్రమౌళీశ్వరరావు, శ్రీనివాసులు, ఎంఈవోలు కిషోర్‌బాబు, డీసీఈబీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీధర్‌రెడ్డి పర్యవేక్షించారు. శ్రీసరస్వతి విద్యాసంస్థల చైర్మన్ రమణారెడ్డి సర్టిఫికెట్ల పరిశీలన కేంద్రంలో షామియానాలు, కుర్చీలతోపాటు అన్ని సౌకర్యాలను కల్పించారు. సర్టిఫికెట్ల పరిశీలనకు వ చ్చే అభ్యర్థులు, అధికారులకు టిఫిన్, భోజన సదుపాయాన్ని కూడా కల్పించారు.

పునరుద్ధరణ దిశగా..

(5వపేజీ తరువాయి)

నారా లోకేష్ యువగళం పాదయాత్రలో డెయిరీ పునరుద్ధరణ విషయాన్ని స్పష్టంగా చెప్పారు. పార్టీ అధినేత చంద్రబాబు కూడా పలు ఎన్నికల సభల్లోనూ ఇతర సమాయాల్లోనూ ఇదే విషయాన్ని స్పష్టంచేశారు. రాష్ట్రంలో ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయా జిల్లాలో గతంలో ఇచ్చిన హామీలపై ప్రభుత్వ పెద్దలు దృష్టిసారిస్తున్నారు. ఈక్రమంలో జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి కొంతకాలం క్రితం డెయిరీ విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లారు. డెయిరీని మూతేసే సమయంలో ఉద్యోగులకు నాటి వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులకు వీఆర్ఎస్ ప్యాకేజీ ఇచ్చి సాగనంపింది. అయితే కొందరికి బకాయిలు పెండింగ్‌తో పాటు పీఎఫ్ చెల్లింపులు పెండింగ్‌తో అవస్థలు పడుతున్నారు. వారి విషయం తన దృష్టికి రావడంతో స్పందించిన మంత్రి డాక్టర్ స్వామి ఆరుమాసాల క్రితం వారి బకాయిలు రూ.2 కోట్లు వారికి వచ్చేలా చేశారు. ఆ సమయంలో డెయిరీ పునరుద్ధరణ విషయాన్ని అటు ప్రభుత్వ పెద్దలు, ఇటు రాష్ట్రప్రభుత్వ ఉన్నతాధికారులతో సంప్రదింపులు జరిపినట్లు సమాచారం. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ఆనం రామనారాయణరెడ్డి నియమితులైన అనంతరం గతేడాది నవంబరులో జరిగిన తొలి డీఆర్సీ సమావేశంలో డెయిరీ ప్రాంతానికి ప్రాతినిథ్యం వహిస్తున్న ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్ ఈ అంశాన్ని ప్రస్తావిస్తూ తక్షణం డెయిరీ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరారు. పలువురు ఇతర ఎమ్మెల్యేలు కూడా డెయిరీపై స్పందించారు. మరోవైపు రాష్ట్రస్థాయి కలెక్టర్ సమావేశాలు సందర్భంగా రెండు విడతలు డెయిరీ అంశాన్ని ప్రముఖంగా కలెక్టర్ అన్సారియా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

ప్రాథమిక కసరత్తు పూర్తి

ఇటీవల కలెక్టర్ అన్సారియా డెయిరీ పరిస్థితిపై పరిశీలన చేయాలని జేసీ గోపాలకృష్ణకు సూచించారు. తదనుగుణంగా ఆయన ఆ అంశంపై కసరత్తు ప్రారంభించారు. వారం క్రితం కొందరు గతంలో ఒంగోలు డెయిరీ డైరెక్టర్లుగా పనిచేసినవారు, గతంలో పాల సంఘాల అధ్యక్షులుగా ఉన్నవారు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రాథమిక కసరత్తు అనంతరం డెయిరీ పరిస్థితి జిల్లా యంత్రాంగాన్ని ప్రతిపాదనతో ప్రభుత్వానికి నివేదించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రధానంగా డెయిరీ ఆస్తులు, అప్పులు, ప్రస్తుత ఆస్తుల పరిస్థితి, వాటి రక్షణ చర్యలు, తిరిగి డెయిరీ పునరుద్ధరణ చేయాలంటే ఎలాంటి చర్యలు అవసరం అనే దానిపై పరిశీలిస్తున్నారు. జేసీ సూచనలతో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ రవి, డెయిరీ మేనేజర్ రాజమోహన్‌లు ఇందుకు సంబంధించి ప్రాథమిక పరిశీలనతో కొంతమేర నివేదిక రూపొందించినట్లు సమాచారం. ఒంగోలుతో పాటు ఇతర చోట్ల మొత్తం డెయిరీ పరిధిలో భూమి ఎంత ఉంది, మిషనరీ, ఇతర ఆస్తులు ఏమి ఉన్నాయి? వాటి విలువ ఎంత ఉంది? ప్రస్తుతం డెయిరీకి అప్పులు ఏమేర ఉన్నాయి? అలాగే డెయిరీ పరిధిలో గతంలో గ్రామస్థాయిలో ఎన్ని సంఘాలు ఉన్నాయి? ఎక్కడెక్కడ తదితర విషయలను అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా పరిశీలించి ఒక నివేదికను తయారు చేసినట్లు తెలిసింది.

అక్రమాలు నిగ్గుతేల్చడంలో జాప్యం

(5వపేజీ తరువాయి)

రాజంపల్లిలో బిల్లులు లేకుండా నిల్వ ఉన్న 130 బస్తాల యూరియాను పట్టుకున్నారు. లైసెన్స్ లేకుండా నిల్వ ఉంచిన వరి విత్తనాలను వందలాది బస్తాలను పట్టుకున్నారు. ముండ్లమూరు మండలంలో దుకాణాల్లో ఉన్న సరుకులకు, విక్రయించిన బిల్లులకు తేడాలను కనుగొన్నారు. జిల్లాలోని అనేకచోట్ల అక్రమాలను గుర్తించి కేసులు నమోదు చేశారు. బిల్లులు లేకుండా ఆయా షాపులకు యూరియా నిల్వలు ఎక్కడనుంచి వచ్చాయనే విషయాన్ని కనుగొనేందుకు అధికారులు అప్పటినుంచి ప్రయత్నిస్తున్నారు. ఏ కారణం చేతనో అక్రమార్కుల నుంచి ఆ సమాచారం సేకరించటంలో జాప్యం జరుగుతుంది. ఇదే అదనుగా అక్రమార్కులు తప్పించుకునేందుకు పలు రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. కొంతమంది పర్మిట్లు ఉన్న షాపుల్లో బిల్లులు రాయించి నిల్వలు ఆ షాపులకు సంబంధించినవిగా చూపించే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. అధికారులకు రాజకీయ నేతల నుంచి సిఫార్సులు చేసే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తుంది.

ఇతర జిల్లాల నుంచి యథేచ్ఛగా వందలాది టన్నుల వరి విత్తనాలను తెచ్చి లైసెన్సులు లేకుండా కొన్ని షాపులు అక్రమ వ్యాపారాలు చేస్తున్నారు. ఆ విత్తనాలు నాణ్యమైనవా లేదా అన్న విషయాలను పట్టించుకోకుండా లాభార్జనే ధ్యేయంగా రైతులకు అంటగడుతున్నారు. గ్రామాల్లో రైతులు పెట్టుబడుల్లో భాగంగా ఎరువులు, విత్తనాలు... ఎరువుల షాపుల యాజమాన్యం వద్ద అప్పులు తీసుకుంటారు. వ్యాపారులు ఇదే అవకాశంగా తీసుకొని నాసిరకం విత్తనాలు తెచ్చి రైతులకు విక్రయిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. విత్తనాలు విక్రయించే కంపెనీలు ఆ షాపులకు లైసెన్సులు ఉన్నాయా లేదా అనే విషయాన్ని తెలుసుకోకుండా వారు కూడా వ్యాపారమే ధ్యేయంగా విత్తనాలు విక్రయిస్తున్నారు. విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల తనిఖీల్లో రైతులను దారుణంగా ముంచే విస్తుబోయే అంశాలు బయటకు రావటంతో ప్రజలు అవాక్కవుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా ఆ అక్రమ వ్యాపారం తంతు జరుగుతోంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమాల గురించి పట్టించుకున్న నాథుడు లేడు. దీంతో వ్యాపారులు ఆడింది ఆటగా సాగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరుగుతున్న అక్రమాలను పసిగట్టి పూర్తిస్థాయిలో విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందాలను ఏర్పాటు చేయటంతో అక్రమాలు కోకొల్లలుగా వెలుగులోకి వస్తున్నాయి. విచారణ అధికారులు ఇప్పటి వరకు పలుచోట్ల తనిఖీలు చేసి అక్రమాలను గుర్తించి కేసులు నమోదు చేశారు. బిల్లులు లేకుండా ఎరువులు, లైసెన్సులు లేని వ్యాపారులకు విత్తనాలు ఎవరు సరఫరా చేస్తున్నారో గుర్తించి అందరిపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



గంటవానిపల్లె బ్రిడ్జిపై ప్రవహిస్తోన్న వరద నీరు

నల్లమలలో భారీ వర్షం

● గంటవానిపల్లెకు రాకపోకలు బంద్

పెద్ద దోర్నాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మళ్లీ తీగలేరు వాగు ఉధృతంగా ప్రవహించింది.దీంతో గురువారం ఉదయం గంటవానిపల్లె వద్ద బ్రిడ్జిపై వరదనీరు ప్రవహించడంతో కొన్ని గంటల పాటు గ్రామానికి రాకపోకలు స్తంభించాయి. ఇలా వరద నీరు ప్రవహించడం ఈ ఏడాది మూడవ సారి. పెద్ద వర్షం కురిసినప్పుడల్లా ఈ పరిస్థితి ఎదుర్కోవలసి వస్తోందని ప్రజలు, విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఉపాధిహామీ పనుల్లో అవకతవకలపై విచారణ

చినగంజాం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలో ఉపాధి పనుల్లో జరిగిన అవినీతిపై డీఎల్‌డీవో పద్మావతి విచారించారు. కడవకుదురు గ్రామంలో 2021 సంవత్సరం నుంచి 2024వ సంవత్సరం వరకు ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసిన కొమ్ము సుబ్బారావుపై టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు బేతపూడి సురేష్‌బాబు, టీడీపీ నాయకులు కనపర్తి వీరాస్వామి, పర్చూరు నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి దేవతోటి నాగరాజులు ఈ నెల 4న కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించారు. మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్బారావు, గ్రామ సర్పంచ్ జి.శివకుమారి, జి.రామకృష్ణారెడ్డిలను ఆమె విచారించారు. రికార్డులను, మస్టర్లలను పరిశీలించారు. విచారణ వివరాల నివేదికను కలెక్టర్ వెంకటమురళీకి నివేదించనున్నట్లు డీఎల్‌డీవో తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీ.హెచ్.పూర్ణచంద్రరావు, ఏపీవో లక్ష్మిదేవీలు పాల్గొన్నారు.

మౌలాలికి గౌరవ ప్రశంసాపత్రం



కేంద్రప్రభుత్వం నుంచి అందిన ప్రశంసాపత్రాన్ని చూపిస్తున్న హెచ్‌ఎం మౌలాలి

తర్లుపాడు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కలుజువ్వలపాడు పంచాయతీలోని లింగారెడ్డి కాలనీలోని ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మౌలాలికి భారత ప్రభుత్వ సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నుంచి గౌరవ ప్రశంసాపత్రం లభించింది. ఆగస్టు 2 నుంచి 15 వరకు నిర్వహించిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని దిగ్విజయంగా పూర్తి చేసినందుకు, అలాగే ఐక్యతా స్ఫూర్తిని నింపుతూ ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండాను ఎగరవేయించడంలో ఆయన కృషి, సేవకు గుర్తింపుతా ప్రశంసాపత్రాన్ని భారత ప్రభుత్వం అందజేసిందని మౌలాలి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు అభినందించారు.

పొగాకు కిలో రూ.300

(5వపేజీ తరువాయి)

సగటున 31.20శాతం బేళ్లు నోబిడ్ అయ్యాయి. వెల్లంపల్లి కేంద్రంలో 42.36శాతం, ఒంగోలు-1, కొండపి, పొదిలి, కందుకూరు-1 కేంద్రాల్లో 30శాతం కన్నా ఎక్కువగా నోబిడ్‌లయ్యాయి. ఇప్పటివరకు కనిష్ఠ ధర కిలో రూ.138 వరకు ఉండగా గురువారం రూ.120కి తగ్గింది. అయినా లోగ్రేడ్ బేళ్లు భారీగానే నోబిడ్ అయ్యాయి. మొత్తం మీద దక్షిణాదిలో గురువారం వేలం జరిగిన ఎనిమిది కేంద్రాల్లో అమ్మకానికి 4,200 బేళ్లను తీసుకురాగా 3,405 బేళ్లను కొనుగోలు చేశారు. 1,825 బేళ్లు నోబిడ్ అయ్యాయి. కందుకూరు-2 కేంద్రంలో కూడా అనుమతించిన పంట కొనుగోలు గురువారంతో పూర్తయినట్లు సమాచారం.

పొలాల్లో దొంగలు

(5వపేజీ తరువాయి)

పుల్లలచెరువు గ్రామంలో కొందరు రైతులకు చెందిన మోటార్ల వద్ద కేబుల్ వైర్లను కత్తిరించుకుపోయినట్లు రైతులు తెలిపారు. ఎర్రగొండపాలెం మండలంలో కూడా ఈ ఏడాది కాలంలో ఆరుచోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలో చోరీ జరిగింది. గోళ్లవిడిపి, బోయలపల్లి, గుర్రపుసాల, కొత్తపల్లి, పాత గోళ్లవిడిపి గ్రామాల్లోని రైతులకు చెందిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు పగులగొట్టి తీగలను దోచుకెళ్లారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొడితే అందులో దొరికే రాగితీగను అమ్మడం ద్వారా వచ్చే డబ్బులతో దొంగలు లబ్ధిపొందుతున్నారు. 25 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లో దాదాపు 30కిలోల రాగి తీగ ఉంటుంది. బయట దీనిని అమ్మితే కిలో రూ.700 చొప్పున దాదాపు రూ.20వేలు వస్తుంది. కానీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లేని కారణంగా తిరిగి దానిని అమర్చుకునేందుకు, అదే సమయంలో పంటను నీటి తడుల నుంచి కాపాడుకునేందుకు రైతులు ఎంతో కష్టపడి నష్టపోవాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పండిన పంటలను కూడా వదలడం లేదు

కొన్నిసార్లు దొంగల కన్ను రైతులు పండించిన పంటలపై కూడా పడుతోంది. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను కూడా దొంగిలించి సొమ్ము చేసుకున్న సందర్భాలు కూడా లేకపోలేదు. మిర్చి పంట చేతికి వచ్చిన సమయంలో కొన్నిచోట్ల దొంగలపాలైన ఘటన కూడా ఉంది. నాలుగునెలల కిందట పుల్లలచెరువులో పంట పొలాల్లో బేళ్లు తొక్కి అమ్మకానికి సిద్ధం చేసుకున్న పొగాకు బేళ్లను రాత్రికిరాత్రి పొలాల్లో నుంచి ఎత్తుకెళ్తున్నారు. దాదాపు నలుగురు రైతులకు చెందిన పొగాకు చోరీ కావడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

అందరూ ఫిర్యాదులు చేయడం లేదు

చోరీ ఘటనలపై పోలీసులకు కొందరు రైతులు ఫిర్యాదు కూడా చేయడం లేదు. కొన్నిచోట్ల ఫిర్యాదులు వచ్చినా వాటిపై నిగ్గుతేల్చి దొంగలను పట్టుకునేందుకు చాలా రోజులు పడుతోంది. జరుగుతున్న ఘటనలపై రైతులు ఒకరికొకరు చెప్పుకుంటూ చర్చించుకోవడం తప్ప దొంగలకు అడ్డుకట్ట వేయలేక పోతున్నారు. భవిష్యత్‌లోనైనా ఇలా చోరీలు జరగకుండా పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ఇప్పటికే 30మందిని అరెస్ట్ చేశాం

- ప్రభాకరరావు, సీఐ, ఎర్రగొండపాలెం

ఈ ఏడాది చోరీ ఘటనల్లో దాదాపు 30 మందిని అరెస్ట్ చేశాం. సీసీ కెమెరాలు అందుబాటులో ఉన్న చోట నిఘా పెడుతున్నాం. కానీ దొంగలు లోపలి ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. రైతులు కూడా ఘటన జరిగిన వెంటనే ఫిర్యాదు చేయడం లేదు. విద్యుత్ సిబ్బంది కూడా లైన్‌ల వెంబడి పర్యటిస్తే బాగుంటుంది.

పెద్దపులి పాదముద్రలు

(5వపేజీ తరువాయి)

రైతు పొలానికి వెళుతుండగా మధ్యలో అడవి జంతువు పాదముద్రలను గుర్తించి తమకు సమాచారం ఇవ్వగా, హుటాహుటిన గ్రామానికి వచ్చి పాదముద్రలను పరిశీలించామన్నారు. వాటి కొలతలు తీసుకోగా అవి పెద్దపులివిగా నిర్ధారించినట్లు చెప్పారు.గ్రామంలోని సీసీ టీవీ ఫుటేజీని పరిశీలించామని, ట్రాప్ కెమెరాలను కూడా అమర్చామని ఆమె తెలిపారు. దర్గా సమీపంలో కొండలు, దట్టమైన చెట్లు ఉన్న క్రమంలో నల్లమల ఫారెస్ట్ నుంచి పెద్దపులివచ్చి ఉంటుందని తెలిపారు.గ్రామస్థులకు తగిన జాగ్రత్తలు చెప్పామన్నారు.



ఆటంకాలే..!

● క్రీడా 'ప్రకాశం' కునుకుపాట్లు ● వేధిస్తున్న నిధుల కొరత ● అరకొర మైదానాల్లో ఆటల పోటీలు
● నేడు ధ్యాన్‌చంద్ జయంతి ● జిల్లాలో జాతీయ క్రీడా దినోత్సవం

● నేడు హాకీ లెజెండ్ ధ్యాన్‌చంద్ జయంతి

మొట్టమొదటి హాకీ లెజెండర్ ధ్యాన్‌చంద్ సింగ్ జన్మదినం క్రీడాకారులకు ఓ పండుగ. ఆగస్టు 29న జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ధ్యాన్ చంద్ జన్మదినం పురస్కరించుకొని తమ క్రీడా భక్తిని చాటుకోవడం ఆనవాయితీ. ధ్యాన్ చంద్ భారతీయ హాకీ క్రీడాకారుడు. తొలుత క్రీడాకారుడుగా ప్రవేశం పొంది. అనతి కాలంలోనే కెప్టెన్‌గా, తదనంతరం మూడు సార్లు ఒలంపిక్‌లో బంగారు పతకాలను సాధించి గుర్తింపు తెచ్చారు. అదేవిధంగా భారతీయ అత్యున్నత పురస్కారాలలో మూడవది అయిన పద్మభూషణ్ పురస్కారాన్ని 1956లో అందుకున్నారు. అయితే హాకీ క్రీడాకారులలో పద్మభూషణ్ అవార్డు పొందిన తొలి, చివరి హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్.

ఒంగోలు, కార్పొరేషన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : క్రీడలు మనిషిని కొత్త పుంతలు తొక్కించడంతోపాటు మనోరంజక సాధనాలలో ముఖ్య భాగమై పోయింది. సంప్రదాయక ఆటలకంటే ఆధునిక ప్రపంచ గుర్తింపు కలిగిన క్రీడలు ప్రావీణ్యం సంపాదిస్తే.. పేరు, ప్రతిష్ఠలతోపాటు, ఉద్యోగ ఉపాధి అవకాశాలకు సులువైన మార్గమవుతుంది. ప్రధానంగా భారత రైల్వే సంస్థ, వివిధ క్రీడా సంస్థలలో కోచ్‌లుగా, పోలీసు శాఖ ఉద్యోగాలలో ప్రాధాన్యత లభిస్తోంది. జిల్లాలో క్రీడా ప్రతిభకు ప్రత్యేక గుర్తింపు ఉన్నా, పరిస్థితులకు ఎదురొడ్డి పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులకు కనీస ప్రోత్సాహం లభించడం లేదు. దీంతో క్రీడా రంగం కునికి పాట్లు పడుతోంది. ప్రత్యేకించి నిధుల కొరత కారణంగా క్రీడల నిర్వహణ కూడా గగనమైపోతోంది. గడిచిన ఐదేళ్ల వైసీపీ పాలనలో దాతలతోక్రీడా రంగం నెట్టకొచ్చింది. ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తే తప్ప క్రీడోత్సాహం కనిపించే పరిస్థితి లేదని పలువురు క్రీడా కోచ్‌లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



● ప్రతిభ కలిగిన క్రీడాకారులకు కొదవ లేదు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో క్రీడాప్రతిభకు లోటు లేదు. గతంలో బ్యాడ్మింటన్ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్ నుంచి ఆసియా క్రీడల కబడ్డీ పోటీల్లో భారత జట్టులో స్వర్ణం సాధించిన కళ్యాణి, కబడ్డీలో రాణించిన నాగలక్ష్మి, చీరాలకు చెందిన నిరుపేద కుటుంబంలోని వంశీకృష్ణ, వెయిట్ లిఫ్టింగ్‌లో పతకాలు సాధించిన కుమారినంద, ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పలువురు బాలికలు కత్తి యుద్ధక్రీడలో, ఇలా ఒకరేమిటి మండలానికి ఓపేరున్న క్రీడాకారులు ఉన్నారు. ఆదరణ, ప్రోత్సాహం లేకున్నా క్రీడల పట్ల తమకున్న పట్టుదలతో పతకాలు సాధించారు. వీరికి కనీసం ప్రోత్సాహం కరువైంది. అలానే నేటికీ సరైన మైదనాలు లేకపోవడం గమనార్హం.

● సమన్వయం లేని క్రీడా సంఘాలు

జిల్లాలో కీర్తి ప్రతిష్ఠలు సాధించిన క్రీడాకారుల కంటే క్రీడా సంఘాలకు జిల్లాలో కొదవలేదు. ఆటకో సంఘం ఏర్పడగా, ఆ సంఘాలు అయినోళ్ల కోసమే అప్పుడప్పుడూ పోటీలు నిర్వహించి ఉనికిని కాపాడుకుంటున్నాయి. అంతకుమించి క్రీడాకారుల కీర్తిని ప్రశంసించే విధంగా ఏనాడు ముందుకు రాలేదనే విమర్శలు ఉన్నాయి. కనీస ప్రోత్సాహానికి కలిసి రాని క్రీడా సంఘాలు పేపర్లలో ఫొటోలతో పరువును కాపాడుకుంటున్నాయే తప్ప పెద్దగా జిల్లాకు ప్రయోజనం చేకూర్చలేదనే చెప్పాలి. ఇప్పటివరకు పతకాలు సాధించిన క్రీడాకారులంతా ఎటువంటి శిక్షణలతో నిమిత్తం లేకుండా సొంతంగా ప్రతిభ చాటిన గ్రామీణ కుసుమాలే. కొందరు ఫిజికల్ డైరెక్టర్లు, వ్యాయోమాపాధ్యాయులు క్రీడా సంఘాలుగా ఏర్పడ్డారు. ఎవరికి వారే యమునాతీరే అన్నట్లు వ్యవహరించడం క్రీడాభివృద్ధికి ఆటంకాలు ఎదురవు తున్నాయి. ప్రణాళిక లేకుండా పోటీల నిర్వహణ, మొక్కుబడి ఎంపికలతో కాలాన్ని నెట్టుకు రావడం వలన క్రీడా రంగం కష్టాల్లో కునుకుపాట్లు పడుతుంది.



క్రీడలపై వైసీపీ అంతులేని నిర్లక్ష్యం..

ఐదేళ్లుగా క్రీడా రంగం కునుకు పాట్లు పడుతోంది. వైసీపీ ప్రభుత్వం హయాంలో జిల్లాకు కనీసం జాతీయ పతకాలు రాకపోగా.. ఆడుదాం ఆంధ్ర పేరుతో కోట్లు దోచుకున్నట్లు ప్రజాప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఆడుదాం ఆంధ్రలో జరిగిన అవినీతిపై ఇప్పటికే పలు క్రీడా సంఘాల వాళ్లు క్రీడాశాఖ మంత్రికి ఫిర్యాదు చేశారు. 2014-19లో టీడీపీ హయాంలో నియోజకవర్గానికో మినీ స్టేడియం ప్రతిపాదించగా, ఆ తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ వాటిపై నిర్లక్ష్యం ప్రదర్శించింది. దీంతో గత ఐదేళ్లలో ఏటికేడు క్రీడా ప్రకాశం పూర్వ వైభవం కోల్పోయింది.



సచివాలయం ఎదుట ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

నీటి కోసం నిరసన

గిద్దలూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నీటి కోసం మహిళలు గురువారం గ్రామ సచివాలయం ఎదుట నిరసన తెలిపారు. మండలంలోని తంబళ్లపల్లిలో భూగర్భ జలాలు పుష్కలంగా ఉండగా, 6 డీప్ బోర్లను ఏర్పాటు చేసి ప్రజలకు నీటిని అందిస్తున్నారు. అయితే రిపేర్లకు గురైన డీప్ బోర్లను మరమ్మతులు చేసే విషయంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు అంటున్నారు. నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని తంబళ్లపల్లి మహిళలు గ్రామ సచివాలయం వద్ద ఖాళీ బిందెలతో నిరసనకు దిగారు. వెంటనే డీప్‌బోర్లకు మరమ్మతులు చేసి సమస్య తీర్చాలని కోరారు.

హసనాపురంలో పులిపిల్ల ప్రత్యక్షం



పులి పిల్లను తీసుకెళ్తున్న అధికారులు

కొమరోలు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : కడప-అమరావతి రహదారిలోని హసనాపురం సమీపంలో రోడ్డుపై గాయపడి ఉన్న చిరుతపులి పిల్లను స్థానికులు మంగళవారం రాత్రి గుర్తించారు. రాచర్ల మండలం అటవీ ప్రాంతం నుంచి మండలంలోని హసనాపురం గ్రామ వీధుల్లోకి పులి పిల్ల దారి తప్పి వచ్చింది. ఒక్కసారిగా అది కనిపించడంతో ప్రజలు బెంబేలెత్తిపోయారు. గ్రామస్థులు కొందరు దానిని పట్టుకొని పోలీసులు, అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చారు. వారు వచ్చి పులి పిల్లను తీసుకెళ్లడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు రైస్‌పంపిణీ ప్రారంభం



ఒంగోలులో మంచంలో ఉన్న వృద్ధురాలి వేలి ముద్ర వేయించుకుంటున్న డీలర్

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వృద్ధులు, దివ్యాంగులకు ముందస్తుగా రేషన్ పంపిణీ ప్రక్రియ జిల్లాలో ప్రారంభమైంది. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ షాపుల ద్వారా కార్డుదారులకు రేషన్ పంపిణీకి శ్రీకారం చుట్టింది. వృద్ధులు, దివ్యాంగులు రేషన్‌షాపుల వద్దకు వెళ్లలేని పరిస్థితి ఉండటంతో అటువంటి వారందరికి ముందుగానే రేషన్ పంపిణీకి శ్రీకారం చుట్టారు. జిల్లాలో 1,392 రేషన్‌షాపుల పరిధిలో 78,806 కార్డులు ఉన్నాయి. వారందరికీ సెప్టెంబరు నెల కోటాకు సంబంధించిన బియ్యం, ఇతర సరుకులను ముందుగానే పంపిణీ చేపట్టారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారుల పర్యవేక్షణలో డీలర్లు వారి నివాసాల వద్దకు వెళ్లి బయోమెట్రిక్(వేలిముద్రలు) వేయించుకొని సరుకులు పంపిణీ చేస్తున్నారు. ఈ ప్రక్రియను ఈనెలాఖరు వరకు కొనసాగించనున్నారు. అందుకు అవసరమైన చర్యలను ఆ శాఖ అధికారులు చేపట్టారు. ఒంగోలుతో పాటు అన్ని ప్రాంతాల్లో ఈ పంపిణీ ప్రక్రియ కొనసాగుతోంది.

ఐదు టీచర్ పోస్టులకు ఎంపికైన హర్షిత



హర్షితను అభినందిస్తున్న రమణారెడ్డి తదితరులు

ఒంగోలు విద్య, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : కనిగిరికి చెందిన ఇరువూరి వెంకట హర్షిత డీఎస్సీలో ఏకంగా ఐదు టీచర్ పోస్టులకు అర్హత సాధించారు. సోషల్ స్టడీస్‌లో స్కూలు అసిస్టెంట్ పరీక్షల్లో 85.13 మార్కులతో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచారు. స్కూలు అసిస్టెంట్ ఇంగ్లీషులో 80.59 మార్కులతో 16వ ర్యాంకు. సెకండరీ గ్రేడ్ టీచర్ పోస్టులో 90.49 మార్కులతో 7వ ర్యాంకు సాధించారు. అదే విధంగా ఏపీ మోడల్ స్కూలు టీజీటీ సోషల్ స్టడీస్‌లో నాల్గో ర్యాంకు, టీజీటీ ఇంగ్లీషులో 40వ ర్యాంకుతో ఆయా పోస్టుల ఎంపికకు అర్హత సాధించారు. పరీక్ష రాసిన ఐదు పోస్టులకూ అర్హత సాధించి సత్తా చాటారు. గతంలో బీఈడీ ప్రవేశ పరీక్షల్లో రాష్ట్ర స్థాయి మూడో ర్యాంకు, డీఈడీ ప్రవేశ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో 11వ ర్యాంకు సాధించారు. చదువులో బాల్యం నుంచి చురుకుగా ఉన్న వెంకట హర్షిత తన జీవిత లక్ష్యమైన టీచర్ పోస్టు సాధించి అందరికీ మార్గదర్శకంగా నిలిచారు. గురువారం సర్టిఫికెట్ల పరిశీలనకు ఒంగోలుకు వచ్చిన హర్షితను శ్రీ సరస్వతి విద్యా సంస్థల చైర్మన్ ఏపీ రమణారెడ్డి ఎంఈవో డి.రామిరెడ్డి, సిహెచ్ గోపి, డీసీఈబి కార్యదర్శి ఎం. శ్రీనివాసరావులు అభినందించారు.

రైతుల అభ్యున్నతికి కృషి చేస్తా



మాట్లాడుతున్న పీడీసీసీబీ చైర్మన్ సీతారామయ్య

ఒంగోలురూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రైతుల అభ్యున్నతికి కృషి చేస్తానని పీడీసీసీ బ్యాంక్ చైర్మన్, డాక్టర్ కామేపల్లి సీతారామయ్య చెప్పారు. ఒంగోలు మండలం సర్వేరెడ్డిపాలెం పీఏసీఎస్ చైర్మన్‌గా పీడీసీసీ బ్యాంక్ చైర్మన్ సీతారామయ్య గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీఏసీఎస్ సొసైటీ ద్వారా రైతులకు విరివిగా రుణాలు ఇస్తానన్నారు. రైతుల సంక్షేమం కోసం ప్రజాప్రభుత్వం పలు సంక్షేమకార్యక్రమాలు అమలుచేస్తోందని చెప్పారు. పీడీసీసీ బ్యాంక్‌ను పూర్తిగా కంప్యూటీకరించామని, రుణ కిస్తీలు చెల్లించిన వెంటనే రైతులు రశీదు పొందాలన్నారు. బ్యాంక్‌లలో నగదు డిపాజిట్లు చేసుకోవచ్చని చెప్పారు. తొలుత డాక్టర్ సీతారామయ్య పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్వేరెడ్డిపాలెం త్రీమెన్ కమిటీ సభ్యులు మక్కెన శ్రీనివాసరావు, గట్టుబోయిన కృష్ణ, పీడీసీసీ బ్యాంక్ ఇన్‌చార్జి సీఈవో ప్రకాశ్, ఏజీఎం వీరనారాయణ, యరజర్ల ఎంపీటీసీ సభ్యుడు శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సురక్షితమైన తాగునీరు

దిగువమెట్ట తాండాలో జలజీవన్ మిషన్ పనులు ప్రారంభంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరుటౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఇంటికీ సురక్షితమైన మంచినీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చెప్పారు. గురువారం మండలంలోని దిగువమెట్ట తాండాలో జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ మంచినీటిని అందించే పైపులైన్ పనులను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు పరుగులు పెడుతున్నాయని, అందులో భాగంగానే దిగువమెట్ట తాండాలో జలజీవన్‌మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీటిని అందిస్తామన్నారు.వైసీపీ పాలకులు రాష్ట్రంలో సంక్షోభం సృష్టిస్తే ప్రజా ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తోందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మార్తాల సుబ్బారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు బుడత మధుసూదన్, మార్కెట్‌యార్డు చైర్మన్ బైలడుగు బాలయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాలుగుళ్ల ప్రతాపరెడ్డి, హనుమంత రెడ్డి, సొసైటీ బ్యాంక్ చైర్మన్ ముచ్చుకుంట్ల రామసుబ్బయ్య, టీడీపీ నాయకులు కడియం శేషగిరి, సర్పంచ్ కర్నాటి రామసుబ్బారెడ్డి, రిటైర్డ్ డీఎస్పీ బాలాజీనాయక్, శ్రీనివాసనాయక్, దప్పిలి శ్రీనివాసరెడ్డి, ఎంపీడీవో రమణారెడ్డి పాల్గొన్నారు.



పైపులైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

ఒంటరి మహిళ హత్య కేసును ఛేదించిన పోలీసులు

ముగ్గురు నిందితుల అరెస్ట్
రూ. 3లక్షలు విలువచేసే బంగారం స్వాధీనం
వివరాలు వెల్లడించిన సీఐ హజరత్తయ్య



వివరాలు వెల్లడిస్తున్న సీఐ హజరత్తయ్య

సింగరాయకొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని అంబేడ్కర్ నగర్ 3వ లైన్‌లో ఈ నెల 23 తేదీ అర్ధరాత్రి ఒంటరి మహిళ చెరుకూరి సుబ్బాయమ్మ(57) హత్య చేసిన నిందితులు ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ. 3లక్షలు విలువచేసే 30 గ్రాముల బంగారు ఆభరణాలను, సెల్‌ఫోన్, రూ.960, ఏటీఎం కార్డును స్వాధీనం చేసుకున్నారు. సింగరాయకొండ సర్కిల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ హజరత్తయ్య ఆ కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలు మేరకు..

టంగుటూరు బుచ్చిరాజుపాలెం కాలనీకి చెందిన నత్తల మమత, మధుమాల మాధురిలు అప్పు చేసి కుమార్తెల వివాహాలు చేశారు. ఆ పెళ్లిళ్ల తాలుకా అప్పు తీర్చడానికి సుమారు 8 ఏళ్లకిందట నుంచి సింగరాయకొండ పంచాయతీ పరిధిలోని సుబ్బరామిరెడ్డి కాలనీలో నివాసం ఉంటూ పనులు చేసుకుంటున్నారు. వీరికి చేపల మార్కెట్ ఎదుట బంకు పెట్టుకొని జీవనం సాగిస్తూ వడ్డీ వ్యాపారం చేసే సుబ్బాయమ్మతో పరిచయం ఏర్పడింది. ఆమె నుంచి మమత రూ.80వేలు, మాధురి రూ.50వేలు అప్పు తీసుకున్నారు. మమత రూ.850, మాధురి రూ. 600లు ప్రతిరోజూ చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. అడబ్బును వసూలు చేయడానికి ఇరువురు మహిళల వద్దకు సుబ్బాయమ్మ విటులను పంపించి వ్యభిచారం చేయించి నగదు వసూలు చేసుకుంటుంది. ఈ క్రమంలో హత్యకు వారం రోజుల ముందు మమత, మాధవిలకు అనారోగ్య సమస్యలు తలెత్తడంతో సుబ్బాయమ్మకు రోజువారీ వడ్డీ నగదు చెల్లించలేకపోయారు. దీంతో ఆమె ఇరువురు మహిళలను నీచంగా మాట్లాడుతూ ఆరోగ్యం బాగోలేకపోయిన వ్యభిచారం చేసి తనకు నగదును చెల్లించాలని ఒత్తిడి చేసింది. దీంతో ఆమెపై మమత, ఆమె కొడుకు మణికంఠ, మాధురి కోపం పెంచుకున్నారు. మమత యూట్యూబ్‌లో సీఐడీ సీరియల్స్ చూసి హత్య ఏలా చేయాలో పథకం రూపొందించింది.

● పాయసంలో నిద్రమాత్రలు కలిపి...

ఇదిలా ఉండగా, ఈనెల 23వ తేదీ సుబ్బాయమ్మ మమతకు ఫోన్‌చేసి తనకు వేడిచేసిందని పాయసం తీసుకొని రమ్మని చెప్పింది. అదే అదునుగా భావించిన మమత, మాధురి పాయసం తయారు చేస్తారు. అందులో మాధురి వాడే నిద్రమాత్రలను ఎక్కువ మోతాదులో కలుపుతారు. అనంతరం పాయసం సుబ్బాయమ్మ ఇంటికి తీసుకెళ్లి ఆమె చేత తాపించారు. ఆ తరువాత ఆమెతో ఇరువురు తమ చెల్లించాల్సిన నగదుపై గొడవపడతారు. ఈక్రమంలో మత్తులోకి జారుకుంటున్న సుబ్బాయమ్మను మంచంపైకి నెట్టేస్తారు. ఆమె అపస్మారక స్థితిలోకి చేరుకున్న సమయంలో మమత తన కుమారుడు మణికంఠకు ఫోన్‌చేసి పిలిపిస్తోంది. మమత, మాధురిలు ఆమెను కదలకుండా పట్టుకోవడంతో సుబ్బాయమ్మ మోహంపై మణికంఠ దిండుతో గట్టిగా ఊపిరి ఆడకుండా నొక్కి హత్యచేశారు. అనంతరం ఆమె ఒంటిపైన బంగారు ఆభరణాలను, బీరువాలోని నదును, ఏటీఎం కార్డు, సెల్‌ఫోన్‌ను అపహరించుకుని వెళ్లారు.

● తక్కువ సమయంలోనే నిందితుల పట్టివేత

కేసు దర్యాప్తులో భాగంగా స్థానికులను విచారించగా హత్య జరిగిన రాత్రి మమత, మాధురిలు సుబ్బాయమ్మతో గొడవపడినట్లు పోలీసులు దృష్టికి వచ్చింది. వారిని అనుమానితులుగా భావించి అన్నీ కోణాల్లో దర్యాప్తు చేయగా మమత ఆమె కుమారుడు మణికంఠ, మాధురి ముగ్గురు కలిసి సుబ్బాయమ్మను హత్య చేసినట్లు పోలీసులు నిర్ధారణకు వస్తారు. నిందితులు ముగ్గురిని గురువారం టంగుటూరు వెళ్లే మార్గంలో జరుగుమల్లి అడ్డరోడ్డు వద్ద పోలీసులు అరెస్ట్ చేశారు. హత్య కేసును అతి తక్కువ సమయంలో ఛేదించిన సీఐ హజరత్తయ్య, ఎస్సై బి. మహేంద్ర, ఏఎస్సై మొహీద్దీన్, హెడ్ కానిస్టేబుళ్లు తిరుపతిస్వామి, శ్రీను, పీసీలు రమణ, విజయ్, మౌలాళి, అనూష, శివకుమారిలను ఎస్పీ దామోదర్ అభినందించారు.

జేఎంబీ చర్చిలో మరోసారి వివాదం

ఎస్టీబీసీ సమావేశాన్ని అడ్డుకున్న పోలీసులు
పోలీసుల ఎదుటే దౌర్జన్యానికి దిగిన మరో వర్గం

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు జువెట్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చి(జేఎంబీ)లో మరోసారి వివాదం చోటుచేసుకుంది. బుధవారం చర్చి ఆవరణలో నిర్వహిస్తున్న సమావేశం ఆఫ్ తెలుగు బాప్టిస్ట్ చర్చస్(ఎస్టీబీసీ) పాస్టర్స్ సమావేశాన్ని మరో వర్గం అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఎస్టీబీసీ ప్రతినిధి గంగవరపు భాస్కర్‌రావు నేతృత్వంలో సమావేశం జరుగుతుండగా, మరో వర్గానికి చెందిన గుర్రాల రాజ్‌విమల్, అతని స్నేహితులు అడ్డుకునే ప్రయత్నం ఘర్షణకు ప్రధాన కారణంగా నిలిచింది. టూటౌన్‌పోలీసులు రంగప్రవేశం చేసి, సమావేశాన్ని ఆపివేయాలని కోరారు. తమకు పూర్తి హక్కులు ఉన్నాయని, అందుకు సంబంధించిన కోర్టు ఆదేశాలు ఉన్నాయని గంగవరపు భాస్కర్‌రావు వెల్లడించారు. అంతేగాక క్రైస్తవ ఆస్తులు అమ్ముకునే వ్యక్తులు ఫిర్యాదు చేస్తే ఎలా అడ్డుకుంటారని ఆయన ప్రశ్నించారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తూ తమ మనోభావాలను దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. మరో వర్గానికి చెందిన గుర్రాల రాజ్ విమల్ మాట్లాడుతూ ఎస్టీబీసీ జీసీ మెంబర్‌గా తనను ఎన్నుకున్నారని, కాగా ఈనెల 23న చర్చి ఆవరణలో సన్మాన కార్యక్రమం ఏర్పాటుచేసుకోగా కొందరు ఆ కార్యక్రమం జరగకుండా చేశారని ఆరోపించారు. క్రైస్తవ ఆస్తులు అమ్ముకుంటున్నారని ఆరోపించిన వారు. అందుకు ఆధారాలు చూపించాలని సవాల్‌చేశారు. దీంతో ఉద్రిక్త వాతావరణ పరిస్థితి ఏర్పడింది. టూటౌన్ సీఐ శ్రీనివాసరావు జోక్యం చేసుకుని ఇరు వర్గాల వారిని చెదరగొట్టారు. కాగా రాజ్‌విమల్ వర్గానికి చెందిన కొందరు యువకులు పోలీసుల ఎదుటే దౌర్జన్యం చేయడంతోపాటు ఒకానొకదశలో పోలీసులపైనే తిరగబడటంతో లాఠీలకు పనికల్పించారు. కొన్నేళ్లుగా జెంఎంబీ చర్చిలో చోటుచేసుకుంటున్న వివాదాలు రోజురోజుకూ మరింత ఆజ్యం పోసుకుంటున్నాయని చర్చికి వచ్చేసే భక్తులు ఆవేదన చెందుతున్నారు.



రాజ్‌విమల్‌ను బయటకు పంపిస్తున్న పోలీసులు

క్రీడా అవార్డులకు ఐదు పాఠశాలలు ఎంపిక

ఒంగోలు విద్య, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఐదు పాఠశాలలను క్రీడా ప్రతిభా అవార్డులకు ఎంపిక చేసినట్లు డీఈవో కిరణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కొనకనమిట్ల మండలం గొట్లగట్టు, కనిగిరి మండలం గురువాజీపేట, సింగరాయకొండ మండలం పాకల, జరుగుమల్లి మండలం చిర్రికూరపాడు, కొత్తపట్నం మండలం ఈతముక్కల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను ఈ అవార్డుకు ఎంపికచేశారు. సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించే జాతీయ క్రీడా దినోత్సవంలో ఈ పాఠశాలలకు అవార్డులను ప్రదానం చేస్తారు.



టీడీపీ కార్యాలయంలో గణపతికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే దామచర్ల దంపతులు



ఎస్పీ కార్యాలయంలో పూజలు నిర్వహించిన ఎస్పీ దామోదర్



ఒంగోలులోని కమ్మపాలెంలో వినాయకుడికి నమస్కరిస్తున్న భక్తులు

గణపతి బొప్పా మోరియా..!

- వేడుకగా వినాయక చవితి పండుగ
- ఊరూ.. వాడ విఘ్నేశ్వర విగ్రహాల ఏర్పాటు
- భక్తిశ్రద్ధలతో గణేషుడి నవరాత్రులు



గోపాల్‌నగర్ ఒకటోలైన్‌లో..



కేపీరోడ్‌లో అలరిస్తున్న విగ్రహం



నీలాయపాలెంలో ఏర్పాటు చేసిన స్వామివారి మండపాలు



రంగుతోటలో రంగులమయంగా వినాయక మండపం



చీమకుర్తిలో గణనాథుని విగ్రహ ఊరేగింపు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను బుధవారం ప్రజలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యుద్దీపాల అలంకరణలు, అందమైన భారీ సెట్టింగ్‌ల మధ్య ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపాల్లో కొలువుదీరిన విఘ్నేశ్వరునికి భక్తులు విశేష పూజలు చేశారు. ఇదిలా ఉండగా, వారం రోజుల ముందు నుంచే అంతటా వినాయక విగ్రహాల ఏర్పాటులో భక్తులు బిజీగా గడిపారు. బుధవారం పండుగ సంబరం అంబరాన్ని అంటింది. ఒంగోలులోని జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ దంపతులు గణేషునికి పూజలు నిర్వహించారు. ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పూజలో ఎస్పీ ఏఆర్.దామోదర్ దంపతులు పాల్గొని పూజలు చేశారు. అలాగే నగరంలోని ద్వారకనగర్, కుట్టుబోయినపాలెం, మునిసిపల్ ఆఫీస్ ఎదురు, అలాగే దక్షిణం బజారుతోపాటు పలు ప్రాంతాల్లో భారీగా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి తమ భక్తిని చాటుకున్నారు. నగరంలో విశేషంగా ఆకట్టుకుంటున్న విగ్రహాలను దర్శించుకునేందుకు ప్రజలు ఆసక్తిచూపారు. ఇదిలా ఉండగా, కొందరు వివిధ ఆకృతులతో రూపుదిద్దుకున్న గణేషుడి విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈసారి ఎక్కువ శాతం మంది పర్యావరణ హితం కోరుతూ మట్టి విగ్రహాలను మండపాల్లో ఏర్పాటు చేయడం విశేషం. దీంతో అంతటా సందడి వాతావరణం నెలకొంది. కాగా వినాయక చవితి నవరాత్రులు పురస్కరించుకుని విగ్రహాల వద్ద నిర్వాహకులు ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నగరంలోని పలు ప్రాంతాల్లో..

- లయన్స్ క్లబ్ ఆఫ్ ఒంగోలు సిటిజన్స్ ఆధ్వర్యంలో నగర ప్రజలకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ కోరుతూ ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేసినట్లు అధ్యక్షులు వల్లేటి కేకే.రవీంద్ర, సెక్రటరీ అద్దంకి శ్రీనివాస్, కోశాధికారి ప్రసన్నకుమార్, క్లబ్ ప్రతినిధులు పేర్కొన్నారు.

- ఒంగోలు కలెక్టరేట్: స్థానిక కర్నూలురోడ్డులోని మౌర్యా హోటల్‌లో వినాయక చవితి పండుగను ఘనంగా నిర్వహించారు. హోటల్ అధినేత, బీజేపీ నాయకుడు బత్తిన మహేష్ ఆధర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు షేక్ ఖలీఫాతుల్లాబాషా, రావులపల్లి నాగేంద్రయాదవ్, కేసిన రమేష్, కంది మురళీ, బి.మలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.



కారుమంచిలో ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద భక్తులు



బృందావన గార్డెన్స్‌లో మహిళల కోలాటం

- ఒంగోలు(రూరల్): వినాయక చవితిని కొప్పోలు రోడ్డులోని బృందావన గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మండపం వద్ద మహిళలు కోలాట ప్రదర్శన చేపట్టారు.

చీమకుర్తి మండలంలో..

చీమకుర్తి: వినాయకచవితి పర్వదిన వేడుకలను చీమకుర్తి మండలంలో వైభవంగా నిర్వహించారు. చీమకుర్తిలోని భావనరుషి దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన భారీ వినాయక విగ్రహం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. భారీ ఊరేగింపు మధ్య ఆలయానికి తరలించారు. స్థానిక తూర్పుబజారు, రెడ్డిబజారు, అంబేడ్కర్‌నగర్, ఎస్ఎస్‌పీకాలనీ, నెహ్రూనగర్, రామ్‌నగర్, దిన్నేపురం, తోపు బజారు తదితర ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన విగ్రహాలు ఆకర్షణీయంగా ఉన్నాయి. వాడవాడలా చవితి వేడుకలు అంబరాన్నంటాయి.

కొండపి మండలంలో..

కొండపి: వినాయక చవితి సందర్భంగా గ్రామాల్లో భక్తులు మండపాలు ఏర్పాటు చేసి వినాయక విగ్రహాలను ఉంచి ఘనంగా పూజలు చేశారు. బుధవారం ఉదయం నుంచి వినాయకుడికి భక్తులు కుడుములు, ఉండ్రాళ్లు, రకరకాల పిండి వంటలు చేసి నైవేద్యాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని నేతివారిపాలెం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు పార్టీ మండల మాజీ అధ్యక్షుడు బొడ్డపాటి యల్లమంద నాయుడు ఆధ్వర్యంలో భారీ ఎత్తు వినాయకుడిని భారీ ఊరేగింపుగా గ్రామానికి తీసుకువెళ్లి ప్రత్యేకంగా తయారు చేసిన మండపంలో ఉంచి పూజలు చేశారు. టంగుటూరు మండలంలోని కారుమంచి గ్రామంలో గణేష్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో యువకులు వినాయక పూజలు ఘనంగా చేశారు.

101 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కును అందజేస్తున్న మంత్రి స్వామి

టంగుటూరు (కొండపి), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని అన్ని వర్గాల పేదలకు మెరుగైన వైద్యం అందించి, ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని నిలపడమే సీఎం చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖా మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. గురువారం తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో మంత్రి వైద్యం చేయించుకున్న అనారోగ్య బాధితులు 101 మందికి రూ.57.70 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఎరువులకు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు



మద్దిరాలపాడులో ఎరువులను పరిశీలిస్తున్న తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్

నాగులుప్పలపాడు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఎరువులకు కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ సూచించారు. మండలంలోని మద్దిరాలపాడు, నాగులుప్పలపాడు గ్రామాల్లోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. స్టాకు రిజిష్టర్‌లను పరిశీలించారు. అనంతరం డీలర్లకు ఎఫ్‌సీవో యాక్ట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ మండలస్థాయిలో ఎరువులు, పురుగుమందుల దుకాణాలను తనిఖీ చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీంను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎవరైన అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవో వెంకట్రావు, ఏఎస్ఐ సుబ్బారావు పాల్గొన్నారు.

ప్రశాంతంగా నిమజ్జనాలు జరుపుకోవాలి : సీఐ



తీరంలో ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన సీఐ శ్రీకాంత్

నాగులుప్పలపాడు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతంలో ప్రశాంతంగా వినాయక నిమజ్జనాలు జరుపుకోవాలని ఒంగోలు రూరల్ సీఐ శ్రీకాంత్‌బాబు సూచించారు. కనపర్తి తీరంలో నిమజ్జనాలు జరిగే ప్రాంతాలను గురువారం ఆయన పరిశీలించారు. నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకుని వినాయక నిమజ్జనాలను జరుపుకోవాలన్నారు నిమజ్జన జాగ్రత్తలపై ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. నిమజ్జనాలు పూర్తయ్యేవరకు తీరప్రాంతంలో గజ ఈతగాళ్ల అందుబాటులో ఉంచాలని ఎస్ఐ రజియాసుల్తానాకు సూచించారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ

సంతనూతలపాడు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎనికపాడు గ్రామంలో గురువారం ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎస్‌జీపాడు టీడీపీ మండల అధ్యక్షుడు తేళ్ల మనోజ్‌కుమార్, స్థానిక ఎంపీపీ బి.విజయ జెండాను ఆవిష్కరణ అనంతరం గ్రామంలో బైక ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు పి.రవికుమార్ పి.గంగయ్య, టి.చంద్రశేఖర్, పి.శ్రీను, ఎ.అశోక్, బ్రహ్మయ్య, బుజ్జి, కోటేశ్వరరావు, సుబ్బారావు, కోటేశ్వరరావు, నరసింహారావు పాల్గొన్నారు.

ఇంకుడుగుంతలతో భూగర్భ జలాల పెంపు

నాగులుప్పలపాడు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నివాస గృహాలలో ఇంకుడు గుంతలను నిర్మించుకోవడం ద్వారా భూగర్భజలాలు పెంపొందుతాయని ఎంపీడీవో తేళ్ల రవికుమార్ పేర్కొన్నారు. గురువారం ఈదుమూడి, మట్టిగుంట గ్రామాల్లో జరిగిన గ్రామసభలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రతి గ్రామపంచాయతీకి 25 చొప్పున ఇంకుడుగుంతలు నిర్మాణానికి అనుమతి లభించిందని చెప్పారు. ఒక్కో ఇంకుడుగుంత నిర్మాణానికి ఉపాధి పథక ద్వారా రూ.6వేలు అందిస్తామన్నారు. అనంతరం ఇంకుడుగుంత పనులను ప్రారంభించారు. వినోదరాయునిపాలెంలో ఏపీవో రవిబాబు అవగాహన కల్పించారు. సర్పంచ్ బోలే లక్ష్మి, ఘట్టమనేని అశోక్, కార్యదర్శి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోనుగుంట దేవాలయ ప్రాశస్త్యాన్ని కాపాడాలి

- ఎమ్మెల్యే బీఎస్
- ఘనంగా రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

చీమకుర్తి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : పురాణ ప్రాశస్త్యం కలిగిన గోనుగుంట గ్రామంలోని గంగా పార్వతీసమేత రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి నూతన పాలకమండలి కృషి చేయాలని ఎమ్మెల్యే బీఎస్.విజయ్‌కుమార్ కోరారు. ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకారమహోత్సవ కార్యక్రమాన్ని గురువారం స్థానిక దేవాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బీఎస్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని చెప్పారు. అనంతరం ఈవో రజని నూతనంగా నియమితులైన పాలకమండలి సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా మలినేని కోటేశ్వరరావు, డైరెక్టర్లుగా అన్నం కమల, సాదు సరోజనమ్మ, దర్శి అంకమ్మ, పాలకేటి రాజ్యలక్ష్మి, కోటు గరటయ్య, వెంపరాల మోహనరావు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో పూజారి చదలవాడ ప్రదీప్, ఇన్‌స్పెక్టర్ వేణు, టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, గొట్టిపాటి రాఘవరావు, పూనాటి వెంకట్రావు, పాలడుగు వెంకటనారాయణ, ఎనికపాటి లక్ష్మీనరసయ్య, గొల్లపూడి సుబ్బారావు, యడ్లపల్లి రామబ్రహ్మం, రావిపాటి రాంబాబు, వెంపరాల ఆంజనేయులు, నల్లూరి మధు, మలినేని ప్రసాద్, సర్పంచ్ సాధు మోహనరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణానికి మేలు

రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ విజయకుమార్



నిడమానూరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న వైస్‌చైర్మన్ విజయకుమార్

ఒంగోలు కలెక్టరేట్/నాగులుప్పలపాడు/ఒంగోలు(రూరల్) ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణానికి మేలు కలుగుతుందని రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయకుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పల్నాడు, గుంటూరు, బాపట్ల, నెల్లూరు జిల్లాల ప్రాజెక్టు మేనేజర్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణీ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను చూపించారు. ముందుగా నాగులుప్పలపాడు మండలం బి.నిడమానూరు గ్రామానికి చెందిన ఎం.అనుపమ ఏడు ఎకరాల్లో చేపట్టిన ప్రకృతి పంటల సాగును పరిశీలించారు. పోతవరం గ్రామంలో శేషారావు మొక్కజొన్న క్షేత్రాన్ని సందర్శించారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో విజయకుమార్ రైతులతో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పెట్టుబడి తక్కువగా ఉంటుందని చెప్పారు. రైతుల ఖర్చులు తగ్గి మంచి లాభాలు వస్తాయన్నారు. అనంతరం ఒంగోలు మండలం కొప్పోలులో మాధురి డ్రైప్యాడీ క్షేత్రాన్ని సందర్శించారు. అలాగే స్థానిక కలెక్టరేట్‌లోని సీపీవో హాలులో సౌత్‌కోస్టల్‌లోని ఐదు జిల్లాల ప్రాజెక్టు మేనేజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్ళేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ టీఎల్ గోపీచంద్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అమరవీరుల స్ఫూర్తితో మరో విద్యుత్ పోరాటం

- వామపక్ష నాయకుల పిలుపు



ప్రతిజ్ఞ చేస్తున్న వామపక్ష నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అమరవీరుల స్ఫూర్తితో రాష్ట్రంలో మరో విద్యుత్‌పోరాటానికి శ్రీకారం చుట్టాలని వామపక్షాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట గురువారం జరిగిన ప్రతిజ్ఞా దినం కార్యక్రమంలో 25 ఏళ్ళ క్రితం బషీర్‌బాగ్ విద్యుత్‌పోరాటంలో అమరులైన వారికి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యుడు జి.రమేష్, సీపీఐ ఎంఎల్ జిల్లా నాయకుడు ఎంఎస్ సాయి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్‌మీటర్లు పగలగొట్టండని పిలుపునిచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వాటినే అమలు చేయడం సిగ్గుచేటన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ రూ.1750 కోట్లతో అమెరికాలో అదానితో ఒప్పందం కుదుర్చుకున్న మాజీ సీఎం జగన్‌ను జైలుకు ఎందుకు పంపలేకపోతున్నారని ప్రశ్నించారు. సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి స్వామి, సీపీఐఎంఎల్ నాయకుడు ఆర్.మోహన్ మాట్లాడుతూ ఇండోసోల్ కంపెనీకి భూములు అప్పగించేందుకు కరేడు గ్రామాన్ని పోలీసులతో దిగ్బంధం చేయడం దుర్మార్గంగా ఉందని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి ఎస్‌కే.మాబు మాట్లాడుతూ, జిల్లా కార్యదర్శి ఎంఎల్.నారాయణ, నాయకులు చుండూరి రంగారావు, జీవీ.కొండారెడ్డి, ఎ.రమేష్, వి.బాలకోటయ్య, కె.రమాదేవి, పమిడి వెంకట్రావు, ఎస్.లలితకుమారి, బి.పద్మ, ఎల్.రాజశేఖర్, శ్రీరామ్ శ్రీనివాసులు, తంబి శ్రీనివాసులు, టి.మహేష్ తదితరులు పాల్గొన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మాబు ఆధ్వర్యంలో విద్యుత్ సంస్కరణపై మరో ఉద్యమం చేపట్టాలని ప్రతిజ్ఞ చేశారు.

రేపు ఒంగోలులో జాబ్‌మేళా

ఒంగోలు నగరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈ నెల 30వ తేదీన జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.రమాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, హీరో మోటార్ కార్ప్, ఎంఆర్ఎఫ్, రిలయన్స్, జియో ఇన్‌ఫోకామ్ లిమిటెడ్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. మెషిన్ ఆపరేటర్, ప్రొడక్షన్ ట్రైనీ, అసెంబ్లింగ్ ఆపరేటర్, జియో ఫైబర్ ఇంజనీర్, మేనేజర్ తదితర పోస్టుల భర్తీకి మేళా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. టెన్త్, ఐటీఐ, ఇంటర్, డిప్లమో, డిగ్రీ పూర్తి చేసిన వారు హాజరుకావాలని, ఎంపికైన వారికి రూ.10వేల నుంచి రూ.19,500ల వరకు నెలవారి వేతనం ఉంటుందన్నారు. 18-35 సంవత్సరాల వయస్సు మధ్య గల అభ్యర్థులు ఆధార్‌కార్డుతో పాటు విద్యార్హతల జిరాక్స్ కాపీలతో జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఉదయం 10 గంటల నుంచి జరిగే జాబ్‌మేళాకు హాజరుకావాలని ఆమె కోరారు.

నేత్రదానంతో అంధులకు చూపు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి సహజ మరణం తరువాత నేత్రదానం చేయడం ద్వారా అంధులకు దృష్టిదానం చేయవచ్చని ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంకు నిర్వాహకులు రాజన్న బుధవారం పేర్కొన్నారు. ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి అనుబంధంగా ఐ బ్యాంకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సందర్భంగా స్థానిక మంగమూరురోడ్‌కు చెందిన పంగులూరి రామారావు తన తల్లి శేషమ్మ మరణించడంతో ఆమె నేత్రాలను దానం చేశారని తెలిపారు. న్యాయవాది పంగులూరి గోవిందయ్య, ఎస్‌వీ.రంగారెడ్డి, దామా శ్రీనివాసులు, జి.నాగేశ్వరరావు, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీను పాల్గొన్నారు.

డీఎస్సీ పోస్టుల ఎంపికకు మరో అవకాశం ఇవ్వాలి

ఒంగోలు విద్య, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు అర్హత సాధించిన అభ్యర్థులకు పోస్టును ఎంపిక చేసుకునేందుకు మరో అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.మల్లికార్జునరావు, టి.దిలీప్‌చక్రవర్తి గురువారం ఒక ప్రకటనలో కోరారు. అభ్యర్థులకు ఈ అవకాశం కల్పించి వారికి న్యాయం చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు.

చెక్ బౌన్స్ కేసులో శిక్ష

టంగుటూరు (కొండపి), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కందులూరు గ్రామానికి చెందిన కుంచాల నాగార్జున అదే గ్రామానికి చెందిన మొలకలపల్లి లక్ష్మీనారాయణకు డబ్బులు బాకీ ఉండగా, నాగార్జున చెక్ ఇచ్చాడు. చెక్ బౌన్స్ అయినా ఎంతకీ బాకీ చెల్లించకపోవడంతో లక్ష్మీనారాయణ కోర్టులో కేసు వేశారు. నేరం రుజువు కావడంతో ఒంగోలులోని ఎక్సైజ్ కోర్టు నిందితుడికి రూ.2లక్షలు జరిమానా, రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధించింది. ఆ మేరకు న్యాయాధికారి కోమలివల్లి తీర్పునివ్వగా నేరస్తుడిని ఒంగోలు జైలుకు రిమాండ్‌కు తరలించారు.

స్వామిత్వ సర్వే పరిశీలన

కొండపి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కొండపి గ్రామ పంచాయతీలోని కట్టావారిపాలెంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను ఇన్‌చార్జి ఎంపీడీవో పి.రామకృష్ణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొండపి గ్రామ సచివాలయం-2లో సర్వేలో పాల్గొంటున్న సిబ్బందికి తగిన సూచనలు జారీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి తప్పులు లేకుండా చేయాలని సిబ్బందికి సూచించారు.

గ్రానైట్ లారీ బోల్తా



లారీని పక్కకు తొలగిస్తున్న క్రేన్

సంతనూతలపాడు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎండ్లూరు డొంకవద్ద బుధవారం అర్థరాత్రి వైట్‌స్టోన్ గ్రానైట్ లోడుతో బద్వేలు నుంచి గుళ్లాపల్లి వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు బోల్తాపడింది. లారీ తొలుత ముందున్న 108 వాహనాన్ని ఢీకొట్టి పక్కనే ఉన్న డ్రైనేజీ కాలువ, సగం రోడ్డుపై పడింది. గురువారం ఉదయం పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించి పోవడంతో పోలీసులు క్రేన్‌సాయంతో రోడ్డుపై పడిన గ్రానైట్ లారీని పక్కకు తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

ఘనంగా అమరావతి క్వాంటమ్ ర్యాలీ

సంతనూతలపాడు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎండ్లూరు డొంకవద్ద నున్న ఆర్‌జీయూకేటీ ఒంగోలు క్యాంపస్‌లో గురువారం అమరావతి క్వాంటమ్ ర్యాలీ హ్యాకథాన్-2025 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో ఐబీఎం, టీసీఎస్, క్యూక్రిషి వంటి పరిశ్రమల భాగస్వాముల మద్దతుతో విద్యార్థులకు క్వాంటం ఫస్ట్ టెక్నాలజీని ఉపయోగించి వాస్తవ సమస్యలను పరిష్కరించే హ్యాకథాన్ వేదికను కల్పించినట్లు ఏవో చంద్రశేఖర్ తెలిపారు. ఈ వేదికలో హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ ఆధారిత ఆలోచనలను పంచుకున్నట్లు తెలిపారు. ప్రతిభ చూపిన బృందాలు సెప్టెంబరు 10న జరగబోయే రీజినల్ సెమీఫైనల్స్, ఫైనల్స్ సెప్టెంబరు 13న ఆచార్యనాగార్జున విశ్వవిద్యాలయంలో ఫైనల్స్‌లో పాల్గొంటారని తెలిపారు.

వాసవీ క్లబ్ ఆర్థికసాయం



నాగలహరికి నగదును అందజేస్తున్న క్లబ్ సభ్యులు

నాగులుప్పలపాడు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రతిభ చూపిన గ్రామానికి చెందిన కొంజేటి నాగలహరికి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో రూ.5వేల నగదు బహుమతిని గురువారం క్లబ్ సభ్యుడు పులకణం శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ ఉపాధ్యక్షుడు కొంజేటి సురేష్‌బాబు, అమరావేణు, పులకణం రాజేష్, కొంజేటి జలంధర్, గాదంశెట్టి శ్రీనివాసరావు, తెలగతోటి శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.

పొన్నలూరు పోలీస్‌స్టేషన్ తనిఖీ



మాట్లాడుతున్న డీఎస్పీ యశ్వంత్

పొన్నలూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వార్షిక తనిఖీల్లో భాగంగా డీఎస్పీ సాయి ఈశ్వర్ యశ్వంత్ పొన్నలూరు పోలీస్‌స్టేషన్‌ను గురువారం సందర్శించారు. స్టేషన్‌లో రికార్డులను, సీడీ ఫైల్స్‌ను పరిశీలించారు. మహిళా పోలీస్ సిబ్బందితో మాట్లాడి గ్రామాల్లోని విషయాలు తెలుసుకున్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో మొక్కలు నాటారు.

వృద్ధులకు పండ్లు అందజేత



పండ్లు అందజేస్తున్న జనసేన నాయకులు

నాగులుప్పలపాడు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సేవా వారోత్సవాల్లో భాగంగా ఉప్పుగుండూరు వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆ పార్టీ నాయకులు గురువారం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. ఆశ్రమంలో తాగునీరు నిల్వ చేసుకునేందుకు కూలింగ్ ఫ్రిజ్ అందించాలని పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి పెంట్యాల కోటేశ్వరావు దృష్టికి తీసుకెళ్లడంతో త్వరలోనే అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ పెంట్యాల శ్రీనివాసరావు, అనిల్, అరుణ్, సాయి, శ్రీను, సుభాష్, బీజేపీ నాయకులు లచ్చంశెట్టి టేగ్రా, ఆశ్రమ నిర్వాహకులు పరిశుద్ధం, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

పత్తి దిగుమతి సుంకం రద్దుపై పోరాటం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పత్తి దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం రద్దుకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సంయుక్త కిసాన్‌మోర్చా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. ఒంగోలులోని మాదాల నారాయణభవన్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర రైతు సంఘాల సంయుక్త కిసాన్‌మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు తాళ్ళూరు, ముండ్లమూరు మండలాల్లో ఈనెల 30,31 తేదీల్లో, వచ్చేనెల 1న మార్కాపురం ఆర్డీవో కార్యాలయం, వచ్చేనెల 2న ఒంగోలులోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వడ్డె హనుమారెడ్డి, డి.జయంతిబాబు, కె.వీరారెడ్డి, ఎస్.లలితకుమారి, కె.హనుమంతరావు, ఆర్.మోహన్, వి.బాలకోటయ్య, ఎన్.హనుమంతరావు, పరిటాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక చవితి

- నవరాత్రి పూజలకు కొలువుదీరిన గణపతులు
- నిమజ్జనాలకు ఏర్పాట్లు చేసిన పోలీసులు
- కంభం చెరువు కట్టపై ఫ్లడ్ లైట్లు

కంభం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి వేడుకను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కంభంలో గురువారం ఉదయం 9గంటల నుంచి రాత్రి 10గంటల వరకు వందల సంఖ్యలో వినాయక విగ్రహాలను చారిత్రాత్మక కంభం చెరువులో నిమజ్జనం చేశారు. వినాయక చవితి పర్వదినం మరుసటి రోజు కంభం, బేస్తవారిపేట, అర్ధవీడు మండలాల నుంచి వందలాది విగ్రహాలను వివిధ వాహనాలలో తరలించి కంభం చెరువులో నిమజ్జనం చేశారు. చీకటి పడినా ఇబ్బందులు లేకుండా చెరువు కట్టపై ఫ్లడ్ లైట్లను ఏర్పాలు చేసినట్లు పోలీస్ అధికారులు తెలిపారు. విగ్రహ కమిటీ వారు భారీ విగ్రహాలను తరలించే సమయంలో ఊరేగింపునకు అగ్రభాగాన ఏర్పాటు చేసిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గులాములు చల్లుకుంటూ గణపతి పప్పా మోరియా అంటూ భక్తి పారవశ్యంతో తరలి వెళ్లారు. మహిళల కోలాటాలు, భజనలు అలరించాయి. మండలంలో వివిధ గ్రామాల నుంచి వాహనాలలో తరలి వచ్చిన గణనాథులు కందులాపురం సెంటర్, కళాశాల రోడ్డు, జామియా మసీదు సెంటర్, మెయిన్ బజార్, చౌక్ సెంటర్ల మీదుగా చెరువు కట్టకు తరలివెళ్లాయి.

కంభం చెరువు వద్ద భారీ బందోబస్తు

నిమజ్జనం సమయంలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా మార్కాపురం డీఎస్పీ నాగరాజు ఆధ్వర్యంలో ఐదుగురు సీఐలు, 25మంది ఎస్సైలు, 50మంది హెడ్ కానిస్టేబుళ్లు, 200మంది కానిస్టేబుళ్లు, వంద మంది హోంగార్డులు, 25మంది మహిళా కానిస్టేబుళ్లు, 50మంది రాపిడ్ యాక్షన్ ఫోర్స్ బందోబస్తులో పాల్గొన్నారు.

జంగంగుంట్లలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి, కందుల పూజలు

కంభం, అర్ధవీడు మండలాల్లో బుధవారం వినాయక చవితి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. జంగంగుంట్లలో ఎమ్మెల్యేలు ముత్తుముల అశోక్‌రెడ్డి, కందుల నారాయణరెడ్డి బుధవారం రాత్రి గణపతికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ వినాయక చవితి పర్వదినం అందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆకాంక్షించారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు.

గిద్దలూరు : వినాయక చవితి పర్వదినాన్ని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లల్లో చిన్నచిన్న బాలగణపతిలను పూజించి అనంతరం వీధి మండలపాల వద్ద ఉన్న పెద్ద వినాయకుల వద్దకు కొందరు చేర్చగా, మరికొందరు బుధ, గురువారాలు నిమజ్జనాలు చేశారు. గ్రామీణ ప్రాంతాలలో 300కు పైగా విగ్రహాలను ఏర్పాటు చేశారు. పందిళ్ల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటల పోటీలను నిర్వహించారు. సామూహిక పారాయణం నిర్వహించారు. రేడియోబావి సెంటర్‌లో 2 గణేష్ మండపాలకు భక్తులు పోటెత్తారు. వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం, జువ్విళ్లబావి దేవస్థానం, అమ్మవారిశాల, పలు ప్రధాన కూడళ్లలో భారీ ఎత్తున వేడుకలను జరుపుకున్నారు.

గిద్దలూరు టౌన్ : వినాయక చవితి సందర్భంగా గిద్దలూరు పట్టణంతోపాటు మండలంలోని గ్రామాలలో వినాయక చవితి వేడుకలు వైభవంగా జరిగాయి. ప్రత్యేక అలంకరణలో ఏర్పాటు చేసిన మండపాల వద్ద వివిధ రకాల అలంకారాలలో లైటింగ్‌లు ఏర్పాటు చేసి ఆకర్షణగా నిలిచాయి. పలు మండపాల వద్ద నిర్వాహకులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం చాలా మండపాల వద్ద అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పలు ప్రాంతాలలో స్వామి వారిని దర్శించుకున్నారు. కేఎస్‌పల్లి సమీపంలోని పెద్దచెరువు గ్రామంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహానికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బేస్తవారపేట : మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం ఘనంగా వినాయక చవితి వేడుకలు నిర్వహించారు.గురువారం ఉదయం నుంచి వినాయక విగ్రహాల నిమజ్జనం కోసం కంభం చెరువుకు తరలించారు. పట్టణంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. ఈ నిమజ్జనం ఆదివారం వరకు కొనసాగుతాయి.

కొమరోలు : మండలంలోని అన్ని గ్రామాల్లో మంగళ, బుధవారాల్లో వినాయక చవితి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.



ఆది దంపతుల ఒడిలో కూర్చొని కంభం చెరువులో నిమజ్జనం అవుతున్న గణనాథుడు

వినాయక గుడి ఆవరణలో భక్తుల సమక్షంలో వేద పండితుల నడుమ శ్రీ సిద్ధిబుద్ధి వినాయకుడి కల్యాణోత్సవాన్ని వైభవంగా జరిపించారు. శుక్రవారం పెద్ద ఎత్తున విగ్రహాల నిమజ్జనానికి నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

మార్కాపురం వన్‌టౌన్ : వినాయక చవితి పర్వదినాన్ని పట్టణంలో వైభవంగా నిర్వహించారు. మెయిన్ బజార్, నెహ్రూ బజార్ తదితర ప్రాంతాలలో వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఎల్ఐసీ ఆఫీస్, విజయ టాకీస్ వీధులలో మట్టి గణపతులను ఏర్పాటు చేశారు. మెయిన్ బజార్ వినాయక విగ్రహానికి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి ఇమ్మడి కాశీనిథ్ పూజలు చేశారు.

ఎర్రగొండపాలెం : వినాయక చవితి పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఎన్టీఆర్ సెంటరులో ఫ్రెండ్స్ సర్కిల్ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన 21 అడుగుల విశ్వరూప గణేశుని విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. జడ్పీ పాఠశాల ఉపాధ్యాయుడు టి వీరాచారి దంపతులు విగ్ర హాన్ని బహూకరించారు.



తర్లుపాడు, మార్కాపురంలో కొలువుదీరిన వినాయకులు

రూ.28వేలు పలికిన లడ్డూ



వేలంపాటలో లడ్డూని పొందిన దంపతులు

పొదిలి : వినాయక చవితి ఉత్సవాలను అన్ని గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద లడ్డూ వేలంపాటలో రూ.28వేలు పలికింది. ఈ లడ్డూను ఓబుల శెట్టి రాధాకృష్ణ, మోహన్‌సుందరి దంపతులు దక్కించుకున్నారు. వారిని ఆర్యవైశ్యులు అభినందించారు.



డీప్‌బోర్‌కు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ ఏఈ భూపాల్‌రెడ్డి

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

మార్కాపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మున్సిపాలిటీ పరిధిలో నీటి ఎద్దడి నివారణకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ ఏఈ టి.భూపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక 2వ వార్డులోని ఏకలవ్య కాలనీలో గురువారం ఉదయం మున్సిపల్ నిధులతో నూతన డీప్ బోర్‌కు శంకుస్థాపన చేశారు. వార్డుకు చెందిన పలువురు స్థానిక శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి దృష్టికి నీటి సమస్యను తీసుకెళ్లారని 2వ టీడీపీ ఇన్‌చార్జి పిన్నిక మల్లిఖార్జున్ తెలిపారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే నారాయణరెడ్డి ఆదేశాలతో మున్సిపాలిటీ నిధులతో డీప్ బోర్‌ను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. అనంతరం స్థానిక ఎస్సీ కాలనీకి వెళ్లే దారి చిల్లకంపతో ఇబ్బందులు కలిగిస్తుండడంతో మల్లికార్జున్ సొంత నిధులతో జేసీబీ సహాయంతో శుభ్రం చేయించారు. కార్యక్రమంలో 2వ వార్డు జనసేన పార్టీ ఇన్‌చార్జి యోగయ్య, 27, 28 బూత్‌లకు చెందిన టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీని వీడి టీడీపీలోకి చేరిక

గిద్దలూరు టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేఎస్‌పల్లె గ్రామంలో బుధవారం రాత్రి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సమక్షంలో రాష్ట్ర మహిళా బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ముత్యాలపాటి కౌసల్య భర్త ముత్యాలపాటి రంగనాయకులు తదితరులు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాలుగుళ్ల ప్రతాపరెడ్డి, పాలుగుళ్ల హనుమంతరెడ్డి, రిటైర్డ్ డీఎస్పీ బాలాజీనాయక్ ఉన్నారు.

కుక్కలు, కోతుల బెడద తొలగించాలి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 3వ వార్డు డ్రైవర్స్ కాలనీలో కుక్కల, కోతుల బెడద నుంచి కాపాడాలని వార్డు ప్రజలు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపారు. కుక్కలు, కోతల వలన ఇళ్ల నుంచి బయటకి రాలేకపోతున్నామని, పిల్లలు బడులకు కూడా వెళ్లలేకపోతున్నారన్నారు. కుక్కల కరవడంతో కొందరు ఆసుపత్రుల పాలయ్యారన్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని కమిషనర్‌కు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో రఫి, రూబెన్, జాన్ పాల్గొన్నారు.

పనులను సక్రమంగా నిర్వహించాలి

మార్కాపురం రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వెలుగు ప్రాజెక్టు ద్వారా జరుగుతున్న పనులను వీవోఏలు సక్రమంగా నిర్వహించాలని ఏపీఎం పిచ్చయ్య సూచించారు. ఎస్సీ బీసీ కాలనీలోని డ్వాక్రా బజారులో గురువారం మండల సమాఖ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ మహిళలు జీవనోపాధి యూనిట్లను ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని తెలిపారు. వయోజన విద్య కోఆర్డినేటర్ అంబటి చెన్నారెడ్డి మాట్లాడుతూ మండలంలోని వేమలకోట, కొట్టాలపల్లి గ్రామాల పరిధిలో నిరక్షరాస్యులైన మహిళలకు విద్యను నేర్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో సీసీలు నాగయ్య, స్వామి, గోపాల్‌రెడ్డి, మనోకుమారి, వీవోఏలు, మండల సమాఖ్య కమిటీ సభ్యులు బీబులు, అకౌంటెంట్ నాగమణి, గ్రామ సమాఖ్య కమిటీల ప్రతినిధులు పాల్గొన్నారు. అనంతరం ఏపీఎంను పిచ్చయ్యను సన్మానించారు.

హెచ్ఐవీ నియంత్రణపై అవగాహన

గిద్దలూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యాలవాడలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో హెచ్ఐవీ నియంత్రణ, మత్తు పదార్థాలపై అవగాహన సదస్సు జరిగింది. హెచ్ఐవి రాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. నివారణ ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత, చిన్నచూపు లేకుండా సమాజంలో ఎలా కలిసి జీవించాలో తెలిపారు. ఈకార్యక్రమంలో ఐఇసి ప్రచార కమిటీ ప్రతినిధులతో పాటు పాఠశాల హెచ్ఎం రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మట్టి పరీక్షలతో ఉత్తమ ఫలితాలు

పెద్ద దోర్నాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మట్టి పరీక్షలతో సాగు చేసే పంటల్లో ఉత్తమ ఫలితాలు పొందవచ్చని ఎర్రగొండపాలెం వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకట రమణ అన్నారు. మండలంలోని నల్లగుంట్ల గ్రామంలో సీపీపీ పొలంబడి కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ వెంకట రమణ మాట్లాడుతూ ప్రభుత్వం మట్టి పరీక్షలు ఉచితంగా చేస్తోందని తద్వారా భూమి సారాన్ని బట్టి పైరు సాగు చేయడం, తగిన ఎరువులు వేయడం ద్వారా మంచి ఆదాయాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో ఏవో జవహర్ లాల్ నాయక్ వీపీఏ మాధురి పాల్గొన్నారు.

సాంకేతిక వ్యవసాయానికి శ్రీకారం

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి



డ్రోన్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరు టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని దిగువమెట్ట తాండాలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో తాండాలో వెనుకబడిన వారికి శ్రీరామ కిసాన్ ఎఫ్ఎంటీ గ్రూప్ కన్వీనర్ కాట్రావత్ మాదవ్‌నాయక్, వారి గ్రూపు సభ్యులకు 80శాతం రాయితీపై కిసాన్ డ్రోన్‌ను సమకూర్చగా ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి డ్రోన్‌ను పంపిణీ చేశారు. అనంతరం పొలంలో డ్రోన్‌ను ఆపరేట్ చేసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే అశోక్ రెడ్డి మాట్లాడుతూ గ్రామాల్లోని యవతకు ఉపాధి కల్పన, వ్యవసాయ రంగంలో సాంకేతికతకు ప్రభుత్వం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. యువతకు వ్యవసాయ యాంత్రీకరణపై శిక్షణ ఇచ్చి రోబో డ్రోన్‌ను 10లక్షల విలువ చేసే డ్రోన్‌ను 2లక్షలకు అందచేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సొసైటీ కమిటీ ప్రమాణం



సొసైటీ కమిటీ ప్రమాణస్వీకార సభలో మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

పుల్లలచెరువు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : తల్లిని, చెల్లిని బయటకు నెట్టిన వ్యక్తి జగన్‌రెడ్డి అని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. గురువారం పుల్లలచెరువు మండలంలోని పుల్లలచెరువు పీఏసీస్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం చాపలమడుగులో ఘనంగా జరిగింది. సొసైటీ చైర్మన్‌గా పాతకోటి రామిరెడ్డితో ఎరిక్షన్‌బాబు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ రైతుల సంక్షేమమే టీడీపీ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతుల బాగును కోరి అన్నదాత సుఖీభవను అమలు చేశారన్నారు. వెలిగొండను పూర్తి చేయకుండా జగన్‌రెడ్డి రైతులను, ప్రజలను మోసగించారని ఎరిక్షన్‌బాబు ధ్వజమెత్తారు. కార్యక్రమంలో ఎంపీపీ వెంకటయ్య, టీడీపీ మండలాధ్యక్షుడు పయ్యావుల ప్రసాద్, చేకూరి సుబ్బయ్య,కాకర్ల కోటయ్య, రెంటపల్లి సుబ్బారెడ్డి, శనగా నారాయణరెడ్డి, పోట్ల గోవింద్, మెడికొండ లక్ష్మి నారాయణ, గజ్వేల్లి భాస్కర్, సొసైటీ డైరెక్టర్, నారు వెంకట్రామిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పిల్లలకు సాయం చేస్తున్న ఓర్నాన్ ఫౌండేషన్ సభ్యులు

అనాథలకు ఆర్థిక సాయం

బేస్తవారపేట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని జగ్గంబొట్ల కృష్ణాపురం గ్రామంలో తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా ఉన్న పిల్లల దీన గాధను ఆంధ్రజ్యోతిలో ప్రచురించడంతో స్పందించిన కొం దరు దాతలు ముందుకు వస్తున్నారు. ఓర్నాన్ ఫౌండేషన్ తరుపున నిత్యావసర వస్తువులు, చదువుకునేందుకు నగదు సాయం అందజేశారు. సంస్థ చైర్మన్ బద్దీటి అల్లూరయ్య మాట్లాడుతూ ఇలాంటి దయనీయ పరిస్థితిలో ఉన్న చిన్నారులను అదుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కుటుంబానికి అండగా ఉంటుందని పేర్కొన్నారు.

గణేష్ నగర్‌లో కూలిన చెట్టు



రోడ్డుపై విరిగిపడ్డ చెట్టు

గిద్దలూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గణేష్ నగర్‌లో గల ప్రభుత్వ వెటర్నరీ ఆసుపత్రిలో ఉన్న చెట్టు అకస్మాత్తుగా విరిగి రోడ్డుకు అడ్డంగా పడింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. గురువారం గాలి, వాన వచ్చిన సమయంలో గాలులకు చెట్టుకు సంబంధించిన ప్రధాన కొమ్మలు విరిగి దాంతోపాటు చెట్టు నేలకు ఒరిగిపోయింది. నిత్యం రద్దీగా ఉండే ఆప్రాంతంలో ఆసమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది.

పొగాకు నారుమళ్లకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

పొదిలి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పొగాకు నారుమళ్లకు రిజిస్ట్రేషన్‌లు తప్పనిసరి అని రీజినల్ సూపరింటెండెంట్ ఎం.సత్యశ్రీనివాస్ అన్నారు. గురువారం మండలంలోని మాదాలవారిపాలెం, మూగచింతలపాలెంలో నారుమడులు సాగు చేస్తున్న యజమానులకు తగుసూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంచి విత్తనాలను ఎంపిక చేసుకుని తప్పనిసరిగా బోర్డు అనుమతితో పొగాకు సాగు చేయాలన్నారు. పొగాకు దేశీయంగా విదేశాల్లో మంచి గిరాకీ ఉందన్నారు. అయితే మార్కెట్లో ప్రస్తుతం ఉన్న విలువను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత పంట కాలానికి 142 మిలియన్ కిలోల ఉత్పత్తిని అనుమతించారని తెలిపారు. ఈ ఏడాది రైతు లు పొగాకు బోర్డు నిర్ణయించిన పరిమితిలోనే సాగుచేయాలన్నారు. పొగాకు పంట నియంత్రణలో భాగంగా నారుమళ్ల దశ నుంచే రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గరిష్టంగా ప్రతి రైతు రెండు హెక్టార్ల విస్తీర్ణం వరకు రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులకు మాత్రమే ఎంఐఆర్‌సీఏ సంస్థ వారు విత్తనాలను సరఫరా చేస్తారన్నారు. నవంబరు 30లోపు నారు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ క్షేత్ర సహాయకులు మోతీలాల్, పొదిలి వేలం నిర్వహణాధికారి గిరిరాజ్‌కుమార్, క్షేత్ర సహాయకులు జీవన్, కే.ఆశాబీ, రైతులు పాల్గొన్నారు.

రెవెన్యూ ఉద్యోగులకు సన్మానం

గిద్దలూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ అవార్డులు పొందిన ఉద్యోగులను రెవెన్యూ సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఉత్తమ మండల సర్వేయర్‌గా ఎం.ఆంజనేయులు, ఉత్తమ జూనియర్ అసిస్టెంట్‌గా అవార్డు పొందిన బి.నారాయణరెడ్డిలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆంజనేయ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నాయబ్‌హుస్సేన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ భాస్కర్‌రావు, వీఆర్వోల సంఘం జిల్లా అధ్యక్షుడు వై.పి.రంగయ్య, సిబ్బంది, వీఆర్‌వోలు పాల్గొని అవార్డులు పొందిన ఉద్యోగులను ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు.



దుర్గేష్‌రెడ్డికి నియామకపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

పట్టణ తెలుగు యువత అధ్యక్షునిగా దుర్గేష్‌రెడ్డి

మార్కాపురం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం పట్టణ తెలుగు యువత అధ్యక్షుడిగా స్థానిక 19వ వార్డుకు చెందిన దొడ్డా దుర్గేష్‌రెడ్డిని ఎంపిక చేశారు. ఈ మేరకు నియామకపత్రాన్ని గురువారం స్థానిక జవహర్‌నగర్ కాలనీలోని ఎమ్మెల్యే స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి దుర్గేష్‌రెడ్డికి అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వారికి తప్పక పదవులు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ మాలపాటి వెంకటరెడ్డి, మాజీ చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి, పోల్ మేనేజ్‌మెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కందుల రామిరెడ్డి, టౌన్ పార్టీ అధ్యక్షుడు పఠాన్ ఇబ్రహీం ఖాన్, టీడీపీ నాయకులు షేక్ మౌళాలి, కనిగిరి బాలవెంకటరమణ, షేక్ పెద్దావలి, బొగ్గు శేఖర్‌రెడ్డి, చిట్యాల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు

గిద్దలూరు టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : నీట్ ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన కాకినాడ రంగరాయి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన మండలం బురుజుపల్లె తాండాకు చెందిన బద్రి నాయక్‌ను ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి అభినందించారు. బద్రినాయక్‌ను, తండ్రి శేఖర్‌నాయక్‌ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వం కల్పించిన సదుపాయాలను వినియోగించుకొని ఉన్నత విద్యను అభ్యసించాలన్నారు.

సైకిల్ యాత్ర ప్రారంభం

గిద్దలూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సైకిల్ యాత్ర గురువారం ప్రారంభించారు. తొలిరోజు గిద్దలూరులో ప్రారంభమైన సైకిల్ యాత్రలో ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యులు పరమేష్ పాల్గొని మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా సమస్యలు పరిష్కారం కావడం లేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరాస్వామి, ఎస్ఎఫ్ఐ నాయకులు వినోద్, పాండురంగారావు, ఆనంద్ పాల్గొన్నారు.

కాలనీలో సమస్యలను పరిష్కరించాలి

కొమరోలు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నాయీబ్రాహ్మణ కాలనీలో సమస్యలను ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి సహకారంతో వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటానని సొసైటీ అధ్యక్షుడు ముత్తుముల సంజీవరెడ్డి అన్నారు. కొమరోలు గ్రామపంచాయతీలో నాయీబ్రాహ్మణ కాలనీ ప్రజలు ప్రధాన రోడ్డు, తాగునీటి సమస్యను పరిష్కరించాలని సంజీవరెడ్డిని కోరారు. దీనిపై ఆయన స్పందించారు. కాలనీలో అంతర్గత రోడ్లను సీసీ రోడ్లుగా మారుస్తామన్నారు.

ఊరేగింపు ఘర్షణలో ఒకరికి రిమాండ్

గిద్దలూరు టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి పండుగ ఊరేగింపులో ఇరువర్గాలు ఘర్షణకు దిగిన ఘటనలో ఒకరికి 14 రోజుల రిమాండ్‌ను కోర్టు విధించింది. పోలీసుల కథనం ప్రకారం.. 25వ తేదీ రాత్రి మండలంలోని దొడ్డంపల్లి గ్రామంలో వినాయకుడిని మండపానికి తీసుకువెలుతుండగా జరిగిన ఘర్షణలో టీడీపీ, వైసీపీ వర్గీయులు గాయపడ్డారు. పోలీసులు 21 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బుధవారం వైసీపీ నాయకుడు, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు టీవీ కృష్ణారెడ్డిని పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్ విధించినట్లు అర్బన్ సీఐ కె.సురేష్ తెలిపారు.

విద్యుత్ భారాలపై ఉద్యమం

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ అమరవీరుల స్ఫూర్తితో విద్యుత్ భారాలపై మరో ఉద్యమాన్ని కొనసాగిస్తామని వామపక్ష నాయకులు అందె నాసరయ్య, డీకేఎం రఫి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో విద్యుత్ సంస్కరణలకు వ్యతిరేకంగా 2000 ఆగస్టు 28న జరిగిన పోరాటంలో అమరులైన విద్యుత్ అమరవీరులకు సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో గురువారం స్థానిక కోర్టు సెంటర్‌లో నివాళులర్పించారు. పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలన్నారు. కార్యక్రమంలో వామపక్ష నాయకులు కాశీం, హరిబాబు, రూబెన్, కాశయ్య పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : విద్యుత్ పోరాటంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు గురువారం సీపీఐ నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు కేవీ కిష్టగౌడ్, టీసీహెచ్ చెన్నయ్య, మన్నెం సాంబశివరావు, సీపీఎం నాయకులు షేక్ అమీర్‌బాషా పాల్గొన్నారు,

ఘనంగా దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావం

ఎర్రగొండపాలెం,ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : దివ్యాంగుల హక్కుల పోరాట సమితి పోరాటాలతోనే అనేక సమస్యలు పరిష్కారమయ్యాయని సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్మా రాజయ్య అన్నారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా గురువారం పోలీసు స్టేషన్ వద్ద నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు విభిన్న ప్రతిభా వంతులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి జి వినయ్, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గుమ్మా రాజయ్య, నియోజకవర్గ అధ్యక్షుడు పెద్ద పాలంకయ్య, కార్యదర్శి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

మాదిగ ఉద్యోగులు ఐక్యంగా ఉండాలి

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మాదిగల ఉద్యోగులంతా ఐక్యతతో సంఘ బలోపేతానికి కృషి చేయాలని మాదిగల ఉద్యోగుల సంఘం జాతీయ నాయకుడు బొంత ఏసుదాసు మాదిగ అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మాదిగ ఉత్తమ ఉద్యోగులకు ఎంఈఎఫ్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ ఆధ్వర్యంలో సన్మానించారు. శ్యామ్ సుభాకర్, రాజేష్, కాశయ్య, జ్యోతి, ఏలియాలను సన్మానించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఇనుప దుకాణంలో చోరీ

పెద్ద దోర్నాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : శివ బాలాజీ ట్రేడర్స్ దుకాణంలో బుధవారం రాత్రి చోరీ జరిగి రూ.90వేల నగదు అపహరించుకు పోయినట్లు యజమాని పీ వెంకటేశ్వర్లు పోలీసు స్టేషనులో గురువారం ఫిర్యాదు చేశారు. ఎస్సై వీ మహేష్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీంను పిలిపించి క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

పొదిలి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తలమళ్ల గ్రామం వద్ద రెండు మోటార్ బైకులు డీకొన్న ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. తలమళ్ల ప్రభుత్వ పాఠశాల్లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న గాలిముట్టి రమేష్, సచివాలయంలో వేల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సృజల ఒకే వాహనంపై వస్తున్నారు. సచివాలయం మలుపు వద్ద కుడివైపు రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి వస్తున్న బైకు వారి వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో ఆ ముగ్గురూ రోడ్డుపై పడగా తీవ్రగాయాలయ్యాయి. వారిని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేశారు. రమేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. మరో మోటారు బైకుపై వస్తున్న రాచపూడి నాగేంద్రబాబుకు తీవ్రగాయాలు కావడంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఒంగోలు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీఎస్సీలో శశికళకు ర్యాంకు



కురిచేడు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025లో కురిచేడుకు చెందిన పున్నూరి శశికళ ర్యాంకు సాధించింది. ఎస్ఏ ఫిజికల్ ఎడ్యుకేషన్ కోటాలో ఎస్సీ మహిళా విభాగంలో జిల్లాలో మొదటి ర్యాంకు సాధించింది. ఈసందర్భంగా ఆమెను పలువురు అభినందించారు.

కేజీబీవీ టీచర్ మూడు పోస్టులకు అర్హత



లక్ష్మీచంద్రకళ

ముండ్లమూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో తెలుగు సీఆర్‌టీగా పనిచేస్తున్న దీవి లక్ష్మీచంద్రకళ మూడు పోస్టులకు అర్హత సాధించారు. డీఎస్సీ 2025లో తెలుగు స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు. మూడో జోన్‌కు చెందిన తెలుగు టీజీటీ ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ పోస్టుకు కూడా ఎంపికయ్యారు. జూన్ 25లో నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్‌టీఏ నిర్వహించిన యూజీసీ నెట్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగానికి అర్హత పొందారు. పీహెచ్‌డీ అభ్యసించేందుకు లక్ష్మీచంద్రకళ అర్హత పొందారు. 14 సంవత్సరాలుగా ముండ్లమూరులోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్నారు. ఈసందర్భంగా ఆమెను ప్రిన్సిపాల్ ఆవుల సునీత, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

స్కూల్ అసిస్టెంట్‌కు ప్రియాంక ఎంపిక

ముండ్లమూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పేదింటి బిడ్డ స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషు పోస్టుకు ఎంపికయ్యారు. మండలంలోని ఈదర గ్రామానికి చెందిన కొండారు శ్రీనివాసరావు, రమణమ్మ దంపతుల కుమార్తె ప్రియాంక చిన్న తనం నుంచే చదువుల్లో రాణించారు. నాగార్జున యూనివర్శిటీలో ఎంఏ గోల్డ్‌మెడల్ సాధించింది. దీంతో పేదింటి బిడ్డ స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లీషు పోస్టుకు ఎంపిక కావటంతో గురువారం సర్టిఫికెట్‌ల పరిశీలనకు పిలుపు రావటంతో ప్రియాంక తల్లిదండ్రులు స్వీట్లు పంపిణీ చేశారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంపొందించాలి

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఎఫ్ఎల్ఎన్ సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డైట్ లెక్చరర్ టీవీ రామచంద్రరావు అన్నారు. గురువారం సీఎస్‌పురం మండలంలో పలు పాఠశాలలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. సీఎస్‌పురం జిల్లా పరిషత్ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో రాజాల కొండారెడ్డి, హెచ్ఎం ఖాదరున్నీసాబేగం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల ఆకస్మిక తనిఖీ

వెలిగండ్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపాయపల్లి పాఠశాలను ఎంఈవో దాస్ ప్రసాద్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వి.కవిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సర్వే పూర్తి చేయాలి

పామూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జరుగుతున్న స్వామిత్వ సర్వేలను పారదర్శకంగా చేయాలని ఎంపీడీవో ఎల్.బ్రహ్మయ్య సూచించారు. మండలంలోని ఇనిమెర్ల, మోపాడు గ్రామాల్లో జరుగుతున్న సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ కంఠం భూముల్లో నివాసం ఉంటున్నవారి స్థలాలను డ్రోన్ కెమెరాలతో సర్వే నిర్వహించి యాజమాన్య హక్కులు కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈసందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటి కొలతలను కొలిచి నమోదు చేశారు. అనంతరం గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గుత్తి రాజగోపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకించాలి

పామూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ప్రజలు వ్యతిరేకించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ హనీఫ్ పిలుపునిచ్చారు. గురువారం స్థానిక మమ్మిడాడి సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజలపై భారాలు మోపాలని యత్నిస్తున్నారని అన్నారు. వెంటనే విరమించుకోవాలన్నారు. లేనిపక్షంలో మరో విద్యుత్ ఉద్యమాన్ని ప్రారంభిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్డీ మౌలాలి, పి.ప్రభాకర్, ఖాదర్‌బాషా, కె.మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

ఈపంట నమోదు చేసుకోవాలి

కనిగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతు ఈపంట నమోదు చేసుకోవాలని ఏడీఏ జైనులాబ్దిన్ అన్నారు. గురువారం మండలంలోని చాకిరాల, నేలటూరి గొల్లపల్లి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయ పాల్గొన్నారు. ఈసందర్భంగా ఈపంట నమోదును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఖరీఫ్ 2025 సీజన్‌లో సాగచేసిన పంటలకు ఈనెల 30 వరకు బీమా చెల్లించుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఉద్యాన ఏవో విష్ణుప్రియ, వీఏఏ కరిమున్నీసా పాల్గొన్నారు.

ఓబీసీలో కూలిన డ్రాప్

» పట్టించుకోని అధికారులు

దర్శి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఒంగోలు బ్రాంచ్ కాలువ(ఓబీసీ)లో దర్శి, పొదిలి రోడ్డు వద్ద డ్రాప్ కూలిపోయింది. సాగర్ కాలువల నిర్మాణ సమయంలో నీటి ప్రవాహాన్ని కట్టడి చేసేందుకు, ఎగువ ఉన్న మేజర్లకు సక్రమంగా నీరందించేందుకు వీలుగా ఈడ్రాప్‌ను నిర్మించారు. కాలక్రమంలో డ్రాప్ సామర్థ్యం కోల్పోయి పూర్తిగా దెబ్బతింది. గత వైసీపీ ప్రభుత్వం హయంలో పాలకులు సాగర్ కాలువల మరమ్మతుల గురించి పట్టించుకోకపోవటంతో కూలేదశకు చేరింది. ఇటీవల భారీ వర్షాలు కురవటంతో శ్రీశైలం, సాగర్ జలాశయాలలు నిండటంతో పాటు ఉధృతంగా వరద రావటంతో సాగర్ కాలువలకు నీటిని మళ్లించారు. ఒంగోలు బ్రాంచ్ కాలువలో గతంలో ఎన్నడూలేని విధంగా గరిష్ఠంగా నీరు విడుదల చేయటంతో కాలువ కట్టలు, అంచులు తాకుతూ ప్రవహించాయి. ఉధృతంగా నీరు ప్రవహించటంతో ఆ వేగానికి ఈడ్రాప్ కొట్టుకుపోయింది.

అయితే, ఇక్కడ ఎస్‌కేజే పవర్ ప్రాజెక్టు నిర్మించారు. పవర్ ప్రాజెక్టుకు ఎగువ భాగాన సమాంతరంగా మరో కాలువను తవ్వారు. ప్రస్తుతం ఒంగోలు బ్రాంచ్ కాలువకు సాధారణంగా నీరు విడుదలైనప్పుడు ఆనీరంతా పవర్ ప్రాజెక్టులో నుంచి తవ్విన కాలువ ద్వారా కిందకు వెళ్తుంది. సాగర్ కాలువలకు నీటి ప్రవాహం పెరిగినప్పుడు పాత కాలువకు కూడా నీరు మళ్లిస్తారు. ప్రస్తుతం రెండు కాలువల్లో నీరు ప్రవహిస్తుంది. కూలిన డ్రాప్‌కు మరమ్మతులు చేసే విషయంపై ఎన్ఎస్‌పీ అధికారులను వివరణ కోరగా.. ఆ ప్రాంతంలో కిలోమీటరు దూరం ఎస్‌కేజీ ప్రాజెక్టు మెయింటెన్స్ చేయాల్సి ఉందన్నారు. ఎక్కడైనా కాలువ కట్టలు కానీ, నిర్మాణాలుకానీ దెబ్బతింటే పవర్ ప్రాజెక్టు వారు పునర్నిర్మించాల్సి ఉందన్నారు. కారణాలు ఏమైనా 1.70 లక్షల ఎకరాలకు సాగు నీరందించే ఒంగోలు బ్రాంచ్ కాలువలో డ్రాప్ సగానికి పైగా కూలిపోయింది. దీంతో కాలువ కట్ట అంచులు కోసుకుపోయినప్పటికీ ఎవరూ పట్టించుకోకపోవటంపట్ల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కూలిన డ్రాప్‌ను వెంటనే పునర్నిర్మించాలని వారు కోరుతున్నారు.



ఒంగోలు బ్రాంచ్ కాలువలో కూలిన డ్రాప్

వైభవంగా వినాయక చవితి వేడుకలు

దర్శి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలు మండలంలో వైభవంగా జరిగాయి. సంప్రదాయబద్ధంగా పత్రితో గృహాలలో పూజలు చేసి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. మండలంలో సుమారు 200 గణేష్ విగ్రహాలు ఏర్పాటుచేశారు. విగ్రహాల వద్ద భక్తులు అధికసంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. విగ్రహాలకు కొంతమంది మూడు రోజులు, మరికొంతమంది ఐదురోజులు, చివరగా తొమ్మిది రోజులు పాటు పూజలు చేసి నిమజ్జనం చేస్తారు. విగ్రహాల వద్ద ప్రతిరోజు పూజా కార్యక్రమాల అనంతరం తీర్థప్రసాదాలు, అన్నదానం నిర్వహిస్తున్నారు.

స్థానిక లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, వివిధ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. డీఎస్పీ బి.లక్ష్మీనారాయణ, సీఐ రామారావులు మట్టి ప్రతిమలను భక్తులకు అందజేశారు.

కనిగిరిలో.. కనిగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలను బుధవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలో 220 విగ్రహాలను ఏర్పాటుచేశారు. విగ్రహాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా డీఎస్పీ సాయిఈశ్వర్‌యశ్వంత్ ఆదేశాలతో సీఐ ఖాజావలి, ఎస్ఐ శ్రీరాంలు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను సీఐ ఖాజావలి ఎస్ఐ సిబ్బందితో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు.

కాగా, కనిగిరి పట్టణంలోని ఒంగోలు బస్టాండు వద్ద ఉన్న బోయపాలెం విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. హైద్రాబాద్‌లో ప్రత్యేకంగా చేయించి ప్రత్యేక వాహనం ద్వారా కనిగిరికి తీసుకువచ్చి విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. వినాయచవితి పండుగ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఆదేశాలతో అమరావతి గ్రౌండ్స్‌లో ఏర్పాటుచేసిన మట్టి గణపతికి తెలుగుమహిళలు ప్రత్యేక పూజలు చేశారు. రెండోరోజు గురువారం ముస్లిం మైనారిటీ నాయకులు పూజల్లో పాల్గొన్నారు. సందర్భంగా ముస్లిం మైనారిటీ నాయకులు ఫిరోజ్, గుడిపాటి ఖాదర్, అంజుమన్‌కమిటీ అధ్యక్షుడు అహ్మద్‌లు మాట్లాడుతూ విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడు కనిగిరి ప్రాంతంలో ప్రతి ఇల్లు శోభాయమానంగా, ఆయా కుటుంబ సభ్యులు సంతోషంగా ఐశ్వర్యాలను ప్రసాదించి అందరూ ఐకమత్యంగా ముందుకు సాగాలని వేడుకున్నారు. కార్యక్రమంలో నాయకులు బుల్లా బాలబాబు, నజీముద్దీన్, బారాయి మాం, తెలుగు మహిళలు షేక్ వాజిదాబేగం, కరణం అరుణ, తులసి, తదితరులు పాల్గొన్నారు.



దర్శిలో వినాయకుని విగ్రహం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



కనిగిరి: విగ్రహాల వద్ద ఏర్పాట్లపై పరిశీలన చేస్తున్న సీఐ ఖాజావలి, ఎస్ఐ శ్రీరాం



కనిగిరి: అమరావతి ప్రాంగణంలో మట్టి గణపతిని పూజిస్తున్న ముస్లింలు

ముండ్లమూరులో.. ముండ్లమూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండ లంలో వినాయక చవితి పండుగను బుధవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలో 96 విగ్రహాలు ఏర్పాటుచేశారు. పసుపుగల్లు బస్టాండ్ సెంటర్‌లో టీడీపీ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని ఏర్పాటుచేశారు. పెదఉల్లగల్లులో వడియరాజులు ఆధ్వర్యంలో 17 అడుగుల వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ కమలాకర్ ప్రతి గ్రామాన్ని సందర్శించి నిర్వాహకులకు పలు సూచనలు చేశారు.

కాగా, మండలంలోని ఈదర గ్రామంలో జనసేన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం వద్ద ఫ్లెక్సీని గుర్తు తెలియని వ్యక్తులు చించి వేయటంతో గ్రామంలో ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ కమలాకర్ బుధవారం రాత్రి గ్రామానికి చేరుకొని ఇరువర్గాలతో మాట్లాడారు. గురువారం ఇరువర్గాల వారిని బైండోవర్ చేసి తహసీల్దార్ లక్ష్మీనారాయణ వద్ద హాజరు పరిచారు.

తాళ్లూరులో.. తాళ్లూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి వేడుకలు బుధవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. మండలంలో దాదాపు 43 విగ్రహాలను ఏర్పాటుచేశారు. ఎస్సై ఎస్.మల్లికార్జునరావు గ్రామాల్లో విగ్రహాలు ఏర్పాటుచేసిన మందిరాలను పరిశీలించి ప్రశాంత వాతావరణంలో ఉత్సవాలు జరుపుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

పామూరులో.. పామూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో వినాయక చవితి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పామూరు పట్టణంలో 70 వరకు వినాయక మండపాలు ఏర్పాటుచేశారు. పలుచోట్ల భక్తులకు అన్నదాన కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. పామూరులోని భగత్‌సింగ్ వీధిలో గురువారం జరిగిన పూజా కార్యక్రమంలో మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు బోయిళ్ల నారాయణరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమానికి లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. కంభాలదిన్నె గ్రామంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

పీసీపల్లిలో.. పీసీపల్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వినాయకచవితి పండుగను మండల ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని 18 పంచాయతీల్లో 86 వినాయకుని విగ్రహాలను ఏర్పాటు చేశారు. నిమజ్జన సమయంలో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్సై జి.కోటయ్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.



ముండ్లమూరు: పెదఉల్లగల్లులో వడియరాజుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహం

పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్

సీఎస్‌పురం(పామూరు), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలని కనిగిరి డీఎస్పీ సాయిఈశ్వర్ యశ్వంత్ అన్నారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం సీఎస్‌పురం పోలీస్‌స్టేషన్‌ను పామూరు సీఐ ఎం.భీమానాయక్‌తో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గణేష్ మండపాల వద్ద, నిమజ్జన సమయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు.

సీఎస్‌పురం పట్టణంలో ట్రాఫిక్ నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కొత్త వ్యక్తుల కదలికలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్ఐ ఎం.వెంకటేశ్వర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కృషి

కనిగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కనిగిరి మండలంలోని రైతుల సంక్షేమానికి కృషి చేస్తానని పీఏసీఎస్ చైర్మన్ అద్దంకి రంగబాబు అన్నారు. స్థానిక ఏబీఎం ప్రాంగణంలోని పీఏసీఎస్ కార్యాలయంలో గురువారం ఆయన ప్రమాణస్వీకారం చేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి తనపై నమ్మకంతో పదవి కల్పించారన్నారు. ఆనమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. రైతులను పంటల సాగుపై ప్రోత్సహించి ప్రత్యేక రాయితీ రుణాలు అందించేవిధంగా కృషి చేస్తామన్నారు. ఈసందర్భంగా మండలంలోని వివిధ వర్గాల ప్రజలు, రైతులు, నాయకులు రంగబాబుకు అభినందనలు తెలుపుతూ సత్కరించి సన్మానించారు.

కార్యక్రమంలో టీడీపీ నాయకులు వీవీఆర్ మనోహరరావు (చిరంజీవి), దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, పోతు కొండారెడ్డి, రాచమల్ల శ్రీనివాసులురెడ్డి, తమ్మినేని వెంకటరెడ్డి, ఫిరోజ్, గుడిపాటి ఖాదర్, బుల్లా బాలబాబు, జాతీయ వాసవీసత్ర సముదాయాల చైర్మన్ దేవకి వెంకటేశ్వర్లు, బొగ్గరపు సుందరరాజా, తదితరులు పాల్గొన్నారు.



రంగబాబును సన్మానిస్తున్న కూటమి నాయకులు

ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ తనిఖీలు

కురిచేడు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కురిచేడులోని ఎరువుల దుకాణాలలో విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు. ఎరువులు ఎక్కువగా ఉండటం, సక్రమంగా బిల్లులు లేకపోవడంతో కేసులు నమోదు చేసి అమ్మకాల నిలుపుదలకు సిఫార్సు చేశారు. ఎరువులు, పురుగుమందుల దుకాణాలలో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్థానిక వ్యవసాయ అధికారులతో కలిసి తనిఖీ చేశారు. సరైన పత్రాలు లేని 7.655 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. 125 కేజీల విత్తనాలను సీజ్‌చేశారు. అక్రమంగా ఉంచినవాటిని నిలుపుదల చేస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి తెలిపారు.

ఈ తనిఖీలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ ఎస్.అపర్ణ, వ్యవసాయాధికారి కె.విశనాగప్రసాద్, హెడ్‌కానిస్టేబుల్ రవిబాబు, కానిస్టేబుల్ సురేష్, స్థానిక మండల వ్యవసాయాధికారి సంపత్, తదితరులు పాల్గొన్నారు.



దొనకొండ: యూరియా స్టాక్‌ను, రికార్డులను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ రమాదేవి, వ్యవసాయాధికారి బాలకృష్ణానాయక్

అధిక ధరలకు అమ్మితే కఠినచర్యలు

దొనకొండ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): అధిక ధరలకు యూరియా అమ్మితే కఠినచర్యలు తీసుకుంటామని తహసీల్దార్ రమాదేవి పేర్కొన్నారు. గురు వారం దొనకొండలోని పలు ఎరువుల దుకాణాలను వ్యవసాయాధికారి బాల కృష్ణానాయక్‌తో కలిసి ఆమె తనిఖీలు చేశారు. దుకాణాల్లోని యూరియా స్టాక్‌ను తనిఖీచేశారు. అందుకు సంబంధించిన రికార్డులు, లైసెన్సులు, ధర ల పట్టికలను పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన ధరకే యూ రియాను విక్రయించాలన్నారు. అనుమతులు లేని ఎరువులను, పురుగుల మందులను విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ముండ్లమూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మండలంలోని శంకరాపురం, నూజెండ్లపల్లి, మారెళ్ళ, తూర్పుకంభంపాడు, మక్కెనవారిపాలెం, జమ్మలమడక, ఈదర, భీమవరం, పూరిమెట్ల, కెల్లంపల్లి, పెదఉల్లగల్లు గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా తహసీల్దార్ బీఎల్‌వోలతో మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ బీఎల్‌వోల వద్దకు వెళ్ళి ఓటు హక్కు నమోదు చేసుకోవాలన్నారు. ఇతర ప్రాంతాల్లో ఉద్యోగరీత్యా ఉన్నవారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల బీఎల్‌వోలు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

పొదుపు సంఘాలను బలోపేతం చేయాలి

పామూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పొదుపు సంఘాలను బలోపేతం చేయాలని ఏపీఎం జి. విద్యాసాగార్ అన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన మండల సమాఖ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. పొదుపు సంఘాలకు పెరటి కోళ్లు, పెరటి తోటలు, చేపలు పెంపకం లాంటి యూనిట్లను ప్రభుత్వం రాయితీ కింద మంజూరు చేస్తుందన్నారు. ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యాలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్న సీసీలకు జిల్లా అధికారులు మెమోలు జారీ చేశారన్నారు. వరుసగా మూడు సమావేశాలకురాని వీవో, వీవోఏలకు జీతాలు నిలుపుదల చేయనున్నట్టు చెప్పారు. సమావేశంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు ఓరుగంటి సుబ్బమ్మ, కార్యదర్శి ఉమ్మడి పద్మ, సహాయ కార్యదర్శి విజయ, సీసీలు పాల్గొన్నారు.

టీడీపీ నేత మానం రమేష్‌ను పరామర్శించిన లక్ష్మి



మానం రమేష్‌ను పరామర్శిస్తున్న గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్ తదితరులు

తాళ్లూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ ఒంగోలు పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి మానం రమేష్‌బాబు కుటుంబీకులను ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి, లలిత్‌సాగర్, ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు మేడగం వెంకటేశ్వరరెడ్డి, తదితరులు గురువారం పరామర్శించారు. రమేష్‌బాబు సతీమణి సుబ్బారత్తమ్మ అనారోగ్యంతో మృతి చెందిన విషయం పాఠకులకు విదితమే. రమేష్ కుటుంబీకులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉచితంగా విగ్రహాల పంపిణీ

కురిచేడు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కోదండ రామాలయం వద్ద బుధవారం ఉదయం లయన్స్ క్లబ్ ఆఫ్ కురిచేడు సభ్యులు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు ఇందూరి వెంకటనర్సిరెడ్డి మాట్లాడుతూ పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్‌ను వినియోగించకుండా ఉండేందుకు మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో జేబీ రామారావు, వీవీ రమణారావు, ఐవీ నరిసిరెడ్డి, యెలిసెట్టి రంగనాయకులు, పెండేల ప్రసాదరావు, తదితరులు మట్టి వినాయక ప్రతిమల పంపిణీ కార్యక్రమానికి పంచాయతీరాజ్ ఏఈ సంగు చందనా ఆదిరెడ్డి ఆర్థిక సహకారాన్ని అందజేశారు.

కాగా, వినాయక చవితి పర్వదినం సందర్భంగా బుధవారం విఘ్నేశ్వరుడు తొలిపూజ అందుకున్నాడు. మండలంలో యువకులు, గ్రామస్థులు 50కి పైగా భారీ వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. పాత పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటుచేసిన వినాయకుని విగ్రహం వద్ద గురువారం అన్నదానం ఏర్పాటు చేశారు.

నిమజ్జనానికి తరలిన గణనాథుడు

దొనకొండ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం వినాయక చవితి వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. అన్ని గ్రామాల్లో భారీ గణనాథలను ప్రత్యేకంగా అలంకరించిన మండపాల్లో ఏర్పాటుచేసి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. గృహాలలో మట్టి వినాయకులను ఏర్పాటు చేసి కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించారు. దొనకొండ సురేష్ మెడికల్ షాప్ వద్ద యువకులు ఏర్పాటు చేసిన భారీ గణనాథుడిని గురువారం నిమజ్జనం చేశారు.



దొనకొండలో నిమజ్జనానికి తరలుతున్న గణనాథుడు

నిరుపేదలకు భూములు దక్కేవరకు ఉద్యమం



జగత్‌నగర్‌లో ఎర్రజెండాలు పాతి మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ముండ్లమూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు భూములు దక్కేవరకు ఉద్యమిస్తామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు అన్నారు. గురువారం కెల్లంపల్లి పంచాయతీ పరిధిలోని జగత్‌నగర్ ప్రాంతంలో జెండాలు పాతారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 50 సంవత్సరాల క్రితం పేదలకు ప్రభుత్వం ఇచ్చిన భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. కొంత మంది వ్యక్తులు పేదలను భయపెట్టి వారి భూముల్లోకి వారిని వెళ్ళ నీయకుండా బెదిరించారన్నారు. వెల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలో పెద్ద సంఖ్యలో పేదల భూములు అన్యాక్రాంత మవుతున్నాయని, అవి దక్కేవరకు పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నెరుసుల వెంకటేశ్వర్లు, తాండవ రంగారావు, పంటా ఏడుకొండలు, పిచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయపాలన కరువు

వెలిగండ్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో సమయపాలన కొరవడింది. ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు ఉండాల్సిన కేంద్రాలను మధ్యాహ్నం 12 గంటలకే మూసి వేస్తున్నారు. పందువనాగులవరం అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఉదయం 11 గంటల వరకు కూడా తీయలేదు. దీంతో గర్భిణులు, బాలింతలు, పిల్లలు వెనుతిరిగి వెళ్లిపోయారు. గతంలో కూడా పౌష్టికాహారం పంపిణీ చేయకపోవడంతో గ్రామస్థులు ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. ఆసందర్భంగా అంగన్‌వాడీ టీచర్‌కు రెండు మోమోలు ఇచ్చారు. అంగన్‌వాడీ ప్రాజెక్టు పరిధిలో 9 మంది సూపర్‌వైజర్‌లు ఉండాలి ఉండగా, ఒకరు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు సిబ్బంది కొరతతో కేంద్రాల నిర్వాహణ, పౌష్టికాహారం సక్రమంగా అందడంలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

బైకు అదుపుతప్పి వ్యక్తి మృతి

ముండ్లమూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పులిపాడు బస్టాండ్ సెంటర్ వద్ద గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో వేంపాడు ఎస్సీ కాలనీకి చెందిన గండి పెదబాల గురవయ్య(37) మృతి చెందాడు. మృతుడు తన భార్యతో దర్శి మండలం తూర్పు చౌటపాలెం వెళ్ళి తిరిగివస్తున్నాడు. దర్శిలో ఆమెను బస్సులో ఎక్కించి ద్విచక్ర వాహనంపై స్వగ్రామానికి వస్తున్నాడు. ఈక్రమంలో పులిపాడు సెంటర్ ఆటోను తప్పించబోయి అదుపుతప్పి కిందపడ్డాడు. ఈప్రమంలో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఏఎస్ఐ బి.పవన్‌కుమార్ మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
బాపట్ల జిల్లా వార్తలు
5
శుక్రవారం 29 ఆగస్టు 2025



గణపతియే నమః



రేపల్లె : అరవపల్లిగ్రామంలో ప్రత్యేక అలంకరణలో భారీ వినాయకుడు

వాడవాడలా ఘనంగా చవితి ఉత్సవాలు

స్వామి విగ్రహాల దర్శనాలకు పోటెత్తుతోన్న భక్తులు

బాపట్ల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పండుగను జిల్లా అంతటా భక్తులు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. వాడవాడలా గణపతి సంబరాల కోలాహలం నెలకొంది. ఈ ఏడు వందల సంఖ్యలో మండపాలను ఏర్పాటు చేసిన ఉత్సవ కమిటీలు అట్టహాసంగా పూజలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచే ఆధ్యాత్మిక శోభతో ఆలయాలు, మండపాలు కళకళలాడాయి. వివిధ కూడళ్లలో ఏర్పాటు చేసిన మండపాలను సుందరంగా అలంకరించి వినూత్న రీతుల్లో స్వామి విగ్రహాలను ఏర్పాటు చేశారు. మండపాల్లో భారీ విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. వివిధ రూపాల్లో తీర్చిదిద్దిన ఉత్సవ మండపాలు, విగ్రహాలు భక్తులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చి విఘ్నేశ్వరుని దర్శించు కుని ప్రత్యేక పూజలు చేస్తున్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మట్టి గణపతిని ప్రతిష్ఠించగా ఎస్పీ తుషార్ డూడి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. విఘ్నేశ్వరస్వామి ఆలయాలు కూడా భక్తులతో కిటకిటలాడాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఇళ్లలోనూ చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా ఘనంగా చవితి వేడుకలను జరుపుకున్నారు.



కారంచేడులోని మాస్కో వీధిలో ఏర్పాటు చేసిన గణనాథుడు



కర్లపాలెం మండలం పాపిరెడ్డిపాలెంలో ఏర్పాటు చేసిన వినాయకుడు



చందోలు లోని ఆర్యవైశ్యకళ్యాణ మండపం సత్రం నందు ఏర్పాటు చేసిన గణనాథుడు



యూరియా కోసం బారులు

అరకొర పంపిణీతో ఎగబడుతున్న రైతులు

- సరిపడ నిల్వలు ఉన్నాయని అధికారుల ప్రకటన
- క్షేత్రస్థాయిలో అందుకు విరుద్ధంగా అన్నదాతల ఇబ్బందులు
- అవసరానికి మించి కొనుగోళ్లతోనే ఇక్కట్లు అంటున్న అధికారులు
- బ్లాక్ చేసి సొమ్ము చేసుకుంటున్న వ్యాపారులు.. పట్టించుకోని అధికారులు

వర్షాలతో సాగుపనుల్లో నిమగ్నం కావాల్సిన రైతులు ఎరువుల కోసం ఎగబడాల్సి వస్తోంది. ప్రస్తుత అవసరాలకు సరిపోయినంతగా యూరియా అందుబాటులో ఉందని అధికారులు ప్రకటిస్తున్నా.. తమకు దొరుకుతుందో లేదో.. అవసరమైనప్పుడు ఇబ్బంది పడుతామేమోనన్న ఆందోళనలో రైతులు విక్రయ కేంద్రాల వద్ద బారులు తీరుతున్నారు. సిఫార్సులతో కొందరు అదనంగా కొనుగోలు చేస్తుండటంతో సన్నచిన్నకారు రైతులకు యూరియా అందక అల్లాడుతున్నారు. సహకార సొసైటీలు, రైతు సేవా కేంద్రాల వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరి కనబడుతున్నారు. ఇదే అదనుగా కొందరు యూరియాను బ్లాక్ చేసేస్తున్నారు. 60 శాతం సరఫరా చేసినట్లు అధికారిక గణాంకాలు ఉన్నాయి. అయితే అధికశాతం రైతులు తమకు ఎరువులు అందలేదని ఆరోపిస్తున్నారు.

(బాపట్ల, రేపల్లె, కొల్లూరు, దాచేపల్లి, గుంటూరు సిటీ-ఆంధ్రజ్యోతి)

సాగు విస్తీర్ణంతో బేరీజు వేస్తే ప్రస్తుతం కేటాయించిన యూరియా నిల్వలు మిగులుగా ఉండాలి. కానీ ఆ పరిస్థితి లేకపోగా రైతులు ఇక్కట్లు పడాల్సిన వింత పరిస్థితి గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కనిపిస్తోంది. ఉదాహరణకు బాపట్ల జిల్లాలో సెప్టెంబరు చివరికి యూరియా అవసరాలు 22,000 మెట్రిక్ టన్నులుగా వ్యవసాయశాఖ అంచనా వేసి 13,000 టన్నులు కేటాయించినట్లు చెబుతున్నారు. 27వ తేదీకి గుంటూరు జిల్లాకు 363 మెట్రిక్ టన్నులు, బాపట్లకు 417 మెట్రిక్ టన్నులు యూరియా వచ్చింది. ప్రస్తుతం గుంటూరు, బాపట్ల జిల్లాల్లోనే యూరియా అవసరం ఎక్కువగా ఉంది. అయితే ఇప్పటికీ యూరియా కోసం రైతులు మూడు జిల్లాల్లోనూ ఎగబడుతూనే ఉన్నారు. ఇదే పరిస్థితి అటు గుంటూరు, ఇటు పల్నాడు జిల్లాల్లోనూ నెలకొని ఉంది. సీజన్‌లో అవసరాలకు సరిపడా (మిగతా 6లో)



కొల్లూరు మండలం గాజుల్లంక పీఏసీఎస్ వద్ద యూరియా కోసం రైతుల పడిగాపులు



పొందుగల చెక్ పోస్టు వద్ద విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న యూరియా బస్తాలు

హద్దులు దాటిన యూరియా దందా

పుష్కలంగా ఉన్న ఎరువులను వ్యాపారులు పక్కదారి పట్టిస్తున్నారు. వ్యాపారులు, దళారులు మాఫియాగా మారి యూరియాను ఇష్టానుసారంగా అమ్ముకుంటున్నారు. పల్నాడు జిల్లాలోని దాచేపల్లి, మాచర్ల, రెంటచింతల మాచవరం, పిడుగురాళ్ల మండలాల నుంచి (మిగతా 6లో)

పింఛన్‌లపై వైసీపీ అసత్య ప్రచారాలు

- 15 నెలలలో అభివృద్ధి చేసి చూపించాం
- విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



జార్లపాలెంలో ఎన్‌టీఆర్ సుజల రక్షిత శుద్ధి కేంద్రం శిలాఫలకంను ఆవిష్కరిస్తున్న మంత్రి రవికుమార్

అద్దంకి, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్‌లపై వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తున్నదని, అర్హులైన ఏ ఒక్కరి పింఛన్‌ను కూటమి ప్రభుత్వం తొలగించదని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి మండలం జార్లపాలెంలో గురువారం పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో దివ్యాంగుల ముసుగులో అనర్హులు కొంత మంది పింఛన్‌లు తీసుకుంటున్నారని, వారి పింఛన్‌లు మాత్రం ఖచ్చితంగా తొలగిస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత 15 నెలలోనే అభివృద్ధి అంటే ఏమిటో చూపించిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ లో 65 లక్షల మందికి 33వేల కోట్ల రూపాయలు పింఛన్ పంపిణీ చేస్తున్నదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నదన్నారు. ఇప్పటికే తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, దీపం, స్త్రీశక్తి పథకాలను అమలు చేసిందన్నారు. గత ప్రభుత్వం రద్దు చేసిన అన్న క్యాంటిన్‌లను పునరుద్ధరించి 5 రూపాయలకే పేదలకు భోజనం పెడుతున్నామన్నారు. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ జరుగు తుందన్నారు. కూటమి ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతోందన్నారు.

ఇష్టమైన పోస్టు ఎంపికకు అవకాశం కల్పించాలి

- జిల్లా ఆపస్ అధ్యక్ష, కార్యదర్శులు

వేమూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ ద్వారా రెండు పోస్టులకు అర్హత సాధించిన అభ్యర్థులకు ఇష్టమైన పోస్టు ఎంపిక చేసుకునేందుకు ప్ర భుత్వం అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం బాపట్ల జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసకుమార్, కుందుర్తి శ్రీనివాసులు కోరారు. గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో డీఎస్సీ రాసే సందర్భంలో రెండు పోస్టుల ఎంపికకు అర్హత సాధించిన అభ్యర్థులకు వారికి ఇష్టమైన పోస్టు ఎంపిక కోసం అవకాశం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న డీఎస్సీ-25 నియామకాలలో పలువురు ఉపాధ్యాయులు ఒకటికన్నా ఎక్కువ పోస్టులకు ఎంపికయ్యారు. ఎస్‌జీటీ స్థానాలు ఎక్కువగా ఉండి స్కూల్ అసిస్టెంట్ పోస్టులు తక్కువ ఉన్నందున అభ్యర్థులు కాంపిటీషన్ దృష్ట్యా దరఖాస్తులు ఎక్కువ ఖాళీలు ఉన్న ఎస్‌జీటీ స్థానానికి మొదటి అవకాశాన్ని కోరుతూ స్కూల్ అసిస్టెంట్ స్థానాలకు రెండో అవకాశాన్ని ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతిభావంతులైన ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్, ఎస్‌జీటీ పోస్టులు రెండింటికి అర్హత సాధించారన్నారు. గతంలో ఉపాధ్యాయుల పోస్టు ఎంపికను ముందుగా అడగలేదన్నారు. అభ్యర్థులు పరీక్షలో అ ర్హత సాధించిన తరువాతే ఆప్షన్స్ స్వీకరించారన్నారు.ఏపీపీఎస్సీ లేదా గ్రూ ప్స్ ఎగ్జామ్స్ ద్వారా పోస్టులకు ఎంపిక జరుగుతున్నప్పుడు మాత్రమే ఎంపిక క్రమాన్ని స్వీకరించేవారన్నారు.


ఎన్నారై మెడికల్ కళాశాలకు శరీర దానం



గోగినేని రాకుమారి (ఫైల్‌ఫొటో)

వేమూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంపాడు గ్రామానికి చెందిన గోగినేని రాకుమారి(70) బుధవారం గుండె పోటుతో మృతి చెందారు. ఆమె పార్థివదేహాన్ని ఎన్నారై మెడికల్ కళాశాలకు భర్త సుబ్బారావు, కుమార్తె లక్ష్మీ దానం చేశారు. ఎన్‌ఆర్‌ఐ వైద్య కళాశాల అధికారులు అంబులెన్స్ ద్వారా రాకుమారి పార్థివదేహాన్ని కళాశాలలోని అనాటమీ విభాగానికి తరలించారు. ఆమె నేత్రాలను పెదకాకాని ఐ బ్యాంకుకు దానం చేశారు. నేత్రాలు ఇద్దరికి చూపు కల్పించడానికి ఉపయోగపడతాయని ఐ బ్యాంకు ప్రతినిధులు తెలిపారు. పార్థివదేహం ఒకటి, రెండు సంవత్సరాల పాటు వైద్య పరీక్షల పాఠ్యాంశాల బోధనకు దోహదపడుతుందని ఎన్నారై మెడికల్ అధికారులు తెలిపారు. రాకుమారి మృతి అనంతరం ఆమె భర్త, కుమార్తె తీసుకున్న నిర్ణయానికి గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

- ఉధృతంగా కృష్ణమ్మ భయాందోళనలో ప్రజలు
- పొంగి ప్రవహిస్తున్న వాగులు
- సాగర్ 26 క్రస్ట్‌గేట్ల నుంచి నీటి విడుదల
- ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక



ప్రకాశం బ్యారేజి దిగువకు ఉధృతంగా ప్రవహిస్తున్న కృష్ణానది వరదనీరు

వీడని వర్షాలు

రేపల్లె, కొల్లిపర, విజయపురిసౌత్, రెంటచింతల, అచ్చంపేట, అమరావతి, తాడేపల్లి టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఇప్పటికే తీ వ్రంగా నష్టపోయిన రైతులు వీడని వర్షాలతో అల్లాడుతున్నారు. మరోవైపు ఎగువ నుంచి భారీగా వస్తున్న వరద ప్రవాహంతో నాగార్జున సాగర్ నుంచి నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో కృష్ణానదిలో నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో కట్టలను తాకుతూ ప్రవహిస్తున్న నీటితో నదీ తీర ప్రాంతప్రజలు భయాందోళన చెందుతున్నారు. ప్రకాశం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. దీంతో బ్యారేజీ దిగువన గ్రామాలు, లంకల్లోని ప్రజలు బిక్కుబిక్కుమంటూ ఉన్నారు. నదీ తీరంలో ఎక్కడికక్కడ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తూ భద్రతా చర్యలు తీసుకున్నారు. బుధవారం ఎడతెరిపి లేకుండా కురిసిన భారీ వర్షానికి పలు ప్రాంతాల్లో వాగులు పొంగి ప్రవహించడంతో ఎక్కడికక్కడ రాకపోకలు స్తంభించిపోయాయి. వాగుల వెంబడి సాగుభూములు వరద నీటితో చెరువులను తలపిస్తున్నాయి.

నాగార్జున సాగర్ జలాశయానికి శ్రీశైలం నుంచి వరద ప్రవాహం కొనసాగుతుంది. శ్రీశైలం నుంచి 2,46,410 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. దీంతో గురువారం ప్రాజెక్ట్ అధికారులు 26 క్రస్ట్‌గేట్ల ద్వారా నీటిని విడుదల చేస్తున్నారు. నీటిమట్టం 586.60 అడుగులు ఉండగా 2,46,410 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సత్రశాలలోని సాగర్ టెయిల్‌పాండ్ విద్యుత్ ప్రాజెక్టుకు చెందిన 20 రేడియల్ క్రస్ట్ గేట్లకు 14 గేట్లను ఎత్తి 1,84,833 క్యూసెక్కుల నీటిని దిగువన వున్న పులిచింతలకు విడుదల చేశారు. సాగర్ నుంచి వస్తున్న నీటిని వచ్చినట్లు విడుదల చేస్తున్నారు. వరద నీటి ఉధృతితో ప్రాజెక్టులో విద్యుదుత్పత్తిని కూడా నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. భారీ వర్షాలు, ఎగువ నుంచి వస్తున్న వరదతో ప్రకాశం బ్యారేజి వద్ద కృష్ణానది పరవళ్ళు తొక్కుతోంది. ఎగువ నుంచి గురువారం 4,43,184 క్యూసెక్కుల వరదనీరు రిజర్వాయర్‌కు చేరుతోంది. వరద 4 లక్షల క్యూసెక్కులు దాటడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజి రిజర్వాయర్‌లో 12.8 అడుగుల నీటిమట్టం కొనసాగుతుండగా మొత్తం 70 గేట్లను ఎత్తి దిగువకు 4 లక్షల 32 వేల 837 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు ఇరిగేషన్ శాఖ జేఈ రాజేష్ తెలిపారు. వరద ఉధృతి పెరుగుతుండడంతో నదీతీర, లంకల్లోని రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

కరకట్ట వెంబడి పెట్రోలింగ్

భట్టిప్రోలు మండలం కరకట్ట నుంచి పెసర్లంక వెళ్లే చినరేవు ఓలేరు నుంచి లంకగ్రామాలకు వెళ్లే చిన్నరేవులో వరద నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పెనుమూడి పుష్కర్‌ఘాట్‌ను వరద నీరు తాకింది. అధికారులు కరకట్టవెంబడి పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. రేపల్లె తహసీల్దారు మోర్ల శ్రీనివాసరావు వరద ఉధృతిని పరిశీలించి పరిస్థితిని అంచనా వేసి ప్రజలను అప్రమత్తం చేసి గ్రామాల్లో రెవెన్యూ సిబ్బందిని ఏర్పాటు చేశారు. కొల్లిపర తహసీల్దారు సిద్ధార్థ, ఎస్‌ఐ కోటేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో భార్గవ్ గురువారం బొమ్మువానిపాలెం, కొల్లిపర, అన్నవరం గ్రామాల్లోని రేవులను సందర్శించి వరద ఉధృతిని పరిశీలించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.



రేపల్లె మండలం రావిఅనంతవరం సమీపంలో కృష్ణానదిలో ఉధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

పూల కోసం వెళ్లి మృత్యుఒడిలోకి

చెరువులో మునిగి ఇద్దరు పిల్లల మృతి

వినాయకచవితి పండుగ వేళ పూండ్లలో విషాదం





నాగభూషణం, శ్రీమంత్ (ఫైల్‌ఫొటో)

బాపట్ల రూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వినాయక చవితిని అట్టహాసంగా జరుపుకోవాలని స్నేహితులతో కలిసి విగ్రహాన్ని ఏర్పాటు చేసుకున్నారు. పూజకు అవసరమైన కలువ పూల కోసం వెళ్లి చెరువులో మునిగి మృతి చెందారు. ఈ విషాద ఘటనతో పండుగవేళ బుధవారం బాపట్ల మండలం పూండ్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పూండ్ల గ్రామంలోని పిల్లలు శివాలయంలో వినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పూజకు అవసరమైన కలువ పూల కోసం బుధవారం ఉదయం గ్రామానికి చెందిన సైకం నాగభూషణం(17), శుద్ధపల్లి శ్రీమంత్(15) అనే ఇద్దరు మరో స్నేహితుడితో కలిసి గ్రామశివారులోని పొన్నూరు మండలం రమణపాలెం సమీపంలోని చెరువు వద్దకు వెళ్లారు. నాగభూషణ, శ్రీమంత్ తొలుత చెరువులో దిగగా మునిగిపోయారు. గట్టుమీద నుంచి గమనించిన స్నేహితుడు గ్రామంలోకి వెళ్లి సమాచారం ఇచ్చాడు. గ్రామస్థులు వచ్చేసరికి అప్పటికే చెరువులో లోతుకు వెళ్లిన ఇద్దరూ మృతి చెందారు. ఇంటర్మీడియట్ చదువుతున్న పెద్దకుమారుడు నాగభూషణం మృతితో సైకం శ్రీనివాసరావు, జయలక్ష్మీ కన్నీటి పర్యంతమయ్యారు. శ్రీమంత్ జన్మస్థలం ఒంగోలు కాగా చిన్నప్పటి నుంచి పూండ్లలోని మేనమామ అయిన బ్రహ్మం దగ్గర ఉంటూ చదువుకుంటున్నాడు. అల్లారిముద్దుగా పెంచుకుంటున్న మేనల్లుడి మృత్యువార్త వినగానే మేనమామ, తాత, అమ్మమ్మలు విషాదంలో మునిగిపోయారు.


గుంటూరు రోడ్‌లోని బ్రిడ్జి వద్ద జరుగుతున్న పూడిక తీత పనులు

చురుగ్గా పోతురాజు కాలువ ఆధునికీకరణ పనులు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మురుగునీటి పారుదల వ్యవస్థకు ప్రధాన కాలువైన పోతురాజు కాలువ ఆధునికీకరణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. ఈ మేరకు స్థానిక గుంటూరు రోడ్‌లోని పోతురాజు కాలువ బ్రిడ్జి వద్ద భారీ ఎక్స్‌కవేటర్లను ఏర్పాటు చేసి పూడిక తీత పనులు చేపట్టారు. ఇటీవల వరుసగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో నగరంలో వర్షం నీరు నిలవకుండా, అలాగే మురుగునీరు పారుదల సక్రమంగా ఉండేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కమిషనరు వెంకటేశ్వరరావు ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు. దీంతో రెండు రోజులుగా పనులు ముమ్మరం అయ్యాయి. అతి త్వరలోనే పోతురాజు కాలువలో పూడిక తీత పనులు పూర్తి స్థాయిలో చేపట్టి నగరంలో మురుగునీటి పారుదల వ్యవస్థకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ తెలిపారు.


హాస్టల్ వార్డెన్‌తో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్

హాస్టల్‌ను శుభ్రంగా ఉంచాలి

● సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం వన్‌టౌన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): హాస్టల్లో శుభ్రత లేకపోవడంపై సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ వార్డెన్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక నాగులవరం రోడ్డులోని ఏపీ ట్రైబల్ హాస్టల్‌ను ఆయన పరిశీలించారు. హాస్టల్‌లో గిరిజన బాలికలకు ఏర్పాటు చేసిన సౌకర్యాలను పరిశీలించి రూమ్‌లలో ఫ్యాన్లు లేవని, శుభ్రత పాటించటం లేదని గమనించి వార్డెన్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. స్నానాల గదులు, పరిసరాల ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. బాలికలతో కలిసి భోజనం చేశారు. విద్యార్థులతో మమేకమై చదువులో ఎలా ఉన్నారో భవిష్యత్‌లో ఏం కావాలని కోరుకుంటున్నారో తెలుసుకున్నారు. కష్టపడి, క్రమశిక్షణతో చదువుకొని ఎదగాలని త్రివినాగ్ బాలికలకు సూచించారు.


బంకు వద్ద కేసు రాస్తామంటూ బెదిరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఎక్సైజ్ సిబ్బంది దందా

తర్లుపాడు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు బెల్టు షాపుల వద్ద, టీ బంకుల వద్ద తాగుతున్న మందు బాబుల నుంచి పొదిలి ఎక్సైజ్ శాఖ సిబ్బంది వసూళ్ల దందాకు పాల్పడుతున్నారు. తర్లుపాడులో ఒక బంకు వద్ద మందు తాగుతున్న ఇద్దరిపై కేసు రాస్తామంటూ అంటూ బెదిరించారు. విషయం తెలుసుకున్న విలేకరి అక్కడకు వెళ్లి ఫొటో తీస్తుండగా వారు మెల్లగా జారుకున్నారు. సీఐ కారు డ్రైవర్, కానిస్టేబుల్ ఈ వ్యవహారానికి పాల్పడినట్లు తెలిసింది. గంట తర్వాత మరలా బంకు వద్దకు ఎక్సైజ్ సీఐ, సిబ్బంది వచ్చి బంకు నిర్వాహకురాలికి మేము ఇక్కడికి రాలేదని చెప్పాలని హుకుం జారీ చేశారు. లేదంటే కేసు నమోదు చేస్తామని బెదిరించినట్లు సమాచారం. మండలంలో యథేచ్ఛగా బెల్టు షాపుల నిర్వాహకుల వద్ద నుంచి సీఐ కారు డ్రైవర్, కానిస్టేబుల్ నెలనెలా వచ్చి మామూళ్లు తీసుకుంటున్నట్లు తెలిసింది.

గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం

రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక


శ్రీరామ్


వెంకట్రావు

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం రాష్ట్ర నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒంగోలులో జరిగిన సంఘం రాష్ట్ర మహాసభలో తొమ్మిది మందిని రాష్ట్ర ఆఫీస్‌బేరర్స్‌గా, 17 మందిని కమిటీని ఎన్నుకున్నారు రాష్ట్ర అధ్యక్షుడిగా గంటా శ్రీరామ్, కార్యదర్శిగా పూసపాటి వెంకట్రావు, ఉపాధ్యక్షుడిగా కిలారి పెద్దాబ్బాయి, సహాయకార్యదర్శులుగా ఏవీ కృష్ణారావు, తోట తిరుపతిరావు, పాపిన సాంబమూర్తి, దాసరి జనార్దన్, గోకాడ దేవుడు నాయు డు, కురవ రాముడు, కమిటీ సభ్యులుగా కే ఈశ్వరరావు, ఆర్. అచ్యుతరావు, పోతురాజు, పీవీ ఆంజనేయులు, జి.రామకృష్ణ, బి. ఆంజనేయులు, ఎం. శేషు, డి. శ్రీనివాస్‌లను ఎన్నుకున్నారు. మహాసభలోచేసిన తీర్మానాలను గురువారం పత్రికలకు విడుదల చేశారు. గొర్రెల కాపరుల రక్షణ కోసం సామాజిక రక్షణ చట్టాన్ని తేవాలని, ప్రతి గ్రామంలో మేత భూములు, నీటి వసతి కల్పించి వలసలు నివారించాలని, ప్రైవేటు మార్కెట్లో దోపిడీని అరికట్టి ప్రభుత్వమే మార్కెట్ సౌకర్యం కల్పించాలని తదితర తీర్మానాలను చేశారు.

శ్రీశైలం గాయత్రీ పీఠాధిపతిగా రామారావు



వేటపాలెం(చీరాల), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వేటపాలెం మండలం రావూరిపేటకు చెందిన చల్లా రామారావు శ్రీశైల గాయత్రీ పీఠానికి పీఠాధిపతిగా నియమితులయ్యారు విశ్రాంత ఉపాధ్యాయులు రామారావు జ్యోతిర్విద్వాన్, దేవాంగ పురోహిత పరిషత్ రాష్ట్ర అధ్యక్షులుగా, దేవాంగ పురాణం గ్రంథకర్తగా పలువురి మన్ననలు పొందారు. ఈ క్రమంలో శ్రీశైలం పీఠం అధిపతిగా నిమితులయ్యారు. అయన్ను సభ్యులు లక్ష్మణరావు, బాలశంకరరావు, విశ్వనాథ్ వీరరాఘవులు తదితరులు రామారావును ప్రత్యేకంగా అభినందించారు.

కూటమి పాలనలో పెద్ద ఎత్తున సంక్షేమం, అభివృద్ధి

● విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్

● సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

అద్దంకి, ఆగస్టు26(ఆంధ్రజ్యోతి): టీడీపీ ఆధ్వర్యంలో ప్రజాకూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన నాటి నుంచి నియోజకవర్గంలో మొత్తంలో 1,100 మందికి పైగా సీఎంఆర్‌ఎఫ్ నిధులు అందజేసినట్లు రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. పట్టణంతో పాటు మండలంలోని జార్లపాలెంలో పలు కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ


సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి రవికుమార్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పెద్దఎత్తున సీఎం ఆర్‌ఎఫ్ నిధులు అందజేసినట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో మరో 500 మందికి త్వరలో చెక్కులను అందజేస్తామన్నారు. గురువారం 35 మందికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మంత్రి రవికుమార్ అందజేశారు. జార్లపాలెంలో రూ.కోటి వ్యయంతో చేపట్టనున్న జార్లపాలెం-చెరువుకొమ్ముపాలెం తారురోడ్డుకు శంకుస్థాపన చేశారు. రూ.20 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్ లు, అద్దంకి-రేణింగవరం రోడ్డు నుంచి దాసుల కాలనీ వరకు రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఎన్టీఆర్ సుజల ఆర్వో ప్లాంట్ ను ప్రారంభించారు. గ్రామంలో మిగిలిపోయిన సీసీ రోడ్లు, సైడ్ డ్రైన్లను విద్యుత్ సమస్యలను, మంచినీటి సమస్య తదితర సమస్యలను గ్రామస్థులు మంత్రి దృష్టికి తీసుకుపోయి పరిష్కరించనున్నట్లు తెలిపారు. ముందుగా అద్దంకి పట్టణంలోని శింగరకొండ రోడ్డులో హిట్‌జోన్ ఇండోర్ క్రీడాకేంద్రాన్ని, ఒంగోలు రోడ్డులో ఎస్‌వీ కన్వెన్షన్‌ను మంత్రి రవికుమార్ నర్సరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్‌బాబుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రవికుమార్ క్రికెట్ బ్యాటింగ్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీచరణ్, ఎంపీడీవో శింగయ్య, విద్యుత్ ఈఈ నల్లూరి మస్తాన్‌రావు, టీడీపీ జిల్లా వైద్యవిభాగం అధ్యక్షులు చదలవాడ ఫణీంద్రబాబు, నాగినేని రామకృష్ణ, కరి పరమేష్, ఎంపీటీసీ సభ్యుడు మలాది కోటేశ్వరమ్మ నటరాజ్, సర్పంచ్ మల్లవరపు సుశీల, యేనుగంటి వెంకట్రామయ్య(బాబు), ధూళిపాళ్ల వీరాస్వామి, భార్గవ, సుబ్రహ్మణ్యం, చిరంజీవి, కౌన్సిలర్ సుభాషిణి లహరి, కుందారపు రామారావు తదితరులు పాల్గొన్నారు.

పేదలకు సీఎం సహాయ నిధి వరం

21 మందికి చెక్కులు అందజేసిన ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఆపద సమయంలో వైద్యశాలలో చికిత్స పొందిన వారికి వెంటనే స్పందించి ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎం సహాయ నిధి సాయాన్ని మంజూరు చేస్తున్నారని టీడీపీ ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు తెలిపారు. పార్టీ కార్యాలయంలో గురువారం 21 మంది ఆపన్నులకు రూ.17,94,513 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను ఎరిక్షన్‌బాబు బాధితులకు పంపిణీ చేశారు. వైద్యం చేయించుకున్న పేదకు సాయం అందజేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చేకూరి సుబ్బారావు పాల్గొన్నారు.

మార్కాపురంలో..

మార్కాపురం : మార్కాపురం పట్టణానికి చెందిన 9 మందికి మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను గురువారం ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి సతీమణి వసంతలక్ష్మి ఇంటింటికీ వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి కింద ఆలస్యం లేకుండా ఎప్పటికప్పుడు నిధులు మంజూరు చేస్తోందన్నారు. సుమారు రూ.9.10 లక్షల విలువ గల చెక్కులను రోగులకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఏఎంసీ చైర్మన్ గుంటక కృష్ణవేణి, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి సత్యనారాయణ, కనిగిరి బాలవెంకటరమణ, పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు పఠాన్ ఇబ్రహీంఖాన్, మేడిద రంగస్వామి, చిట్యాల చంద్రశేఖర్‌రెడ్డి, దూపాటి యలమంద పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎరిక్షన్‌బాబు

యూరియా కోసం బారులు

(5వ పేజీ తరువాయి)

యూరియా నిల్వలు ఇప్పటికే సరఫరా చేశాం.. కావాలంటే గణాంకాలే రుజువని వ్యవసాయశాఖ చెబుతోంది. కానీ క్షేత్రస్థాయి పరిస్థితులు మాత్రం భిన్నంగా కనిపిస్తున్నాయి. ఖరీఫ్ అవసరాల్లో ఇప్పటికే దాదాపు 60 శాతం యూరియా కేటాయించినట్లు అధికారులు లెక్కలు చెబుతున్నారు. కానీ రైతులకు మాత్రం వెతలు తప్పడం లేదు. పంపిణీలో అధికశాతం రాజకీయ సిఫారసులే ప్రామాణికంగా పక్కదారి పడుతుండగా ఇదే అవకాశంగా వ్యాపారులు యూరియాను బ్లాక్ చేసి సమస్యను తీవ్రం చేస్తున్నారనే విమర్శలున్నాయి. యూరియా కోసం రైతులు ఇబ్బంది పడకూడదని, ఎరువుల అక్రమాలపై విజిలెన్స్ దాడులు ముమ్మరం చేయాలని తాజాగా సీఎం చంద్రబాబు ఆదేశించారు. అయినా వ్యాపారులు యూరియాను బ్లాక్ చేసి విక్రయిస్తున్నారు. 45 కిలోల యూరియా బస్తాను రూ.266లకు అమ్మాల్సి ఉండగా రూ.400 వరకు అమ్ముతూ వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నట్లు రైతులు ఆరోపిస్తున్నారు. కాదంటే నానో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు తీసుకున్న వారికే యూరియా అని మెలిక పెడుతున్నట్లు తెలుస్తోంది.

మునక కారణమెలా...

ఇటీవల కురిసిన వర్షాల ధాటికి అనేక ప్రాంతాల్లో వరి ముంపు బారిన పడింది. దీంతో పైరు కాపాడుకోవడానికి రైతులు రెండోసారి యూరియా వాడాల్సి వచ్చింది. కుళ్లిపోయే దశలో ఉన్న పైరును కాపాడుకోవడానికి రైతులు ఎకరాకి బస్తా యూరియా చల్లాల్సి వచ్చింది. యూరియా ఇక్కట్లకు ఇది కూడా ఒక కారణమని అధికారులు చెప్తున్నారు. అయితే రెండోసారి యూరియా రైతులు వేస్తున్నా కేటాయించిన నిల్వల లెక్కల ప్రకారం సమృద్ధిగానే ఉండాలి తప్ప కొరత ఎందుకొచ్చిందనే దానికి అధికారులే సమాధానం చెప్పాలి.

పరపతి ఉన్నవారికే..

పీఏసీఎస్‌లు, ఆర్‌ఎస్‌కేల్లో రాజకీయ సిఫారసులే ప్రామాణికంగా యూరియా అందిస్తున్నారనే విమర్శలున్నాయి. నిబంధనల ప్రకారం రైతులకు పంపిణీ జరగాల్సి ఉండగా, పరపతి గల రైతులకు పెద్దమొత్తంలో యూరియా కేటాయిస్తున్నారు. పలుకుబడి ఉన్న వారు అవసరం లేకపోయినా 20 నుంచి 30 బస్తాలు నాయకుల సిఫార్సుతో తీసుకుంటున్నారు. దీని వల్ల తమ దాకా వచ్చేసరికి కొరత ఏర్పడుతుందని చిన్న, సన్న కారు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పీఏసీఎస్‌లకు నిల్వల కేటాయింపులతోనే అధికారులు సరిపెడుతున్నారు తప్పితే వాటిని రైతులకు చేర్చేవరకు పర్యవేక్షణ లేకుండా పోతుందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని చోట్ల అయితే ఏకంగా స్థానికంగా ఉన్న నేతలే యూరియా పంపిణీ బాధ్యతలు తీసుకుని తమకు తోచిన విధంగా ఇస్తున్నారు.

హద్దులు దాటిన యూరియా దందా

(5వ పేజీ తరువాయి)

ఎక్కువగా యూరియా నిల్వలు తెలంగాణకు వెళ్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. సరిహద్దు ప్రాంతాల నుంచి వందల టన్నుల యూరియా తెలంగాణకు తరలివెళ్తుంది. రూ.266.50 యూరియా బస్తాను వ్యాపారులు బోగస్ రైతుల పేర్లతో దళారులకు విక్రయిస్తున్నారు. వారు అదే యూరియాను తెలంగాణకు తీసుకువెళ్లి రూ.850కి విక్రయిస్తున్నారు. ఫలితంగా సకాలంలో ఎరువులు దొరక్క రైతులు అల్లాడి పోతున్నారు. రెండు నెలలుగా పల్నాడు జిల్లా కారంపూడి అడ్డాగా గుట్టుగా సాగుతున్న ఎరువుల దందాను విజిలెన్స్ అధికారులు వలపన్ని పట్టుకున్నారు. తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా గుండాల మండలం కాంతనపల్లికి చెందిన సఖినాల సురేష్ రెండు నెలలుగా యూరియాను పక్కదారి పట్టిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. కారంపూడికి చెందిన నంద్యాల నాగరాజును మధ్యవర్తిగా నియమించుకుని సురేష్ ఎరువులు కొనుగోలు చేస్తున్నారు. కారంపూడికి చెందిన నీరజ లక్ష్మీవెంకట సత్యనారాయణ కమర్షియల్ కార్పొరేషన్ యజమాని ఆతుకూరి నరసింహారావు వీరికి సహకరిస్తున్నట్లు అధికారులు తెలిపారు. కారంపూడి, మాచర్ల ప్రాంతాలకు చెందిన రైతుల పేర్లతో బిల్లులు రాసి విక్రయాలు జరుపుతున్నట్లు తెలుస్తుంది. దాచేపల్లి మండలంలోని పొందుగుల చెక్‌పోస్టు వద్ద బుధవారం అర్ధరాత్రి సురేష్, బొలగానా సుధీర్ అనే వ్యక్తులు రెండు వాహనాల్లో తరలిస్తున్న 165 బస్తాల యూరియాను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

గోనుగుంట దేవాలయ ప్రాశస్త్యాన్ని కాపాడాలి

● ఎమ్మెల్యే బీఎన్

● ఘనంగా రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ ప్రమాణస్వీకారం

చీమకుర్తి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : పురాణ ప్రాశస్త్యం కలిగిని గోనుగుంట గ్రామంలోని గంగా పార్వతీసమేత రామలింగేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి నూతన పాలకమండలి కృషి చేయాలని ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్ కోరారు. ఆలయ పాలకమండలి ప్రమాణస్వీకారమహోత్సవ కార్యక్రమాన్ని గురువారం స్థానిక దేవాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే బీఎన్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తన సంపూర్ణ సహకారం ఉంటుందని చెప్పారు. అనంతరం ఈవో రజని నూతనంగా నియమితులైన పాలకమండలి సభ్యులచే ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా మలినేని కోటేశ్వరరావు, డైరెక్టర్లుగా అన్నం కమల, సాదు సరోజనమ్మ, దర్శి అంకమ్మ, పాలకేటి రాజ్యలక్ష్మి, కోటు గరటయ్య, వెంపరాల మోహనరావు ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో పూజారి చదలవాడ ప్రదీప్, ఇన్‌స్పెక్టర్ వేణు, టీడీపీ నాయకులు మన్నం ప్రసాద్, గొట్టిపాటి రాఘవరావు, పూనాటి వెంకట్రావు, పాలడుగు వెంకటనారాయణ, ఎనికపాటి లక్ష్మీనరసయ్య, గొల్లపూడి సుబ్బారావు, యడ్లపల్లి రామబ్రహ్మం, రావిపాటి రాంబాబు, వెంపరాల ఆంజనేయులు, నల్లూరి మధు, మలినేని ప్రసాద్, సర్పంచ్ సాధు మోహనరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్

ఉపాధిహామీ పనుల్లో అవకతవకలపై విచారణ

చినగంజాం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కడవకుదురు గ్రామంలో ఉపాధి పనుల్లో జరిగిన అవినీతిపై డీఎల్‌డీవో పద్మావతి విచారించారు. కడవకుదురు గ్రామంలో 2021 సంవత్సరం నుంచి 2024వ సంవత్సరం వరకు ఫీల్డ్ అసిస్టెంట్‌గా పనిచేసిన కొమ్ము సుబ్బారావుపై టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు బేతపూడి సురేష్ బాబు, టీడీపీ నాయకులు కనపర్తి వీరాస్వామి, పర్చూరు నియోజకవర్గ తెలుగు యువత ప్రధాన కార్యదర్శి దేవతోటి నాగరాజులు ఈ నెల 4న కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారించారు. మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ సుబ్బారావు, గ్రామ సర్పంచ్ జి.శివకుమారి, జి.రామకృష్ణారెడ్డిలను ఆమె విచారించారు. రికార్డులను, మస్టర్లను పరిశీలించారు. విచారణ వివరాల నివేదికను కలెక్టర్ వెంకటమురళీకి నివేదించనున్నట్లు డీఎల్‌డీవో తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీ.హెచ్.పూర్ణచంద్రరావు, ఏపీవో లక్ష్మిదేవీలు పాల్గొన్నారు.


కడవకుదురులో విచారణ చేస్తున్న చీరాల డీఎల్‌డీవో పద్మావతి


నిడమానూరులో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న వైస్‌చైర్మన్ విజయకుమార్

ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణానికి మేలు

రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ విజయకుమార్

ఒంగోలు కలెక్టరేట్/నాగులుప్పలపాడు/ ఒంగోలు(రూరల్) ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణానికి మేలు కలుగుతుందని రైతు సాధికార సంస్థ ఎగ్జి క్యూటివ్ వైస్ ఛైర్మన్ టి.విజయకుమార్ పేర్కొన్నారు. గురువారం జిల్లాలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను పల్నాడు, గుంటూరు, బాపట్ల, నెల్లూరు జిల్లాల ప్రాజెక్టు మేనేజర్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వారికి జిల్లా వ్యవసాయ అధికారి శ్రీనివాసరావు, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ సుభాషిణీ ప్రకృతి వ్యవసా య క్షేత్రాలను చూపించారు. ముందుగా నా గులుప్పలపాడు మండలం బి.నిడమానూరు గ్రామానికి చెందిన ఎం.అనుపమ ఏడు ఎక రాల్లో చేపట్టిన ప్రకృతి పంటల సాగును ప రిశీలించారు. పోతవరం గ్రామంలో శేషారావు మొక్కజొన్న క్షేత్రాన్ని సందర్శించారు. అనంత రం రైతు సేవా కేంద్రంలో విజయకుమార్ రై తులతో ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో చ ర్చలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో పెట్టుబడి తక్కువగా ఉంటుందని చెప్పారు. రైతుల ఖర్చులు తగ్గి మంచి లాభాలు వస్తాయన్నారు. అనంతరం ఒంగోలు మండలం కొప్పో లులో మాధురి డ్రైప్యాడీ క్షేత్రాన్ని సందర్శించారు. అలాగే స్థానిక కలెక్టరేట్‌లోని సీపీవో హాలులో సౌత్‌కోస్టల్‌లోని ఐదు జిల్లాల ప్రాజె క్టు మేనేజర్లతో సమీక్షా సమావేశం నిర్వ హించారు. ప్రతి రైతు ప్రకృతి వ్యవసాయం వైపు మళ్ళేలా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. కార్యక్రమంలో సీనియర్ టీఎల్ గోపీచంద్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పత్తిపై దిగుమతి సుంకం రద్దుకు పోరాటం

ఒంగోలు కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): పత్తి దిగుమతులపై కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకం రద్దుకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సంయుక్త కిసాన్‌మోర్చా కన్వీనర్ చుండూరి రంగారావు పిలుపునిచ్చారు. ఒంగోలులోని మాదాల నారాయణభవన్‌లో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర రైతు సంఘాల సంయుక్త కిసాన్‌మోర్చా ఇచ్చిన పిలుపు మేరకు తాళ్ళూరు, ముండ్లమూరు మండలాల్లో ఈనెల 30,31 తేదీల్లో, వచ్చేనెల 1న మార్కాపురం ఆర్డీవో కార్యాలయం, వచ్చేనెల 2న ఒంగోలులోని కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వడ్డె హనుమారెడ్డి, డి. జయంతిబాబు, కె.వీరారెడ్డి, ఎస్.లలితకుమారి, కె.హనుమంతరావు, ఆర్.మోహ న్, వి.బాలకోటయ్య, ఎన్.హనుమంతరావు, పరిటాల కోటేశ్వరరావు పాల్గొన్నారు.

రేపు ఒంగోలులో జాబ్‌మేళా

ఒంగోలు నగరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఈ నెల 30వ తేదీన జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి కె.రమాదేవి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేళాకు టాటా ఎలక్ట్రానిక్స్ ప్రైవేట్ లిమిటెడ్, హీరో మోటార్ కార్ప్, ఎంఆర్‌ఎఫ్, రిలయన్స్, జియో ఇన్‌ఫోకామ్ లిమిటెడ్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంకు కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తాయన్నారు. మెషిన్ ఆపరే టర్, ప్రొడక్షన్ ట్రైనీ, అసెంబ్లింగ్ ఆపరేటర్, జియో ఫైబర్ ఇంజనీర్, మేనేజర్ తదితర పోస్టుల భర్తీకి మేళా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. టెన్త్, ఐటీఐ, ఇం టర్, డిప్లమో, డిగ్రీ పూర్తి చేసిన వారు హాజరుకావాలని, ఎంపికైన వారికి రూ. 10వేల నుంచి రూ.19,500ల వరకు నెలవారి వేతనం ఉంటుందన్నారు. 18-35 సంవత్సరాల వయస్సు మధ్య గల అభ్యర్థులు ఆధార్‌కార్డుతో పాటు విద్యార్హతల జిరాక్స్ కాపీలతో జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో ఉదయం 10 గం టల నుంచి జరిగే జాబ్‌మేళాకు హాజరుకావాలని ఆమె కోరారు.

నేత్రదానంతో అంధులకు చూపు

ఒంగోలు కార్పొరేషన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి సహజ మరణం తరువాత నేత్రదానం చేయడం ద్వారా అంధులకు దృష్టిదానం చేయవచ్చని ఎల్‌వీ ప్రసాద్ ఐ బ్యాంకు నిర్వాహకులు రాజన్న బుధవారం పేర్కొన్నారు. ఒంగోలు లోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి అనుబంధంగా ఐ బ్యాంకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సందర్భంగా స్థానిక మంగమూరురోడ్‌కు చెందిన పంగులూరి రా మారావు తన తల్లి శేషమ్మ మరణించడంతో ఆమె నేత్రాలను దానం చేశారని తెలిపారు. న్యాయవాది పంగులూరి గోవిందయ్య, ఎస్‌వీ.రంగారెడ్డి, దామా శ్రీని వాసులు, జి.నాగేశ్వరరావు, ఆరోగ్య విస్తరణాధికారి శ్రీను పాల్గొన్నారు.

డీఎస్సీ పోస్టుల ఎంపికకు మరో అవకాశం ఇవ్వాలి

ఒంగోలు విద్య, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ ఒకటి కంటే ఎక్కువ పోస్టులకు అర్హత సాధించిన అభ్యర్థులకు పోస్టును ఎంపిక చేసుకునేందుకు మరో అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు కె.మల్లికార్జునరావు, టి.దిలీప్‌చక్రవర్తి గురువారం ఒక ప్రక టనలో కోరారు. అభ్యర్థులకు ఈ అవకాశం కల్పించి వారికి న్యాయం చేయాలని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు.

చెక్ బౌన్స్ కేసులో శిక్ష

టంగుటూరు (కొండపి), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కందులూరు గ్రామానికి చెందిన కుంచాల నాగార్జున అదే గ్రామానికి చెందిన మొలకలపల్లి లక్ష్మీనారాయణకు డబ్బులు బాకీ ఉండగా, నాగార్జున చెక్ ఇచ్చాడు. చెక్ బౌన్స్ అయినా ఎంతకీ బాకీ చెల్లించకపోవడంతో లక్ష్మీనారాయణ కోర్టులో కేసు వేశారు. నేరం రుజువు కావడంతో ఒంగోలులోని ఎక్సైజ్ కోర్టు నిందితుడికి రూ.2లక్షలు జరిమానా, రెండు సంవత్సరాలు జైలు శిక్ష విధించింది. ఆ మేరకు న్యాయాధికారి కో మలివల్లి తీర్పునివ్వగా నేరస్తుడిని ఒంగోలు జైలుకు రిమాండ్‌కు తరలించారు.

స్వామిత్వ సర్వే పరిశీలన

కొండపి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కొండపి గ్రామ పంచాయతీలోని కట్టావారిపాలెంలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను ఇన్‌చార్జి ఎంపీడీవో పి.రామకృష్ణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొండపి గ్రామ సచివాలయం-2లో సర్వేలో పాల్గొంటున్న సిబ్బందికి తగిన సూచనలు జారీ చేశారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి తప్పులు లేకుండా చేయాలని సిబ్బందికి సూచించారు.

గ్రానైట్ లారీ బోల్తా

సంతనూతలపాడు, ఆగ స్టు 28(ఆంధ్రజ్యోతి): ఎం డ్లూరు డొంకవద్ద బుధవారం అర్ధరాత్రి వైట్‌స్టోన్ గ్రానైట్ లోడుతో బద్వేలు నుంచి గు ళ్లాపల్లి వెళ్తున్న లారీ ప్రమా దవశాత్తు బోల్తాపడింది. లారీ తొలుత ముందున్న 108 వాహనాన్ని ఢీకొట్టి ప క్కనే ఉన్న డ్రైనేజీ కాలువ, సగం రోడ్డుపై పడింది. గురువారం ఉదయం పెద్ద ఎత్తున ట్రాఫిక్ స్తంభించి పోవడంతో పోలీసులు క్రేన్‌సాయంతో రోడ్డుపై పడిన గ్రానైట్ లారీని పక్కకు తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు.

ఘనంగా అమరావతి క్వాంటమ్ ర్యాలీ

సంతనూతలపాడు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎండ్లూరు డొంకవద్ద నున్న ఆర్‌జీయూకేటీ ఒంగోలు క్యాంపస్‌లో గురువారం అమరావతి క్వాంటమ్ ర్యాలీ హ్యాకథాన్-2025 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో ఐబీఎం, టీసీఎస్, క్యూక్రిషి వంటి పరిశ్రమల భాగస్వాముల మద్దతుతో విద్యార్థులకు క్వాంటం ఫస్ట్ టెక్నాలజీని ఉపయోగిం చి వాస్తవ సమస్యలను పరిష్కరించే హ్యాకథాన్ వేదికను కల్పించినట్లు ఏవో చం ద్రశేఖర్ తెలిపారు.

అవీ..ఇవీ..

విద్యతోనే వ్యక్తిత్వ వికాసం



విద్యార్థులతో ఉపాధ్యాయులు, ప్రతినిధులు

వేటపాలెం(చీరాల), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యనభ్యసించడం ద్వారానే ఉన్నత వ్యక్తిత్వం అలవడుతోందని వేటపాలెం బాలికోన్నత పాఠశాల హెచ్‌ఎం సరోజిని అన్నారు. చీరాల శ్రీరామకృష్ణ సేవాసమితి గురువారం ప్రతినిధులు వేటపాలెం బాలికోన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు నిరుపేద విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేశారు. మూడు మాసాలు పాటు సహకారం అందించనున్నట్లు చెప్పారు. అలాగే స్వామి వివేకానంద జీవిత సందేశం పుస్తకాలను విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సరోజని, సమితి సెక్రటరీ విఎస్ఎన్ మూర్తి, వేణుగోపాలరావు, మధు, శ్రావణి, సరళదేవీ, వసుధ కుమారి, సుధారాణి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపుతో ప్రజలపై భారం

- వామపక్షాల ఆధ్వర్యంలో ప్రతిజ్ఞాదినం



ప్రతిజ్ఞ చేస్తున్న వామపక్షాల నేతలు

చీరాల, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చార్జీల భారం, స్మార్ట్ మీటర్ల నిర్వహణ, ట్రూ అప్ చార్జీలకు వ్యతిరేకంగా చీరాలలో వామపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రతిజ్ఞదినం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బషీర్‌బాగ్‌లో అసువులు బాసిన విద్యుత్ అమర వీరుల స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై ఉద్యమిస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ పంపిణీ, నిర్వహణ వ్యవస్థలు ప్రైవేటు సంస్థలకు అప్పగించడంపై మండి పడ్డారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బాబురావు, వసంతరావు, నారపరెడ్డి, జయరాజ్, సీపీఐ నాయకులు బత్తుల సామ్యేల్, ఫైడియ్య, ప్రజా సంఘాల నేతలు మాచర్ల మోహన్‌రావు, చుండూరి వాసు, గోసాల ఆశీర్వాదం, లక్ష్మీ ప్రసాద్, వెంకటేశ్వర్లు, మోహన్‌కుమారధర్మ పాల్గొన్నారు.

బషీర్‌బాగ్ అమరవీరులకు నివాళి

మార్టూరు : బషీర్‌బాగ్‌లో జరిగిన విద్యుత్ ఉద్యమంలో కాల్పులలో ప్రాణాలు కోల్పోయిన వారికి గురువారం మార్టూరులో పార్టీ కార్యాలయంలో వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నాయకులు నివాళులు అర్పించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కందిమళ్ల రామకోటేశ్వరరావు, బత్తుల హనుమంతరావు, బోడెంపూడి సూరిబాబు, ఎనికపాటి రాంబాబు, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు వద్దు

అద్దంకిటౌన్ : ప్రమాదకర స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని సీపీఎం అద్దంకి పట్టణ కార్యదర్శి తంగిరాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో విద్యుత్ సమస్యలపై నాటి పోరాటాన్ని గుర్తు చేసుకుంటూ వామపక్షల పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రతిజ్ఞ దినం నిర్వహించారు. కార్యక్రమానికి ఏఐటీయూసీ నాయకులు కేఎల్‌డీ ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బషీర్‌బాగ్‌లో జరిగిన విద్యుత్ పోరాటంలో అశువులు బాసిన అమరవీరులకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు పి.తిరుపతిరెడ్డి, వివిధ సంఘాల నాయకులు ఆదాం, ఉసురుపాటి శామ్యూల్, టోటా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రెండు కుటుంబాల మధ్య కొట్లాట

- ఐదుగురిపై కేసు నమోదు

బల్లికురవ, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొణిదెన ఎస్సీ కాలనీలో పాతకక్షల నేపథ్యంలో బుధవారం ఇరు కుటుంబాల మధ్య కొట్లాట జరిగింది. ఈ ఘటనలో పలువురు గాయపడ్డారు. అందిన సమాచారం మేరకు గెల్లా దేవేంద్ర, ఆశోక్‌లకు మధ్య పాత గొడవలు ఉన్నాయి. వినాయక చవితి సందర్భంగా మద్యం సేవించిన ఆశోక్ ఘర్షణకు దిగారు. ఘర్షణ మధ్యలో వచ్చిన దేవేంద్ర బంధువు కోటేశ్వరరావుకు కత్తి తగిలి గాయమైంది. వెంటనే క్షతగాత్రుడిని గుంటూరు వైద్యశాలకు తరలించారు. దేవంద్ర ఫిర్యాదు మేరకు ఆశోక్ మరో నలుగురిపై ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేశారు. ఆశోక్ ఒంగోలు వైద్యశాలకు చేరి అక్కడ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అక్కడి నుంచి కూడా ఫిర్యాదు వస్తే కేసు నమోదు చేసి విచారిస్తామని పోలీసులు తెలిపారు.

హెచ్ఐవీ నిర్మూలనకు కృషి చేద్దాం

- లింక్‌వర్కర్‌స్కీమ్ ప్రతినిధి విజయశ్రీ

పంగులూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): హెచ్‌ఐవీ వ్యాధిపట్ల అవగాహన పెంచడంద్వారా వ్యాధినిర్మూలన లక్ష్యంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని చైల్డ్ ఫండ్ ఇండియా లింక్‌వర్కర్‌స్కీమ్ ప్రతినిధి విజయశ్రీ అన్నారు. మండలంలోని ముప్పవరం గ్రామ ఒకేషనల్ జూనియర్ కళాశాల, పీఎస్ఎస్‌సీసీ ఉన్నతపాఠశాల విద్యార్థులతో పాటు జాగర్ల మూడివారిపాలెం గ్రామంలోని మహిళాగ్రూప్ సభ్యులకు హెచ్‌ఐవీపై గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అసురక్షిత లైంగిక సంబంధాలు, హెచ్‌ఐవీతో కలుషితమైన సూదులు, సిరంజీల వినియోగం, పరీక్షించని రక్తమార్పిడి ద్వారా హెచ్ఐవీ వ్యాప్తి చెందుతుందన్నారు. హెచ్‌ఐవీ సోకినప్పటికీ, గర్భిణి నుంచి పుట్టబోయే బిడ్డకు హెచ్‌ఐవీ వ్యాధిసోకకుండా నివారించవచ్చన్నారు. హెచ్‌ఐవీతో పాటు డ్రగ్స్ బారిన పడకుండా యువతలో అవగాహన పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సురేష్, ఉన్నతపాఠశాల హెచ్‌ఎం. ప్రసాద్, ఏఎన్ఎం రామాంజమ్మ, పాఠశాల, కళాశాల అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, మహిళాగ్రూప్ సభ్యులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

మార్టూరు, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాజుగారిపాలెంలో, కోనంకిలోని సమతానగర్‌లోని ప్రాథమిక పాఠశాలను వేర్వేరుగా ఎంఈవోలు వస్రాంనాయక్, కే.ప్రేమలతలు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు వేడిగా అన్నంపెట్టాలని, విద్యార్థులను కూర్చోబెట్టి భోజనం పెట్టాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీ రమేష్ తదితరులు పాల్గొన్నారు.




పర్చూరులో రామాలయం వద్ద జయంతి కాలనీలో వినాయకుని పూజలు చేస్తున్న భక్తులు




ఇంకొల్లు, మార్టూరు మండలంలోని ఏలూరి క్యాంపు కార్యాలయంలో పూజలందుకుంటున్న వినాయకుడు

దండాలయ్యా .. ఉండ్రాలయ్యా

- వాడవాడలా వినాయకచవితి ఉత్సవాలు
- విశేష పూజలు చేసిన భక్తులు
- ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న గ్రామాలు

పర్చూరు, అగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వినాయక చవితి పర్వదిన వేడుకలను భక్తులు బుధవారం అత్యంత ఘనంగా నిర్వహించారు. గ్రామాల్లోనిపలు కూడళ్లలో పెద్దఎత్తున వినాయక విగ్రహాలను ఏర్పాటు చేయడంతో సందడి వాతావరణం నెలకొంది. వినాయక విగ్రహాల వద్ద ఏర్పాటు చేసిన పూజా కార్యక్రమంలో దంపతులు పాల్గొని స్వామివార్ల భక్తిని చాటుకున్నారు. వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన పందిళ్లను రంగు రంగు తోరణాలతో అలంకరించారు. పర్చూరు టీనగర్‌లో ఓ ముస్లిం యువతి రూ.40వేలు విలువైన వినాయక విగ్రహాన్ని అందజేసి ఐక్యతను చాటారు. అదేవిధంగా తూర్పువారివీధి, మద్దబజార్, జయంతి కాలనీ, రామాలయం వీధి, అద్దంకి మాన్యం, శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక విగ్రహాలను ఏర్పాటు చేసి పూజాకార్యక్రమాలు చేపట్టారు. అదే విధంగా నాగుపాలెం, వీరన్నపాలెం, ఉప్పుటూరు, చెరుకూరు, కొల్లావారిపాలెం, ఉప్పుటూరు, చెరుకూరు, తిమ్మరాజుపాలెం, దేవరపల్లి, అన్నంబొట్లవారిపాలెం, నూతలపాడు, పోతుకట్ల తదితర గ్రామాల్లో వినాయక చవితి పండుగ అత్యంత వేడుకగా జరిగాయి.

కారంచేడు : మండలంలోని పలు గ్రామాల్లో వినాయక చవితి పర్వదిన వేడుకలను ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో బుధవారం నిర్వహించారు. స్థానిక మాస్కోబజార్, ప్రధాన వీధుల్లోని ఆయా కూడళ్లతో ఏర్పాటు చేసిన ప్రత్యేక పందిళ్లలో గణనాథుల విగ్రహాలతో విశిష్ట పూజలు చేపట్టారు. మండలంలోని కుంకలమర్రు, స్వర్ణ, స్వర్ణపాలెం, దగ్గుబాడు, జరుబుల వారిపాలెం, నాయుడు వారిపాలెం తదితర గ్రామాల్లో వినాయక చవితి పండుగను అత్యంత వేడుకగా జరుపుకున్నారు.

పంగులూరు : మండలంలోని పలు గ్రామాల్లో ఉత్సవ కమిటీలు ప్రత్యేక మండపాలు ఏర్పాటుచేసి వాటిని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రత్యేకంగా అలంకరించిన వాహనాలలో వినాయక విగ్రహాలను ఉంచి వీధుల్లో మేళతాళాలతో, బాణాసంచా కాలుస్తూ, ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా ఊరేగింపు నిర్వహించి యువత సందడి చేశారు. అనంతరం మండపాలలో కొలువుదీరిన గణనాథులకు భక్తులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు అందజేశారు. గ్రామాలలోని పలువాడలలో ఏర్పాటు చేసిన మండపాలలో బుధ, గురువారాలలో గణనాథు లకు పూజాకార్యక్రమాలు కొనసాగించడంతో గ్రామా లలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

ఇంకొల్లు : వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకొని, మండలంలో వినాయకచవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇంకొల్లులో రామమందిరం, కృష్ణనగర్ ఆంజనేయస్వామి గుడి, నాగులచెరువుకట్ట, అభయాంజనేయస్వామి ప్రధాన వీధుల్లో పెద్దఎత్తున వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. గంగవరం, ఇడుపులపాడు, భీమవరం, నాగండ్ల, హనుమోజిపాలెం గ్రామాలలో వినాయకచవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వివిధ రూపాలలో గణపతి విగ్రహాలను ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు చేసి భక్తులకు ప్రసాదాలు అందజేసారు.

మార్టూరు : వినాయకచవితి పర్వదినాన్ని బుధవారం మండలంలో ప్రజానీకం ఘనంగా జరుపుకున్నారు. వినాయకుని విగ్రహాలను కొనుగోలు కేంద్రం నుంచి మండపాలకు తరలించే సమయంలో యువకులు భారీగా బాణాసంచా కాలుస్తూ, ఆటపాటలతో, డప్పుల మోతతో ఊరేగింపుగా మండపాలకు తీసుకువచ్చి ప్రతిష్ఠించారు. ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో కార్యాలయప్రతినిధి కొమ్మినేని వెంకట్ దంపతులు ప్రత్యేక పూజలో పాల్గొన్నారు అర్చకులు శంకర్‌శాస్త్రి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు సిబ్బంది నైవేద్యాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కామేపల్లి హరిబాబు, సిబ్బంది సతీష్, సంపత్, అశోక్, మహేష్, అనిల్, సాయి, ఫణి తదితరులు పాల్గొన్నారు. అదేవిదంగా మార్టూరులోని తూర్పుబజారులో కావలి వద్ద చాగల్లు నుంచి తీసుకొచ్చిన 14 అడుగులు ఎతైన వినాయకుని విగ్రహాన్ని ,పడమర బజారున విజయవాడ దగ్గ నన్నూరు నుండి తీసుకువచ్చిన 15 అడుగుల ఎతైన విగ్రహాన్ని, నేతాజీనగర్‌లో గుంటూరు నుండి తీసుకువచ్చిన విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. బుధ, గురు వారాలు స్వామి వారి విగ్రహాల ముందు పలువురు దంపతులు కూర్చుని పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. రాత్రి సమయాలలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు.


బల్లికురవ : మండలంలోని అన్ని గ్రామాలలో బుధవారం వినాయకచవితి వేడుకలను ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం నుంచే గ్రామాలలో విద్యార్థులు పొలాలకు వెళ్లి వినాయకుడికి ఇష్టమైన పత్రిని సేకరించారు అనంతరం గ్రామ కూడళ్లలో, గృహాలలో వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. గతంలో ఎన్నడు లేని విధంగా బల్లికురవ మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో భక్తులు పోలీసుల అనుమతుల మేరకు 116 వినాయకుడి విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో వినాయక పూజలు

చినగంజాం : మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో వినాయకచవితి పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో బుధ, గురువారాలలో వైభవంగా నిర్వహించారు. వినాయక చవితిని పురస్కరించుకొని వీధివీధిన గణనాథుని విగ్రహాలను పోటా పోటీగా ఏర్పాటు చేశారు. మండపాల్లో విభన్న రూపాల్లో ఉన్న గపణయ్యలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాలలో ఏర్పాటు చేసిన గణనాథుల విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మండపాలను రంగు రంగుల విద్యుత్ దీపాల ఆలంకరణతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గృహాలలో మట్టి వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసి విద్యార్థులు పూజలు నిర్వహించారు. అందంగా ముస్తాబు చేసిన మండపాల్లో కొలువు తీరిన లంబోదరునికి భక్తులు భక్తి శ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించారు. పెదగంజాం, సంతరావూరు, గొనసపూడి, చింతగుంపల్లి, కడవకుదురు, పెదగంజాం, మోటుపల్లి, చినగంజాం, సోపిరాల, మున్నంవారిపాలెం, రాజుబంగారుపాలెం, కొత్తపాలెం, మూలగానివారిపాలెం, నీలాయపాలెం తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి వినాయకచవితి ఉత్సవాలను కన్నులపండువగా నిర్వహించారు. పలు గ్రామాల్లోని విగ్రహాల వద్ద భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాలు నిర్వహించారు. పలు గ్రామాల్లోని విగ్రహాలను గురువారం నిమజ్జన కార్యక్రమాలను నిర్వహించారు.

అద్దంకి : వినాయక నిమజ్జనాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. అద్దంకి పట్టణంలో ఇళ్లలో ఏర్పాటు చేసుకొని పూజలు నిర్వహించిన వినాయక విగ్రహాలను గురువారం గుండ్లకమ్మ నదిలో వంతెన పై నుంచి నిమజ్జనం చేశారు. దీంతో గుండ్లకమ్మ వంతెనపై సందడి నెలకొంది. అద్దంకి పట్టణం, మండలంలోని అన్ని గ్రామాలలో కలిపి మొత్తం 139 వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. అత్యధిక శాతం వి గ్రహాలను 5వ రోజు ఆదివారం నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో తిమ్మాయపాలెం సమీపంలో గుండ్లకమ్మ నదిలో వినాయక విగ్రహాలు నిమజ్జనానికి వీలుగా సీఐ సుబ్బరాజు ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్ సాయంతో శుభ్రం చేయించారు. వినాయక నిమజ్జనాల సందర్భంగా అవసరమైన మేర బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు. వినాయకుడి మండపాల వద్ద, నిమజ్జనం సమయంలో భక్తులు, పిల్లలు అప్రమత్తంగా ఉండాలని సీఐ సూచించారు. చిన్నపిల్లలను ఒంటరిగా నిమజ్జనం వద్దకు పంపించ వద్దని తెలిపారు. తల్లిదండ్రులు అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. నిమజ్జనం సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సంతమాగులూరు : వినాయకచవితి సందర్భంగా మండలంలోని మక్కెనవారిపాలెం గ్రామంలోని దక్షిణంబజారులోని విఘ్నేశ్వర యవత ఆధ్వర్యంలో నాలుగేళ్లగా మట్టి వినాయకుడిని ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది ఏర్పాటు ఏర్పాటు చసిన పంచముఖ వేఘ్నేశ్వరస్వామి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఎస్సై పట్టాభి రామయ్య విగ్రహాన్ని పరిశీలించి మట్టివినాయకులతో పర్యావరణానికి మేలు జరుగుతుందన్నారు.






మక్కెనవారిపాలెంలో ఏర్పాటు చేసిన పంచముఖ మట్టి విగ్రహం, ముక్తేశ్వరంలో వినాయకుడికి పూజలు, చిన్నగంజాం బాపయ్య నగర్‌లో, అద్దంకి గుండ్లకమ్మలో వినాయకుని నిమజ్జనం

ఎస్సీ వర్గీకరణతో మాలలకు అన్యాయం

- మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌బాబు
- మార్టూరు చేరిన రాజ్యాంగ పరిరక్షణ యాత్ర



పాదయాత్రలో భాగంగా నినాదాలు చేస్తున్న మాల సంక్షేమ సంఘాల నాయకులు

మార్టూరు, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని, రాజ్యాగం స్ఫూర్తికి వ్యతిరేకంగా తీర్పు ఉందని, మాల ఉద్యోగుల సంక్షేమసంఘం రాష్ట్ర అధ్యక్షులు తుల్లిబిల్లి అశోక్ బాబు అన్నారు. రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కుప్పం నుంచి ఇచ్చాపురం వరకు పాదయాత్రను నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం ఈ యాత్ర మార్టూరు చేరింది. ఈ సందర్భంగా యాత్ర బృందం పాదయాత్ర చేస్తూ మార్టూరు కూడలి నుంచి గన్నవరం రోడ్డు ద్వారా నేతాజీ నగర్, రామ్ నగర్ కూడలి వదకు చేరి అక్కడ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించింది. అనంతరం అక్కడ మాలల ఆత్మీయ సమావేశంలో అశోక్‌బాబు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణతో విద్యావంతులైన మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. పెరిగిన ఎస్సీ జనాభాకు అనుగుణంగా 20 శాతం రిజర్వేషన్‌ను పెంచాలన్నారు. అదేవిదంగా దళిత క్రైస్తవులకు రిజర్వేషను అమలు చేయాలన్నారు. ప్రవేటురంగాలలో రిజర్వేషనును అమలు చేయాలన్నారు. తరువాత రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు డాక్టరు దాసరి చెన్నకేశవులు మాట్లాడుతూ వర్గీకరణ బిల్లును కూటమి ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలో 42 లక్షలు ఓట్లు ఉన్న మాలలను రాజకీయపార్టీలు వాడుకొని వదిలేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మాల ఉద్యోగుల సంక్షేమ రాష్ట్ర కార్యదర్శి వేంద్రపాటి శ్రీనివాసరావు, షైలాచిన నాగేశ్వరరావు, దారా రామారావు, గొట్టిపాటి అంజయ్య, నూకతోటి జాను, క్రాంతి, శ్రీదేవి, కూరాకుల ఇసాక్, ఉలాస గాంధీ, దొప్పలపూడి ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు. తరువాత మండలంలోని డేగరమూడి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణానికి యాత్ర బృందం భూమి పూజ చేసింది.

మణికేశ్వరానికి బస్సు సౌకర్యం

అద్దంకి, ఆగస్టు26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మణికేశ్వరం, కొంగపాడు గ్రామాలకు గురువారం నుంచి బస్సు సౌకర్యం పునరుద్ధరించారు. గతంలో అద్దంకి నుంచి మణికేశ్వరానికి బస్సు సర్వీసు ఉన్నా.., కరోనా సమయంలో రద్దు చేశారు. ఈ నేపథ్యంలో మణికేశ్వరం గ్రామస్థులు ఇటీవల మంత్రి రవికుమార్‌ను కలసి బస్ సర్వీసును పునరుద్దరిం చాలని కోరారు. ఈ నేపథ్యంలో ఆర్టీసీ అధికారులతో మంత్రి రవికుమార్ సర్వీసును పనురద్ధరించేలా చేశారు. ప్రతి రోజు ఉదయం 5-30, సాయంత్రం 3 గంటలకు, రాత్రి 7 గంటలకు అద్దంకిలో బయలుదేరి మణికేశ్వరం వస్తుందని డీఎం రామ్మోహనరావు తెలిపారు. అదే సమయంలో వినుకొండ, నర్సరావుపేట, ఒంగోలులకు అదనంగా రెండేసి ట్రిప్పులు బస్ లు పెంచినట్లు తెలిపారు. నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు షేక్ కరముల్లా స్థానిక టీడీపీ నేతలతో కలిసి మణికేశ్వరంలో ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు బడావలి, రూబేను, రవి, ఆదినారాయణ, కాలేషా, రఘుబాబు, సుధాకర్, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



బస్సు సేవలను ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడి మృతి

అద్దంకి, ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వృద్ధుడు చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు పట్టణంలోని భాగ్యనగర్‌కు చెందిన దగ్గు శ్రీనివాసరావు(65) ఈ నెల 26న ఉదయం అద్దంకి నుండి మోటార్‌సైకిల్‌పై వెళ్తూ చక్రాయపాలెం గ్రామంలోకి వైద్యసేవల కోసం మలుపు తిరుగుతున్న 104 వాహనాన్ని ఢీకొట్టాడు. గాయపడ్డ శ్రీనివాసరావును ఒంగోలు ప్రవేట్ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

రూ.6 లక్షల విలువైన కోడిపుంజుల చోరీ

- కొప్పవరం గ్రామంలో ఘటన, పోలీసులకు ఫిర్యాదు

సంతమాగులూరు ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొప్పవరం గ్రామపంచాయతీలోని నెహ్రూ నగర్ కాలనీలో పూల రాముకు చెందిన కోళ్ల పెంపకం కేంద్రంలో బుధవారం తెల్లవారుజామున 15 కోడి పుంజులు చోరీకి గురయ్యాయి. వీటి విలువ సుమారు ఆరు లక్షల రూపాయల వరకు ఉంటుందని బాధితుడు రాము వాపోయారు. ఆ మేరకు గురువారం ఉదయం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుదారుని వివరాల ప్రకారం నెహ్రూ నగర్ కాలనీలో 6 నెలలుగా తన ఇంటి పరిసరాల్లో తూర్పు కోళ్ల పెంపకం కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కేంద్రంలో 15 కోడిపుంజుల తో పాటు 15 జాతి కోడి పెట్టలు, 40 కోడి పిల్లలు ఉన్నాయి. బుధవారం రాత్రి వర్షం కారణంగా తాను ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో దొంగలు కోళ్ల పెంపకం కేంద్రానికి అడ్డుగా ఉన్న ఇనుప గేటును తొలగించి అందులోని ఖరీదైన కోడిపుంజులను చోరీ చేశారు. బుధవారం ఉదయాన్నే కోళ్ల పెంపకం కేంద్రం వైపు చూడగా కోడిపుంజులు కనిపించకపోవడంతో చోరీకి గురి అయ్యాయని తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పూల రాము తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పట్టాభి రామయ్య తెలిపారు.

నానో యూరియాతో పంటలకు మేలు

అద్దంకిటౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మాములు యూరియాతో పంటలకు మేలు చేసే మంచి సూక్ష్మజీవులు, వానపాములు చనిపోతాయని, నానో యూరియా పిచికారి చేయడం వలన పంటలకు మరింత మేలు జరుగుతుందని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. గురువారం మండలంలోని నాగులపాడు, వేలమూరిపాడు గ్రామాలల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతుతో ఆయన మాట్లాడారు. అర లీటరు నానో యూరియా ఒక బస్తా యూరియాతో సమానమన్నారు. నానో యూరియా పిచికారి చేయడం వలన పంట ఆకులపై పడి సమర్థవంతంగా పని చేస్తుందన్నారు. మందు భూమిపై పడకపోవడం వలన భూమిలో పంటలకు మేలు చేసే జీవులకు నష్టం వాటిల్లదన్నారు. మండలంలో ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని రైతులు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో ఏఈవో కోటేశ్వరరావు, వీఏఏ చాందిని, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

ఘనంగా వీహెచ్‌పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



కేకు కట్ చేస్తున్న ఎంఆర్‌పీఎస్, పీహెచ్‌పీఎస్ నాయకులు

అద్దంకిటౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వికలాంగుల హక్కుల పోరాట సమితి(వీహెచ్‌పీఎస్) ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్‌పీఎస్ సీనియర్ నాయకులు పూనూరి నరేంద్ర మాదిగ మాట్లాడుతూ మందకృష్ణమాదిగ న్యాయకత్వంలో 18 సంవత్సరాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వికలాంగుల హక్కుల పోరాట సమితి ఏర్పాటు చేసి అనేక పోరాటాలు చేసిందన్నారు. తద్వారా వారి హక్కులను సాధించుకొందన్నారు. దీంతో ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. ఈ వేడుకలల్లో ఎంఆర్‌పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పూనూరి రమేష్‌మాదిగ, పూనూరి నేహేమియామాదిగ, మండల అధ్యక్షుడు పాలెపోగు సుబ్బారావు, పట్టణ అధ్యక్షుడు దాసరి బుల్లెయ్య మాదిగ నాయకులు స్వామి అప్పారావు, రామకృష్ణ, ఎరగాని లక్ష్మిరెడ్డి, శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

దివ్యాంగుల హక్కులను సంరక్షించండి


చీరాల : దివ్యాంగుల హక్కులను పరిరక్షించాలని మున్సిపల్ చైర్మన్ సాంబశివరావును నవ్యాంధ్ర దివ్యాంగులు హక్కుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషా కోరారు. గురువారం చైర్మన్‌ను మర్యాద పూర్వకంగా కలిసి సమస్యలకు సంబంధించిన వినతిపత్రం అందజేశారు. జీవో నెం.43 ప్రకారం అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగాలలో 5 శాతం అమలు పరచాలని కోరారు.

స్వామిత్వ సర్వేలో కొలతలు నమోదు చేయాలి

చీరాల డీఎల్‌డీవో పద్మావతి ఆదేశం

చినగంజాం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి) : స్వామిత్వ సర్వేలో క్యూజీఐఎస్ స్టాఫ్‌వేర్‌ను అసిస్టెంట్ ఇంజనీర్లు డౌన్లోడ్ చేసుకొని అందులో వాస్తవ కొలతలు నమోదు చేయాలని చీరాల డీఎల్‌డీవో కే.పద్మావతి ఆదేశించారు. మండలం లోని కడవకుదురు గ్రామంలో నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేను గురువారం ఆమె పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. నిష్పక్షపాతంగా కొలతలు తీసుకొని తప్పులు లేకుండా నమోదు చేయాలని డీఎల్‌డీవో సిబ్బందికి సూచించారు. 36 అంశాలలో అన్ని వివరాలు నమోదు చేయాలని అన్నారు. గ్రామంలో సర్వే చేయడానికి ఐదు టీంలను వేయాలని గ్రామకార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో సీ.హెచ్.పూర్ణచంద్రరావు, ఈవోపీఆర్‌డీ టి.సుధాకరావు, గ్రామ కార్యదర్శి పర్చూరు శ్రీనివాసరావు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

సోమశిలలో 59.490 టీఎంసీల నిల్వ



అనంతసాగరం ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతాల నుంచి సోమశిల జలాశయానికి 18,452 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది. ఇక డ్యాంలో 59.490 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఉత్తర కాలువకు 400, కండలేరుకు 10,500, డెల్టాకు 1,850 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.





పాదలకూరు : లింగేశ్వరుడికి ప్రదక్షిణగా...



కందుకూరు : వాసవీ గ్రంథాలయంలో



కావలిలో గరుడారూఢుడై...



నెల్లూరు బాలాజీ నగర్‌లో బాల గణేశ్



అల్లూరులో తొమ్మిది అడుగుల మట్టి గణపతి



సంగం : ఉత్సాహంతో ఉట్టికొడుతున్న బాలలు

జై.. జై గణేశా!

భక్తిశ్రద్ధలతో వినాయక చవితి • వాడవాడలా ఉత్సవ మండపాలు • దర్శించుకున్న మంత్రులు, ఎమ్మెల్యేలు

విఘ్నాలను తొలగించి, సకాల శుభాలను వొసగే విఘ్నేశ్వరుడిని జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో కొలిచారు. వినాయక చవితి పండుగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఊరూరా.. వాడవాడలా మండపాలు కట్టి ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించారు. జిల్లా వ్యాప్తంగా ఎనిమిది వేలకుపైగా తాత్కాలిక గణపతులను ఏర్పాటు చేశారు. అపార్ట్‌మెంట్లలో, ఇంటింటా లక్షలాది మట్టి గణపతులను భక్తితో పూజించారు. మండపాల్లో 3 నుంచి 9 రోజులు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. వినాయక ఆలయాల్లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. కాగా, రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి కుటుంబంతో కలిసి నెల్లూరు కాపువీధిలో ఆనం యువసేన, కాపు వీధి మిత్రమండలి ఏర్పాటు చేసిన గణపతికి పూజలు చేసి ఉత్సవాలు ప్రారంభించారు. రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ కుటుంబ సభ్యులతో నగరంలోని పలు డివిజన్లలో ఏర్పాటు గణపతి మండపాలను దర్శించి పూజలు చేశారు. అందరి సంక్షేమం, పాడి పంటలు సమృద్ధిగా వర్ధిల్లేలా దీవించాలని గణపతిని కోరామని మంత్రులిద్దరు తెలిపారు. అలాగే జిల్లాలోని శాసనసభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు గణేశ మండపాలు సందర్శించి పూజలు చేశారు.



- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



కావలిలో బాలల డప్పుల చప్పుళ్లు



బుచ్చిలో యువత హుషారు



నెల్లూరులో ఆకట్టుకున్న అక్వేరియం ప్రవేశం

ఉత్కంఠ రేపుతున్న కి'లేడి' పోలీస్ కస్టడీ

తొలిరోజు గంటన్నరపాటు విచారణ

నేడు, రేపు పోలీస్ ఉన్నతాధికారుల వంతు

వివరాలు బయటకు పొక్కకుండా జాగ్రత్తలు

అరుణ ఏం చెబుతుందో!?

కోవూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : అనేక నేరారోపణలు ఎదుర్కొంటూ రాష్ట్రవ్యాప్తంగా సంచలనాలకు కేంద్రబిందువైన కి'లేడి' నిడిగుంట అరుణను పోలీసులు కస్టడీకి తీసుకోవడంతో రాజకీయ, పోలీస్ ఇతర అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. మూడు రోజుల విచారణలో తొలిరోజు శుక్రవారం విచారణ ముగియగా మిగిలిన రెండు రోజుల్లో అరుణ నోరువిప్పి ఏం చెబుతుందోనని అందరిలో ఉత్కంఠ నెలకొంది. పడుగుపాడులోని సాయి ఎస్టేట్ అపార్టుమెంటులో 503వ నెంబరు ప్లాటును ఆక్రమించి బిల్డర్ మునగా వెంకట మురళీకృష్ణమోహన్‌ను చంపేస్తామని బెదిరించిన కేసులో అరుణను కోర్టు రిమాండుకు పంపింది. ఒంగోలు జిల్లా జైలులో రిమాండు ఖైదీగా ఉన్న ఆమెన కోవూరు పోలీసులు కోర్టు అనుమతితో గురువారం కస్టడీకి తీసుకుని విచారణ ప్రారంభించారు. ఎస్ఐ రంగనాథ్‌గౌడ్ గురువారం సిబ్బందితో ఒంగోలుకు వెళ్లి జైలు నుంచి కోవూరు పోలీసు స్టేషన్‌కు తీసుకువచ్చి విచారణ ప్రారంభించారు. కోర్టు నిబంధనల ప్రకారం ఆమె తరపు న్యాయవాది కనిపించేంత దూరంలో కూర్చొని విచారణను చూసేందుకు వీలుగా చర్యలు తీసుకున్నారు. విచారణకు తీసుకోవాల్సిన చట్టపరమైన చర్యలన్నీ పూర్తి చేశారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు, విచారణ అంశాలు వెలుపలకు పొక్కకుండా పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. దీంతో గురువారం సుమారు ఒకటిన్నర గంటపాటు జరిగిన విచారణ వివరాలు వెలుగులోకి రాకపోవడంతో పలు వర్గాల్లో ఆందోళన మొదలైంది. తొలిరోజు నియమ నిబంధనలను పోలీసులు పూర్తి చేయగా శుక్ర, శనివారాల్లో పోలీసు శాఖ ఉన్నతాధికారులు విచారించనున్నట్లు తెలిసింది. గత కొద్దికాలంగా జరిగిన నేరాల గురించి ఆమెను నెల్లూరులోని డీఎస్పీ కార్యాలయంలో ప్రశ్నించేందుకు అధికారులు సమాయత్తమయ్యారు. అధికారులు కోవూరు స్టేషన్‌కు వచ్చి విచారించేందుకు సిద్ధపడితే ఇక్కడే విచారించే అవకాశం ఉంది.



కోవూరు పోలీసు స్టేషన్ నుంచి నెల్లూరు జైలుకు వెళుతున్న అరుణ

• సెల్‌ఫోన్ డేటా ఆధారంగా..

రౌడీషీటరు శ్రీకాంత్ పెరోల్ రద్దు తరువాత జిల్లావ్యాప్తంగా ఎన్నో ఆసక్తికర విషయాలు ప్రచారంలోకి వచ్చాయి. నెల్లూరు. తిరుపతి జిల్లాలకు చెందిన పలువురు రాజకీయ నాయకులు, మాజీ మంత్రులు, రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు, ఎస్పీలతో అరుణకు సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు సామాజిక మాధ్యమాల్లో వెలుగు చూశాయి. పలు నేరాల్లో ఆమెకు సంబంధం ఉన్నట్లు చెబుతున్నారు. అలాగే, ప్రతి ఘటననూ ఆమెకు సెల్‌ఫోన్‌లో చిత్రీకరించే అలవాటు ఉన్నట్లుగా భావిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె ఫోన్‌లోని డేటాను పోలీసు అధికారులు పరిశీలించే అవకాశం ఉందనే సమాచారంతో రాజకీయ నాయకులు, మాజీ మంత్రులు, అధికారుల గుండెల్లో దడ మొదలైంది. సెల్‌ఫోన్‌లోని సమాచారంతో ఆమెకు ప్రశ్నలు వేయడానికి పోలీసు అధికారులు ఇప్పటికే సిద్ధమైనట్లు తెలిసింది.

డీజీపీ రాకతో వేడెక్కిన వాతావరణం

నెల్లూరు (క్రైం) : అరుణ నేర సామ్రాజ్యానికి సహకరించిన పోలీసులు ఎవరు!? అండగా నిలిచిన నాయకులు ఎవరు!? గత ప్రభుత్వంలో రౌడీషీటర్ శ్రీకాంత్, అరుణల దందాలు ఎలా సాగాయి!? ఆ దందాల్లో పాల్గొన్న రౌడీషీటర్లు, నేరస్థులు ఎవరు!? ఇలా అనేక ప్రశ్నలకు జవాబులు రాబట్టేందుకు విఫలయత్నం చేస్తున్నారు. అరుణను పోలీసు కస్టడీకి తీసుకున్న రోజే (గురువారం) రాష్ట్ర పోలీసు బాస్ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా నెల్లూరుకు రావడంతో వాతావరణం మరింత వేడెక్కింది. ఇప్పటికే నెల్లూరు, తిరుపతి జిల్లాల్లోని పోలీసు స్టేషన్లలో అరుణ, శ్రీకాంత్‌లు పెట్టించిన తప్పుడు కేసులు, కబ్జాలు, పంచాయితీలు, మోసాలు, సెటిల్‌మెంట్లు ఇలా అన్ని వివరాలు పోలీసులు తెప్పించుకున్నట్లు తెలుస్తోంది. అరుణతోపాటు ఆమె పక్కన ఉండి దందాలను నడిపించిన వారి వివరాలను పోలీసులు తెలుసుకున్నారు. వాటిన్నింటి గురించి పోలీసులు నేడు, రేపు అరుణను ప్రశ్నించనున్నారు.

జిల్లాలోని ప్రభుత్వ బడులకు కొత్త అయ్యోర్లు రానున్నారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియను పాఠశాల విద్యా శాఖ గురువారం ప్రారంభించింది. డీఎస్సీ-2025కి ఎంపికైన అభ్యర్థుల అన్ని రకాల సర్టిఫికెట్లను రెండురోజుల పాటు పరిశీలించనున్నారు. ఈ ప్రక్రియకు సంబంధించి అభ్యర్థులు తొలుత తమ సర్టిఫికెట్లను విద్యా శాఖ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన అనంతరమే నేరుగా పరిశీలిస్తున్నారు. నగరంలోని వీఆర్ పీజీ కళాశాలలో గురువారం ప్రారంభమైన ఈ పరిశీలనకు తొలిరోజు 585 మందికి సమచారం అందించగా వారంతా హాజరై పరిశీలన చేయించుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. మిగిలిన వారి ధ్రువపత్రాలను శుక్రవారం పరిశీలించనున్నారు.

- నెల్లూరు (విద్య, ఆంధ్రజ్యోతి)

బడులకు కొత్త అయ్యోర్లు!

ప్రక్రియ ప్రారంభించిన విద్యాశాఖ

అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం

మెగా డీఎస్సీ-2025 సంబంధించి అన్ని సబ్జెక్టుల మెరిట్ జాబితాలను ఇప్పటికే డీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచిన నేపథ్యంలో వివిధ కేటగిరీ పోస్టులకు సంబంధించిన సర్టిఫికెట్ పరిశీలనను విద్యాశాఖ అధికారులు చేపడుతున్నారు. దీనికోసంగా మొత్తం 17 కమిటీలను నియమించగా తొలిరోజు 13 కమిటీల నేతృత్వంలో పరిశీలన కొనసాగుతోంది. డీఈఓ ఆర్.బాలాజీరావు పర్యవేక్షణలో డిప్యూటీఈఓలు, ఎంఈఓలు, హెచ్‌ఎంలతో పాటు డిప్యూటీ తహసీల్దారు, టెక్నికల్ అసిస్టెంట్స్, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, డిసేబుల్డ్ వెల్ఫేర్ శాఖల అధికారులు, గురుకుల విద్యాలయాల ప్రతినిధులు బృందాలుగా హాజరై అభ్యర్థుల పత్రాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా జడ్పీ, ఎంపీపీ, మునిసిపల్, ప్రభుత్వ మేనేజ్‌మెంట్‌లలో స్కూల్ అసిస్టెంట్ విభాగంలో లాంగ్వేజ్-1 39, హిందీ 18, ఇంగ్లీష్ 84, మ్యాథ్స్ 63, ఫిజికల్ సైన్స్ 76, బయాలజీ 63, సోషల్ 103, ఫిజికల్‌ఎడ్యుకేషన్ 107, ఎస్‌జీటీ 115 కలిపి మొత్తం 668 పోస్టులు, ట్రైబుల్ వెల్ఫేర్ విభాగంలో హిందీ 1, ఇంగ్లీష్ 1, మ్యాథ్స్ 1, ఎస్‌జీటీ 2 కలిపి 5 పోస్టులు, రెండు విభాగాల్లో 673 పోస్టులు భర్తీ చేయనున్నారు. సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం రాష్ట్ర ఉన్నతాధికారులకు నివేదికలు అందచేస్తాను. ఆ తర్వాతే తుది అభ్యర్థుల జాబితాలను విడుదల చేయనున్నారు. ఈ జాబితా వచ్చిన అనంతరం అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలను అందచేస్తారు. మొత్తం మీద డీఎస్సీ ఉద్యోగ నియామకాలకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలన ప్రారంభం కావడంతో ఈ ప్రాంతం కోలాహలంగా మారింది.



అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

• దివ్యాంగ అభ్యర్థులకు...

అర్హత పత్రాలు పరిశీలకు వీఆర్ ఐపీఎస్ ప్రాంగణంలో హాజరైన దివ్యాంగ అభ్యర్థులు శుక్రవారం జీజీహెచ్‌లోని మెడికల్ సూపరింటెండెంట్ ముందు హాజరై వారి దివ్యాంగ ధ్రువీకరణ పత్రాలను పరిశీలించుకోవాలని డీఈఓ తెలిపారు. పరిశీలన అనంతరం వివరాలను విద్యా శాఖ అధికారులకు అందచేయాలన్నారు. అలాగే శుక్రవారం వీఆర్ ఐపీఎస్‌లో పరిశీలనకు హాజరయ్యే దివ్యాంగ అభ్యర్థులు 30న జీజీహెచ్‌లో హాజరై పరిశీలన చేయించుకోవాలని తెలిపారు.

విద్యుత్ కోతలపై ముందస్తు సమాచారం ఇవ్వాలి

• పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆదేశం

- వివరాలు 8లో..

హరిత వికాసానికి అడుగులు

• జిల్లాలో 960.48 హెక్టార్లలో మొక్కల పెంపకం

• నర్సరీల్లో 20.65 లక్షల మొక్కలు సిద్ధం

ఉదయగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): భూ విస్తీర్ణంలో 33 శాతం పచ్చదనం ఉండాలనేది కేంద్ర అటవీ శాఖ మార్గదర్శకాలు. ఇందుకు అనుగుణంగా అటవీ విస్తీర్ణం పెంపుపై ఆ శాఖ దృష్టి సారించింది. జిల్లావ్యాప్తంగా సుమారు 2.40 లక్షల హెక్టార్ల అటవీ విస్తీర్ణం ఉండగా, అక్రమంగా కలప తరలించడం, పరిశ్రమలకు భూములు కేటాయించ డంతో ఆ విస్తీర్ణం తగ్గుతోంది. గత వైసీపీ ప్రభుత్వం మొక్కలు నాటినా వాటిని సంరక్షించపోవడంతో ఎండిపోయి ప్రజాధనం వృథా అయ్యింది. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం హరితాంధ్రప్రదేశ్‌కు శ్రీకారం చుట్టి పచ్చదనం పెంపుపై దృష్టి సారించింది. ఖాళీ ప్రదేశాలు, రహదారుల వెంట, నివాసాలు, అటవీ శాఖ ప్లాంటేషన్లలో మొక్కలు పెంచాలని నిర్ధేంచి ఆ దిశగా హరిత వికాసానికి అడుగులేస్తోంది.

960.48 హెక్టార్లలో మొక్కల పెంపకం

జిల్లాలో ఉదయగిరి, కావలి, ఆత్మకూరు, నెల్లూరు, నెల్లూరు రూరల్ అటవీ శాఖ కార్యాలయాల పరిధిలో ఈ ఆర్థిక సంవత్సరంలో 960.48 హెక్టార్లలో మొక్కలు పెంచేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకు సంబంధించి నర్సరీల్లో 20.65 లక్షల మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. ఇటీవల వర్షాలు కురవడంతో సుమారు 100 హెక్టార్లలో మొక్కలు నాటారు. మిగిలిన చోట కూడా మొక్కలు నాటేందుకు గుంతలు తీసి సిద్ధంగా ఉన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, అటవీ శాఖ నిధులతో ఈ మొక్కల పెంపకాన్ని చేపడుతున్నారు.



లక్ష్యం పూర్తి చేస్తాం

జిల్లాలో 960.48 హెక్టార్లలో మొక్కల పెంపకమే లక్ష్యం. ఇటీవల వర్షాలు కురవడంతో 100 హెక్టార్లలో మొక్కలు నాటాం. ఇప్పటికే మొక్కలు నాటేందుకు ప్లాంటేషన్‌లను సిద్ధం చేశాం. నర్సరీల్లో మొక్కలు సైతం సిద్ధంగా ఉన్నాయి. అక్టోబరు నాటికి లక్ష్యాన్ని పూర్తి చేస్తాం.

- మహబూబ్‌బాషా, జిల్లా అటవీ శాఖాధికారి

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	114
స్కిన్ చికెన్	210
స్కిన్‌లెస్	230

కోడిగుడ్ల ధర (100): 555త

చెత్తాచెదారం తొలగింపునకు చర్యలు


కాలువను పరిశీలిస్తున్న అధికారులు

కావలి,ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జనతాపేట నుంచి అన్నపుగుంటకు వెళ్లే డ్రైనేజీ కాలువలో చెత్తా చెదారం పేరుకు పోకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ జీ. శ్రావణ్‌కుమార్ తెలిపారు. ఆ కాలువలో చెత్తపేరుకుపోయి ఓవర్‌ఫ్లో అవుతుందనే స్థానికుల సమాచారం మేరకు, గురువారం కమిషనర్, మున్సిపల్ డీఈ సాయిరామ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు బషీర్, నాగేశ్వరరావులు కాలువలో పేరుకుపోయిన చెత్తను పరిశీలించారు. ఆ కాలువ నుంచి చెత్త అన్నపుగుంటలోకి రాకుండా తూముల వద్ద ఇనుపమెస్ ఏర్పాటు చేసి ఉండటంతో ఆ మెస్ వద్ద చెత్త పేరుకు పోయి నీరు ఓవర్ ఫ్లో అవుతున్నట్లు గుర్తించారు. వెంటనే ఆ మెస్ వద్ద ఉన్న చెత్తను తొలగించాలని అధికారులను ఆదేశించారు.

ఓ బొజ్జ గణపయ్యా... మము కాపాడవయ్యా!

- వాడవాడలా వేడుకగా చవితి వేడుకలు
- మండపాల్లో గణేశుడి విగ్రహాలను కొలువు దీర్చి ప్రత్యేక పూజలు
- పలుచోట్ల అన్నప్రసాద వితరణ
- ఎడ్ల పందేలు, కోలాటం భజనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ


కలిగిరి: మల్లితోటలో రూ.50నోట్లతో వినాయకుడికి అలంకరణ


ఉలవపాడు : గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు


వలేటివారిపాలెం పాలకేంద్రం వద్ద ప్రత్యేక అలంకరణలో వినాయకుడు


లింగసముద్రంలో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు

కావలి రూరల్, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో బుధవారం వాడవాడలా వినాయక చవితి వేడుకలు నిర్వహించారు. ఆముదాలదిన్నెలో ప్రత్యేక పూజలు నిర్వహించగా, కొనదిన్నె గిరిజన కాలనీలో చిన్నారులు ఏర్పాటు చేసిన బుల్లి మండపంలో స్వామి వారిని ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. ముసునూరు బాలాజీనగర్‌లోని అన్న సంతర్పణ, మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం రాత్రికి కోలాటం, చిన్నారుల నృత్య ప్రదర్శన నిర్వహించారు. తుమ్మల పెంట రోడ్డులో చిన్నారులు వినాయక విగ్రహాన్ని చెక్కబండిపై ఉంచి నిమజ్జనానికి తరలించారు. చౌదరిపాలెంలో అన్నదానం చేశారు.

కావలి : పట్టణంలో బుధవారం ఉదయాన్నే ప్రతి ఇంటిలో వినాయక ప్రతిమలకు పూజలు చేసి పండుగను ఘనంగా జరుపుకున్నారు. కావలిలో అధికారికంగా ఒకటో పట్టణ పరిధిలో128, రెండో పట్టణ పరిధిలో 59 విగ్రహాలు వారివారి స్థాయిని బట్టి వివిధ రూపాల్లో ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతప్రజలు స్వామి వార్లను దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వినాయకవిగ్రహాల వద్ద తీర్థప్రసాదాలతో పాటు అన్నసంతర్పణ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కలుగోళ్ల శాంభవి ఆలయంలో 9 రోజులపాటు ఉత్సవాలు జరపనున్నారు. కాగా వినాయకుడి ఆశీస్సులు అందరికీ ఉండాలని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి అన్నారు. బుధ, గురువారాల్లో ఆయన పట్టణంలో పలు వినాయక విగ్రహాలను సందర్శించి అక్కడ ఉత్సవాల్లో పాల్గొన్నారు. పాతూరు శివాయంలో ఏర్పాటు చేసిన వినాయకుడిని దర్శించుకుని స్వామి వారి అభిషేకం, ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు ఉన్నారు.

కందుకూరు : పట్టణంలోని పెద్దబజారులోని వాసవీ గ్రంథాలయం, పడమర బలిజపాలెంలలో కొలువైన విగ్రహాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. వాసవీగ్రంథాలయంలో 15 అడుగుల ఎత్తైన నటరాజవినాయకుడి విగ్రహాన్ని ఏర్పాటుచేయటంతో పాటు మండపం ముందు బాలగంగాధర్‌తిలక్, ఛత్రపతి శివాజీమహారాజ్‌ల విగ్రహాలను నిర్వాహకులు ఏర్పాటుచేశారు. ఉత్సవమండపాల వద్ద ప్రతిరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.పడమర బలిజపాలెంలోను హంసవాహనంపై నాట్యం చేస్తున్న గణేశుడు విగ్రహం ఆకట్టుకుంటోంది. కాగా బుధవారం పట్టణ ప్రజలు భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కుటుంబ సమేతంగా ఉపవాసాలు ఉండి గణనాథునికి ప్రత్యేకంగా పత్రి, నైవాద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఉదయం, సాయంత్రం నైవేద్యాలతో గ్రామాలలో నవరాత్రి ఉత్సవాల కోలాహలం నెలకొంది.


కావలి : బృందావనం కాలనీలో వినాయకుడిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే దగుమాటి క్రిష్ణారెడ్డి

అల్లూరు : మండలంలోని ఊరూరా గణేశ్ విగ్రహాలను ఏర్పాటు చేసి పూజలు చేశారు.అల్లూరు పాతబస్టాండు కూడలిలోని విఘ్నేశ్వర ఆలయ ఆవరణలో ప్రత్యేక మట్టితో 9 అడుగుల విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. పాండురంగ దేవాలయ ప్రాంతంలో 9 అడుగుల గణపతిని ఏర్పాటు చేశారు.

కలిగిరి : మండలంలో బుధవారం చవితివేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. వివిధ ఆకృతులతో రెండు నుంచి ఐదు అడుగు విగ్రహాల వరకు ఏర్పాటు చేసుకొని పండుగ జరుపుకున్నారు. పట్టణంలో మల్లితోటలో ఏర్పాటుచేసిన వినాయక విగ్రహానికి రూ.50నోట్లతో ఏర్పాటు చేసిన అలంకరణ ప్రత్యేకతను చాటుకుంది. మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు తన స్వగ్రామమైన పెద్దపాడులో వినాయకచవితివేడుకల్లో పాల్గొన్నారు.

ఉలవపాడు : మండలంలో సుమారు 100 గణేషుడి విగ్రహాలు ప్రతిష్ఠించారు. మూడవ రోజు శుక్రవారం మండలంలో అధికశాతం విగ్రహాలు నిమజ్జనానికి తరలిస్తారు.

కొండాపురం : బుధవారం మండలపరిధిలోని అన్నీ గ్రామాలలోనూ వినాయక చవితిని ఘనంగా జరుపుకున్నారు. గురువారం పలు గ్రామాలలో పిల్లలకు, పెద్దలకు ప్రత్యేకంగా వివిద ఆటలపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. అలాగే నిర్వాహకులు అన్నదానం ఏర్పాటుచేశారు. యువతకు ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించారు.


కొండాపురం : గణేశ్ ఉత్సవాల్లో ఉట్టి కొడుతున్న యువత

వలేటివారిపాలెం : మండలంలో చవితి వేడుకలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని అన్నీ గ్రామాల్లో సుమారు 70 విగ్రహలను ఏర్పాటు చేశారు. విభిన్న రూపాల్లో వినాయకుడు విగ్రహల ప్రతిమల మండపాల్లో కొలువుదీరాయి.


జలదంకి : బండలాగుడు పోటీల్లో పాల్గొన్న ఎడ్లు

జలదంకి : వినాయక చవితిని పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం గణేశుడి విగ్రహాలు నెలకొల్పారు. ఆయా మండపాల వద్ద యువకులు సందడి చేశారు. విద్యుద్దీపాలంకరణలతో విగ్రహాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. జలదంకిలో జిల్లా స్థాయిలో సేద్యపు ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. ఈ పోటీలు జానకీ రామ లింగేశ్వరస్వామి గణేశ్ ఉత్సవ కమిటీ నిర్వహించింది. గురువారం పలుచోట్ల అన్నదానాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

బిట్రగుంట : బోగోలు మండలంలో వినాయక చవితి పండుగను బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మట్టి వినాయక ప్రతిమలకు చాలామంది కొనుగోలు చేసి పూజల తరువాత నిమజ్జనం చేశారు. పలుచోట్ల ఏర్పాటు చేసిన గణపతి విగ్రహాలకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఎస్వీపాలెం పంచాయతీ, మండల, ఇతర ప్రాంతాల ఆక్వా రైతులకు నెల్లూరుకు చెందిన షేక్. సాబ్‌జాద్ నందివాహనంపై గణనాథుడి విగ్రహాన్ని అందచేశారు. స్థానిక రామభక్తబృందం కోలాటభజనలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కృష్ణప్రసాద్‌రెడ్డి, భానుచంద్రరెడ్డి, నాగేంద్ర, రాఘవేంద్ర పాల్గొన్నారు.


కందుకూరు : శివాలయం వద్ద కొలువుదీరిన హంసవాహనంపై నాట్యం చేస్తున్న విఘ్నేశ్వరుడు

లింగసముద్రం : మండలంలో వినాయక చవితి వేడుకలను బుధవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. దాదాపు అన్నీ గ్రామాల్లో భక్తులు వినాయకుని విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామాలలో గణనాథుడి విగ్రహాల కోసం మండపాలను ఏర్పాటు చేసి, రంగురంగుల విద్యుద్దీపాలతో అందంగా అలంకిరించి పూజలు చేశారు.

కార్యకర్తలకు అండగా తెలుగుదేశం : కాకర్ల


దొడ్ల వెంకటరత్నం భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే కాకర్ల సురేష్

కలిగిరి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నాయకులకు, కార్యకర్తలకు టీడీపీ ఎల్లవేళలా అండగా ఉంటుందని ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు పేర్కొన్నారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి కాకు మహేష్ తాత దొడ్ల వెంకటరత్నం భౌతిక కాయానికి, ఎమ్మెల్యే కాకర్ల, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వేర్వేరుగా పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం సీనియర్ టీడీపీ నాయకుడు ఇంగ్లే కల్లయ్య దశదిన కర్మలో పాల్గొని కల్లయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారికుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ కార్యక్రమాల్లో టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డిని ఇష్టారీతిన మాట్లాడితే తాట తీస్తాం!

కావలి,ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిని గురించి ఇష్టారీతిన మాట్లాడితే తాటతీస్తామని పట్టణ ముస్లిం మైనార్టీ నేతలు హెచ్చరించారు. స్థానిక షాదీమంజిల్‌లో గురువారం సాయంత్రం వారు సమావేశమై వైసీపీ నేతలపై విరుచుకుపడ్డారు. ముస్లింలకు అండగా నిలుస్తున్న ఏకైక నాయకుడు క్రిష్ణారెడ్డి అని, ముస్లింలకు ఏ సమస్యవచ్చినా ముందుకు వచ్చి పరిష్కరించే నేత అన్నారు. నెల్లూరు వైసీపీ మైనార్టీ నాయకుడు సమీర్ ఖాన్ వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ , ఆయనకు నిజంగా ధైర్యం ఉంటే కావలికి వచ్చి మాట్లాడితే నీఆరోపణల్లో నిజమెంతో అబద్దమెంతో తేలుస్తామన్నారు. ఈ సమావేశంలో మైనార్టీ నాయకులు అబ్దుల్ రహీం, అన్సర్, అర్షియాబేగం, ఖమర్‌బాబు, ఫిరోజ్, రఫీ, రసూల్, మన్సూర్, ఆశిఫా, పర్విన్‌జానీ, అల్తాఫ్, ఎస్దానీ తదితరులు పాల్గొన్నారు.

తప్పుల సవరణకు అవకాశం

కందుకూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో ఆస్తిపన్ను రికార్డుల్లో ఇంటిపేరు, డోర్ నెంబర్లలో తప్పులుంటే సరిచేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని మున్సిపల్ కమిషనర్ కే. అనూష ఒక ప్రకటనలో తెలిపారు. ఇళ్ల యజమానులు మీకు కేటాయించిన అసెస్‌మెంట్‌లో ఉన్న తప్పుల సవరణకు తగిన ఆధారాలతో వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె తెలిపారు.

అనివేటి మండపం నిర్మాణానికి విరాళం


విరాళం అందజేస్తున్న మంచిరాజు మురళి

కందుకూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): గ్రామదేవత అంకమ్మ అమ్మవారి అనివేటి మండపం నిర్మాణానికి మంచిరాజు వెంకట మురళీమోహన్, అపర్ణ దంపతుల పెద్దకుమారుడు వంశీకృష్ణ, హనుమత్‌ప్రశాంతి దంప తులు గురువారం రూ. 50వేలు విరాళంగా అందజేశారు. మనవరాళ్లు దీత్యఆర్యాహి, ధృతివనితల పేరుతో మంచిరాజు మురళి ఆ మొత్తాన్ని ఆలయ కమిటీసభ్యుడు కొడాలి కోటేశ్వరరావుకు అందజేశారు.

వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధన

నెల్లూరు (సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : నగరంలోని మూలాపేట గురునిలయంలో గొలగమూడి వెంకయ్యస్వామి 43వ ఆరాధనోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం స్వామి నామ సంకీర్తనలతో నగర బిక్షాటన కార్యక్రమం జరిగింది. రాత్రి సత్సంగం జరిగింది. శుక్రవారం ఆరాధన జరగనున్నది.

విద్యుత్ ఉద్యమ అమరవీరులకు జోహార్లు



కావలి : బ్రిడ్జి సెంటర్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న వామపక్షాల నాయకులు

కావలి, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా 2000 ఆగస్టు 28న ప్రదర్శనపై జరిపిన కాల్పుల్లో అశువులు బాసిన రామకృష్ణ, విష్ణువర్ధన్, బాలస్వామికి వామపక్షాల నేతలు జోహార్లు అర్పించారు. గురువారం సాయంత్రం కావలి బ్రిడ్జిసెంటర్‌లో మీ ఆశయాలు కొనసాగిస్తామంటూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యుత్ ఉద్యమ అమరవీరులారా ఉమ్మడి రాష్ట్రంలో విద్యుత్ చార్జీలకు వ్యతిరేక పోరాటంలో ప్రజల కోసం ప్రాణాలు అర్పించిన మీకు విప్లవ జోహార్లన్నారు. పెంచిన విద్యుత్ చార్జీలు ట్రూఅప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు తదితర ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి పీ. పెంచలయ్య, నేతలు క్రిష్ణమోహన్, కృష్ణయ్య, సీపీఐ నేతలు దమ్ముదర్గాబాబు, బోస్, వెంకటేశ్వర్లు, స్త్రీవిముక్తి సంఘటన నాయకురాలు శ్యామల, ఉపాధ్యాయ నాయకులు గురునాథశర్మ, ప్రజాసంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉలవపాడు : విద్యుత్ పోరాట అమరవీరుల దినోత్సవం సందర్భంగా గురువారం సీపీఎం ఆధ్వర్యంలో ఉలవపాడులో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా సీపీఎం ప్రాంతీయ కమిటీ కార్యదర్శి కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై ట్రూఅప్ సర్ చార్జీల రూపంలో విధిస్తున్న విద్యుత్ చార్జీల భారాలను రద్దు చేయాలని, ప్రీపెయిడ్ స్మార్ట్ మీటరులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం ప్రాంతీయ కమిటీ నాయకులు కత్తి సుజాత, సీపీఎం నాయకులు వీసం, విజయ్‌కుమార్, ఎం లలితమ్మ, అంకమ్మరావు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో మౌలిక సదుపాయాల అభివృద్ధి : ఎమ్మెల్యే ఇంటూరి


రోడ్డు వైడనింగ్, డివైడర్, సెంట్రల్ లైటింగ్ పనులకు శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పట్టణ జనాభా పెరుగుదలకు అనుగుణంగా మౌలికసదుపాయాలను అభివృద్ధి చేయటం, ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారం లక్ష్యంగా ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. కందుకూరులో జ్వాలాముఖి అమ్మవారి ఆలయం సెంటర్ నుంచి సెయింట్‌పీటర్ స్కూల్ వరకు రోడ్డు వైడనింగ్, సెంట్రల్ డివైడర్, లైటింగ్‌సిస్టమ్ ఏర్పాటు పనులకు, కోటారెడ్డి ఆసుపత్రి సర్కిల్‌లోని దివి కొండయ్య విగ్రహం వద్ద నుంచి వాసవీకాలనీ వరకు సీసీ కాలువ నిర్మాణ పనులకు గురువారం ఎమ్మెల్యే భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పట్టణంలో గతంలో ఎన్నడూ ఎవరికీ ఇవ్వని మెజారిటీని ప్రజలు తనకు అందించి ఆశీర్వదించారని, వారి ఆకాంక్షల మేరకు అభివృద్ధి చేసి చూయించాలన్న లక్ష్యంతో కృషిచేస్తున్నానని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే. అనూష, డీఈ గణపతి, టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, ఉన్నం వీరాస్వామి, చల్లా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


- విభిన్నప్రతిభావంతులపై ప్రత్యేకదృష్టి

విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థుల శ్రేయస్సుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిపెట్టి తగిన ప్రోత్సాహకాలు అందిస్తోందని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ఎంఈవో కార్యాలయం ఆవరణలో గురువారం విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు విద్యాశాఖ - సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఉచిత ఉపకరణాల కోసం నిర్ధారణ శిబిరాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ దివ్యాంగులకు కూటమిప్రభుత్వం ప్రతినెలా 6వేల ఫించన్ ఇవ్వటంతో పాటు పాఠశాలలకు వెళ్లే దివ్యాంగ విద్యార్థులకు ట్రావెలింగ్ అలవెన్స్ కూడా పెంచిందన్నారు. రాష్ట్ర ఏఈ కో ఆర్డినేటర్ మల్లికార్జున మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లలను భవితకేంద్రాలకు క్రమంతప్పకుండా పంపాలన్నారు. ఈ సందర్భంగా 100మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు వైద్యులు స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవోలు ఎం. నాగకుమారశర్మ, సుబ్బారెడ్డి, తహసీల్దార్ లావణ్య, ఎంపీడీవో రత్నజ్యోతి, టీడీపీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, దామా మల్లేశ్వరరావు, ఉన్నం భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

- స్మార్ట్ కార్డులతో అక్రమాలకు చెక్ : ఇంటూరి

వలేటివారిపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : స్మార్ట్‌కార్డుల పంపిణీతో అక్రమాలకు చెక్ పెట్టవచ్చని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని బడేవారిపాలెంలో గురువారం లబ్ధిదారులకు స్మార్ట్‌కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వగ్రామంలో ప్రజలకు స్మార్ట్ కార్డులు పంపిణీ చేయండం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నయాంఅహ్మద్, టీడీపీ మండల అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు తాటికొండ సింహాద్రి, పొడపాటి నరసింహం, ఇంటూరి శంకరయ్య, కృష్ణ, గురిజాల బెంజిమెన్, వలేటి నరసింహం ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కమ్మేసిన ముళ్ల చెట్లతో ప్రమాదాలు



వలేటివారిపాలెం, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : వలేటివారిపాలెం నుంచి చినఅమ్మపాలెంకు వెళ్లే గ్రావెల్‌రోడ్డు చిల్లచెట్లతో మూసుకుపోయింది. దీంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అంతేకాక వాహనాలు ఎదురెదురుగా వచ్చే సమయంలో వాహనదారులు మార్జిన్ దిగితే ముళ్ల చెట్లు తగిలి ద్విచక్రవాహనదారులకు గాయాలవుతున్నాయి. వలేటివారిపాలెం నుంచి చినఅమ్మపాలెంనకు తక్కువ దూరం కావడం, సమయం ఆదా అవడంతో వాహనదారులు ఈ రోడ్డుపై వెళ్తుంటారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చిల్లచెట్లు తొలగించాలి.

పోలీసుల అదుపులో ఎమ్మెల్యే రెక్కీ కేసు నిందితులు

జలదంకి, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డిపై ఈనెల 19న జలదంకి మండలం అన్నవరంలోని గురురాఘవేంద్ర స్టోన్‌క్రషర్స్ వద్ద డ్రోన్‌కెమెరాతో రెక్కీ నిర్వహించిన కేసులో నిందితులైన ఆత్మకూరి రాజేష్, దామెర్ల శ్రావణ్‌లను గురువారం కావలి సబ్‌డివిజన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. రెక్కీకి గల కారణాలపై పోలీసులు వారిని విచారిస్తున్నట్లు తెలిసింది. ఇదిలా ఉండగా ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు నిందితులు కోర్టు ఆదేశానుసారం రిమాండ్‌లో ఉండగా, కావలి మాజీఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి ఐదో నిందితుడిగా ఉన్నారు.

ఆర్ఎస్ఆర్‌లో ఇన్ఫోసిస్ ఫౌండేషన్ శిక్షణ

బిట్రగుంట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం కడనూతలోని ఆర్ఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల్లో ఇన్ఫోసిస్ ఫౌండేషన్, ఐసిటీ అకాడమీ వారు గురువారం శిక్షణ నిర్వహించారు. ఐసిటీ అకాడమీకి చెందిన నందిని తోట ప్రాక్టికల్ ఆధారిత సెషన్లను నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రిన్సిపాల్ పీవీఎస్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ సునీల్‌రెడ్డి, డైరెక్టర్ రాజారెడ్డి, ఏవో రమణారెడ్డి, ఇన్ఫోసిస్ ఫౌండేషన్, ఐసిటీ అకాడమీ ఎస్‌పీవోసీ డా. సత్యనారాయణరెడ్డి మహిళా మెంటార్లు డాక్టర్ బృందావని, లిల్లీగ్రేస్‌మేరీ, తదితరులు పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్యకు పరిష్కారం

బిట్రగుంట, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం బేతనీపేట ప్రజలు నిత్యం విద్యుత్ లోఓల్టేజీతో సతమతమవుతుండటంతో విద్యుత్ శాఖ ఏఈ జడరాయ గురువారం 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టీడీపీ నేత జీ.సంజయ్ మాట్లాడుతూ విద్యు త్ సమస్యను కావలి ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోవడంతో యుద్ధ ప్రాతిపదికన 63కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు రెండు మార్చి 100 కేవీ ఏర్పాటు చేశారని అన్నారు. రానున్న వర్షాలను దృష్టిలో పెట్టు కుని వెంకటనే సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డితోపాటు విద్యుత్ ఏఈకి గ్రామస్థులు వినోద్, సుబ్బరాయుడు, రాజేంద్ర, బన్ని, డ్యాని కృతజ్ఞతలు తెలిపారు.

యూరియా నిల్వల కోసం ప్రతిపాదనలు


లింగ సముద్రం : అన్నెబోయినపల్లిలో పత్తి పైరును పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ ఏవో హర్షవర్ధన్

కందుకూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మాచవరం, పాలూరు - దొండపాడు, మోపాడు రైతు సేవాకేంద్రాల పరిధిలోని గ్రామాల్లో ప్రస్తుతం వరిసాగులో ఉన్నందున ఆయా కేంద్రాలలో యూరియా నిల్వలు అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు ఏవో అబ్దుల్‌రహీం ఒక ప్రకటనలో తెలిపారు. మాచవరంలో 303 ఎకరాలు, పాలూరు - దొండపాడు పరిధిలో 165 ఎకరాలు, మోపాడులో 20 ఎకరాలు ప్రస్తుతం వరిసాగులో ఉందని, మరికొంత విస్తీర్ణం నాట్లుకోసం సిద్ధం చేస్తున్నందున రైతులు ఎరువుల కోసం ఇబ్బంది పడకుండా ఆర్ఎస్‌కేలలో ఎరువుల నిల్వకు చర్యలు తీసుకోవాల్సిందిగా ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

- పంటల సాగులో మెలకువలు పాటించాలి

వలేటివారిపాలెం : పంటల సాగులో రైతులు మెలకువలు పాటించాలని ఏవో శేషరెడ్డి తెలిపారు. మండలంలోని శామీరపాలెం రైతు సేవా కేంద్రంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏవో మాట్లాడుతూ పంటలపై వ్యాపించే చీడపీడల నివారణపై రైతులు అవగాహన పెంపొందించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది సురేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

- **లింగసముద్రం :** పత్తి పైరులో తెగుళ్ల నివారణకు రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల ఇన్‌చార్జ్ వ్యవసాయ అధికారి కే. హర్షవర్ధన్ తెలిపారు.గురువారం మండలంలోని వీఆర్ కోట, అన్నెబోయినపల్లి గ్రామాల్లో ఆయన పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వీఏఏ రాజశేఖర్, ఏఎంసీ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.



బుచ్చిలో ఊంజల్ వినాయకుడు



కోవూరులో..



నెల్లూరు : రాణాప్రతాప్ సెంటర్‌లో కొలువుదీరిన 19 అడుగుల కల్కి వినాయకుడు



సంగం : వంగల్లులో



నెల్లూరు : చంద్రమౌళినగర్ 12వ వీధిలో..



ఆత్మకూరు : కన్యకాపరమేశ్వరి ఆలయంలో వేంకటేశ్వరుడిగా..



నెల్లూరు : మినీబైపాస్‌లో లంబోదరుడిగా..



రాపూరు : సిద్ధలయ్య సెంటర్‌లో





నెల్లూరు నగరంలో ఆకట్టుకున్న విద్యుద్దీపాలంకరణ

జలదంకి : ఉత్సవ నిర్వాహకులకూ యూనిఫాం



ఊరూరా.. వెరైటీ గణపయ్యలు!

ఉండ్రాళ్ల పండగంటే ఊరంతా సంబరమే! గణనాథుల రూపం వేరైనా.. భక్తులను రక్షించే మార్గం ఒక్కటే. కోటీశ్వరులకైనా.. కటిక పేదలకైనా విఘ్న వినాయకుడి దర్శన భాగ్యమూ ఒక్కటే! వినాయక చవితి రోజున వీధి వీధిలో వెరైటీ బొజ్జ గణపయ్యలు వెలిశారు. ఆబాలగోపాలానికీ అసలైన వేడుక తెచ్చారు. వంగల్లులో నాగపడగల వినాయకుడు.. రాపూరులో మహా గణపతి.. సంగంలో శ్రీరాముడి వేషధారణలో బొజ్జ గణపయ్యలు ప్రత్యేక పూజలందుకున్నారు. పొదలకూరులో లింగేశ్వరుడికి విఘ్నేశ్వరుడు ప్రదక్షిణలు చేయడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. బుచ్చిలో ఊంజల్ వినాయకుడు దర్శనమిచ్చాడు. వైకుంఠపురంలో గరుడుడిపై గణపతి నాట్యమాడారు. బిట్రగుంటలో నందివాహనంపై ఊరేగుతూ కనువిందు చేశారు. రంగు రంగుల విద్యుద్దీప కాంతుల్లో తళుకులీనే విగ్రహాలను దర్శించుకున్న భక్తకోటి జన్మ ధన్యమైంది.

- ఆంధ్రజ్యోతి బృందం

చిన్నారుల ఆనందకేళి : కావలి రూరల్ : బుజ్జి గణపయ్యను చెక్క బండిపై నిమజ్జనానికి తరలిస్తున్న చిన్నారులు





నెల్లూరు : వేదాయపాళెం సెంటర్‌లో..

జిల్లాలో సమృద్ధిగా నీటినిల్వలు

100 టీఎంసీల నిల్వ ఒక నూతన అధ్యాయం

దేవదాయ శాఖ మంత్రి ఆనం

నెల్లూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సోమశిల, కండలేరు జలాశయాలు కళకళలాడుతున్నాయని, రెండో పంటకు నీళ్లిచ్చిన తర్వాత కూడా ఈ రెండు జలాశయాల్లో 100 టీఎంసీల నీరు నిల్వ ఉండడం ఒక నూతన అధ్యాయమని రాష్ట్ర దేవదాయ, ధర్మదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అన్నారు. గురువారం నెల్లూరులోని తన క్యాంపు కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. మొత్తం 100 మందికి రూ.83.34 లక్షలను లబ్ధిదారులకు అందించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం తొలి ఏడాది చేపట్టిన సమర్థవంతమైన సాగునీటి నిర్వహణ వల్ల ప్రస్తుతం జిల్లాలో సమృద్ధిగా నీటి నిల్వలు ఉన్నాయని ఆనం పేర్కొన్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాతోపాటు శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో రెండో పంట గానూ 5.24 లక్షల ఎకరాలకు నీరు ఇచ్చినట్లు గుర్తు చేశారు. రైతులంతా నీటిని వృథా చేయకుండా నీటిని వినియోగించుకోవాలని కోరారు. గోదావరి, కృష్ణా, పెన్నా నదులను అనుసంధానం చేసి రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు పనిచేస్తున్నారని మంత్రి ఆనం స్పష్టం చేశారు. ఈ బృహత్తర ప్రణాళికకు రూ.84 వేల కోట్లు ఖర్చువుతందని చెప్పారు. అతి త్వరలో పోలవరం పూర్తవుతుందని, త్వరలోనే బనకచర్ల ప్రాజెక్టు కూడా పట్టాలెక్కుతుందని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే హంద్రీనీవా ప్రాజెక్టును పూర్తి చేశామని ఆనం గుర్తు చేశారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి ఆనం

లైంగిక దాడి కేసులో 20 ఏళ్ల జైలు, జరిమానా

నెల్లూరు (లీగల్), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : ఓ బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ కేసులో నేరం రుజువు కావడంతో కొమ్మా శ్రీనివాసులు అనే నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార జైలు శిక్ష తోపాటు 20 వేల రూపాయల జరిమానా విధిస్తూ నెల్లూరు జిల్లా పోక్సో కోర్టు స్పెషల్ జడ్జి సిరిపిరెడ్డి సుమ గురువారం తీర్పు చెప్పారు, ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ప్రస్తుత తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం తీపనూరు గ్రామానికి చెందిన నిందితుడు కొమ్మా శ్రీనివాసులు 2021 జూలై నెల 14న అదే గ్రామానికి చెందిన ఓ బాలికను కిడ్నాప్ చేసి అమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ మేరకు చిల్లకూరు పోలీసులు నిందితుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో జైలు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఏపీపీ చంద్రశేఖర్ వాదించారు.

కలపకు బహిరంగ వేలం

ఉదయగిరి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక అటవీ శాఖ కార్యాలయంలో గురువారం కలపకు బహిరంగ వేలంపాట నిర్వహించారు. ఈనెల 8న ఆంధ్రజ్యోతి దినపత్రికలో 'ఈ కలప ఇంతేనా' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఉన్నతాధికారులు వేలంపాట నిర్వహించారు. ఈసందర్భంగా రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజా మాట్లాడుతూ విజయవాడ-బెంగళూరు వరకు చేపడుతున్న 554-జీ జాతీయ రహదారి నిర్మాణంలో సీతారామపురం రిజర్వు ఫారెస్టులో 28.09 హెక్టార్లలో సేకరించిన వంటచెరకు 325.80 సీఎంటీ, టింబర్ 32.113 సీఎంటీలకు బహిరంగ వేలంపాట నిర్వహించడం జరిగిందన్నారు. ఈ వేలంపాటలో ఎనిమిది మంది పాల్గొనగా దేకూరుపల్లి గ్రామానికి చెందిన కావేటి వెంకటేశ్వర్లు వంట చెరకు రూ.4 లక్షలు, టింబర్ రూ.65 వేలకు హెచ్చు పాట పాడి దక్కించుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో చినవెంకటయ్య, ఏబీవో బచ్చల వెంకటేశ్వర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



వేలంపాట నిర్వహిస్తున్న రేంజ్ అధికారి కుమారరాజా

రోడ్డు ప్రమాదంలో మున్సిపల్ ఉద్యోగి దుర్మరణం

కావలి రూరల్, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దూరుపాడు జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని మున్సిపల్ బిల్ కలెక్టర్ షేక్ రసూల్(53) మృతి చెందారు. రూరల్ పోలీసుల కథనం మేరకు, పట్టణంలోని జెండావీధికి చెందిన రసూల్ 35 ఏళ్లుగా బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన భార్య ముజీబా మనస్పర్థలతో పదేళ్లుగా వేరుగా ఉంటున్నారు. ఇద్దరు కుమారులతో రసూల్ తన తల్లి వద్ద ఉంటున్నారు. ముజీబా కుమార్తెతో వేరుగా ఉంటోంది. మద్దూరుపాడు టిడ్కో ఇళ్లల్లో ఉంటున్న స్నేహితుడు సికిందర్ వద్దకు వెళ్లిన రసూల్ ఆత్మకూరుకు వెళ్లాలని కావలి వచ్చేందుకు రోడ్డు పక్కన నడుచుకుంటూ వస్తున్నారు. ఆ సమయంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొంది. దీంతో తీవ్రంగా గాయపడిన రసూల్‌ను హైవే అంబులెన్స్‌లో ఏరియా వైద్యశాలకు తరలించగా చికిత్సపొందుతూ మృతి చెందారు. మృతుడి కుమారుడు అల్తాఫ్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ బాజీబాబు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుకు గృహోపకరణాల దగ్ధం

కావలి రూరల్: పట్టణంలోని ముసునూరు ఇందిరమ్మకాలనీ అట్టల ఫ్యాక్టరీ సమీపంలో మంగళవారం అర్ధరాత్రి పిడుగుపాటుకు ఫ్యాన్లు, టీవీలు కాలిపోయాయని ఆ ప్రాంతవాసులు పేర్కొన్నారు. అర్ధరాత్రి వర్షంతోపాటు పెద్ద శబ్దంరావడం, విద్యుత్ హెచ్చుతగ్గులు వచ్చి కాలనీలోని మాదాల వెంకటేశ్వర్లు, కంచర్ల సురేష్, మాతయ్య ఇళ్లలోని ఫ్యాన్లతోపాటు పలువురి ఇళ్లల్లోని టీవీలు కూడా కాలిపోయాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

విద్యుత్ కోతలపై ముందస్తు సమాచారం ఇవ్వాలి

- కలెక్టర్ ఆనంద్ ఆదేశాలు
- పారిశ్రామిక ప్రోత్సాహక కమిటీ సమావేశం

నెల్లూరు(వెంకటేశ్వరపురం), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఇండస్ట్రియల్ పార్కుల్లో ముందస్తుగా సమాచారం ఇచ్చిన తరువాత విద్యుత్ కోతలు విధించాలని కలెక్టర్ ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో గురువారం జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా 2723 దరఖాస్తులురాగా అందులో 2432 దరఖాస్తులను ఆమోదించామని చెప్పారు. 21 దరఖాస్తులు తిరస్కరించగా 270 పెండింగ్‌లో ఉన్నాయ న్నారు. పెండింగ్ దరఖాస్తులను సంబంధిత శాఖలు వెంటనే పరిశీలించి ఆమోదించాలని సూచించారు. జిల్లాలో మెగా ప్రాజెక్టుల ద్వారా 13,599 మందికి, భారీ పరిశ్రమల ద్వారా 5,557 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఏర్పాటు అవుతున్న పరిశ్రమల పురోగతిని పరిశీలించి అవసరమైన అన్నీ వసతులను కల్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, పరిశ్రమలశాఖ జీఎం మారుతీ ప్రసాద్, ఏపీఐఐసీ జెడ్ఎం శివకుమార్, ఆర్‌డీవోలు అనూష, పావని, వంశీకృష్ణ పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న వామపక్ష నాయకులు

స్మార్ట్ మీటర్లు రద్దు చేయాలి

- వామపక్షాల 'విద్యుత్' ప్రతిజ్ఞ
- అమరవీరులకు జోహార్లు

నెల్లూరు (వైద్యం), ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి) : పెంచిన విద్యుత్‌చార్జీలు, ట్రూఅప్ చార్జీలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ప్రక్రియను ఉపసంహరించాలంటూ వామపక్ష నాయకులు గురువారం నెల్లూరులో నిరసన తెలిపారు. ప్రతిజ్ఞ దినం పేరుతో ప్రదర్శన నిర్వహించారు. విద్యుత్ అమర వీరులకు జోహార్లు అర్పించారు. విద్యుత్ స్మార్ట్ మీటర్లను సమైక్యంగా అడ్డుకుంటామంటూ మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం అంబేడ్కర్ విగ్రహం వద్ద నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ హయాంలో విద్యుత్ చార్జీల పెంపు, ప్రపంచ బ్యాంకు సంస్కరణలకు వ్యతిరేకంగా అప్పట్లో చేపట్టిన ఉద్యమ సమయంలో పోలీసుల కారణంగా జిల్లాకు చెందిన రామకృష్ణ, బాలస్వామి, విష్ణువర్ధన్ రెడ్డి ప్రాణాలు కోల్పోయారని చెప్పారు. ఈ దుర్ఘటన జరిగి 25 ఏళ్లు పూర్తయిందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి అరిగెల సాయి మాట్లాడుతూ విద్యుత్ చార్జీలు తగ్గించాలన్న ఉద్యమంలో అమరులైన వారి త్యాగానికి గుర్తుగా విద్యుత్ అమర వీరుల దినోత్సవం జరుపుకుంటున్నామని చెప్పారు. విద్యుత్ స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా ప్రజా పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీపీఐ ఎంఎల్ న్యూడెమాక్రసీ నాయకుడు రాంబాబు, ఎస్‌యూటీఐ నాయకుడు బసవరాజు పాల్గొన్నారు.

కందుకూరులో మూడు కార్ల దగ్ధం

- దుండగుల దుశ్చర్యగా బాధితుల అనుమానం

కందుకూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తూర్పు పద్మశాలిపాలెంలో ఒకే కుటుంబంలోని ముగ్గురు అన్నదమ్ములకు చెందిన కార్లు అగ్నికి ఆహుతయ్యాయి. గురువారం వేకువజామున మూడు గంటల సమయంలో ఇంటి బయట మంటలు కనిపించ డంతో వారు బయటకు వచ్చి చూశారు. మూడుకార్లు మంటల్లో కాలిపోతూ కనిపించాయి. కవర్తపు నరేష్, కవర్తపు శ్రీమాన్య, వారి సోదరుడి కార్లు అగ్నికి ఆహుతయ్యాయి. అప్పటికే నరేష్‌కి చెందిన స్విఫ్ట్ డిజైర్ కారు పూర్తిగా కాలిపోగా, ఆల్టో కారు పాక్షికంగా కాలిపోయింది. మరో కారు కొద్ది నష్టంతో మంటలను ఆర్పగలిగారు. కార్లు దగ్ధమైన ప్రదేశంలో అగ్గిపుల్లలు ఉండటంతోపాటు వైట్‌నర్ వాసన వస్తుండటాన్ని బట్టి ఎవరో దుండగులు నిప్పుపెట్టి తగులబెట్టారని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. పట్టణ ఎస్ఐ శివనాగరాజు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. క్లూస్‌టీం ఆధారాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనపై బాధితులు మాట్లాడుతూ తమకెవరూ శత్రువులు లేరని, పదిహేనురోజులక్రితం కవర్తపు శ్రీమాన్య తండ్రిని చర్చి సెంటర్‌లో ఓ గుర్తుతెలియని మోటారుసైకిల్ ఢీకొట్టాడు. దీంతో ఆయన తీవ్ర గాయాలపాలయ్యాడని, ఆ కేసులో మోటారుసైకిలిస్టును పోలీసులు గుర్తించి కేసు నమోదు చేయగా వారు రాజీకి రావాలని కోరగా మేము తిరస్కరించామని వారు చెప్పారు. రాజీకి అంగీకరించలేదని వారు ఏమైనా కక్షకట్టి ఈదుశ్చర్యకు పాల్పడ్డారా.. లేక మరెవరైనా చేశారా..? అనే అనుమానాలు కలుగుతున్నాయని బాధితులు పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనం పెట్టని నిర్వాహకులు

- వైకుంఠపురం మున్సిపల్ స్కూల్‌లో ఘటన
- కావలిలో తల్లిదండ్రుల ఆందోళన
- చందాలు వేసుకుని భోజనం తెప్పించిన టీచర్లు
- స్వయంగా వారే వడ్డన

కావలి,ఆగస్టు28 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైకుంఠపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో గురువారం మధ్యాహ్న భోజనం నిర్వాహకురాలు విద్యార్థులకు అన్నం పెట్టకుండా నిలిపివేశారు. దీంతో విద్యార్థుల తల్లిదం డ్రులు పాఠశాల వద్దకు చేరుకుని ఆందోళన చేపట్టారు. 'మధ్యాహ్నభోజన నిర్వాహకురాలినైనా మార్చండి... లేదంటే మా పిల్లలకు టీసీలు ఇచ్చైనా పంపండి'... అంటూ పాఠశాల వద్ద వారు ఆందోళన చేశారు. దీంతో ఉపాధ్యాయులే చందాలు వేసుకుని విద్యార్థులకు హోటల్ నుంచి భోజనం తెప్పించి పెట్టారు.

కాగా ఆ పాఠశాలలో 120 మంది విద్యార్థులు, ఒక హెచ్‌ఎం, నలుగురు ఉపాధ్యాయులు ఉన్నారు. అక్కడ పని చేస్తున్న హెచ్‌ఎం, టీచర్లంతా ఈ ఏడాదే బదిలీపై వచ్చారు. అయితే కొంతకాలంగా అక్కడ విద్యార్థుల తల్లిదండ్రులతో, విద్యాకమిటీతో మధ్యాహ్న భోజన నిర్వాహకురాలికి మధ్య గొడవలు ఉన్నాయి. ఈనెల 23న హెచ్‌ఎం విద్యాకమిటీతో సమావేశం నిర్వహించారు. కమిటీ వారు మధ్యాహ్న భోజన నిర్వాహకురాలిపై భోజనం బాగాలేదని ఆరోపణలు చేశారు. ఆమెను తొలగించనిదే పాఠశాలకు తమ పిల్లలను పంపమని పేర్కొన్నారు. ఈ క్రమంలో గురువారం రాగి జావను ఆలస్యంగా తీసుకువచ్చిన నిర్వాహకురాలు కోటేశ్వరమ్మను 'ఆలస్యంగా తెస్తే ఎలా...? అని ప్రశ్నించారు. దీంతో ఆమె మధ్యాహ్న భోజనమే పెట్టకుండా ఆపేసింది. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు పాఠశాల వద్దకు వచ్చి ఆందోళన చేపట్టగా ఉపాధ్యాయులే తమ నగదుతో హోటల్ నుంచి అన్నం తెప్పించి విద్యార్థులకు పెట్టారు.



విద్యార్థికి భోజనం వడ్డిస్తున్న ఉపాధ్యాయుడు

నిర్వాహకురాలిని తొలగిస్తాం

విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెట్టలేదన్న విషయం నా దృష్టికి కూడా వచ్చింది. అక్కడ మధ్యాహ్న భోజనం నిర్వాహకురాలికి, విద్యార్థుల తల్లిదండ్రుల మధ్య కొంత గ్యాప్ ఉంది. దీంతో ఆ నిర్వాహకురాలిని తొలగించి మరొకరిని నియమిస్తాం.

- గోవిందయ్య, ఎంఈవో, కావలి